ఆంధ్రపత్రి…


సచిత్ర వారపత్రిక



4 అణాలు

26-11-52

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY



నెపోలియన్‌ని జయించిన రష్యన్ వీరుడు మైఖేల్ కుటుజోవ్ శిలాప్రతిమ
—శిల్పకారుడు యస్. డి. మెర్కురోవ్. (టాస్ వార్తాసంస్థ)

సంవత్సర చందా రు. 12-0-0 విడిప్రతి 4 అ.	# ఆంధ్రపత్రిక సచిత్రవారపత్రిక	సంపుటము 45 సంచిక 14 **26.11-52**

Founder : K. NAGESWARA RAO

నందన మార్గశిర శుద్ధ దశమి బుధవారము.



బుద్ధుడు

గోటితో గీసిన చిత్రానికి ఫొటో—చిత్రకారుడు శ్రీ వి. సూరన్నగారు.

—మద్రాసు.

విషయానుక్రమణిక

కాలక్షేపం

ఆ విప్రోత్తము వజ్ర పంజర నిభంబై
నిశ్చలంబైన స
ద్భావం, బంగనసాహచర్య గుణ
సంపర్కంబునన్, లోహమై,
గ్రావంబై, దృఢదారువై, తరుణ
వృక్షంబై, ఫలప్రాయమై,
పూవై, తన్మకరందమై, కరగం
బోం బో నీళ్లకుం బల్చనై.

స్త్రీయొక్క సాహచర్యమువల్లను ఆమె యొక్క గుణసంపర్కమువల్లను ఆ బ్రాహ్మణోత్తముని (ఆ విప్రనారాయణుని) మంచి స్వభావము పూర్తిగా మారిపోయింది. ఏమాత్రమూ చలించకుండా వజ్రపంజరంతో సమానముగా నుండిన అతని స్వభావము లోహమువంటి స్థితిలోనికివచ్చింది. అనగా వజ్రమునకు ఉన్నంత గట్టిదనము పోయి, ఇనుమునకు ఉండేగట్టిదనములోనికి వచ్చి ఒకమెట్టుదిగింది. అటుపిమ్మట, రాయి వంటిస్థితిలోకి వచ్చింది. అనంతరము గట్టి కొయ్యవలెమారింది. అటుతర్వాత, ఆ కొయ్యవంటి మనస్సు చిగిర్చిన మానువలె అయింది. అది క్రమేణ పండ్లుఫలించే స్థితిలోకివచ్చింది. ఆ మాను పూవులు పూచినదై పూవువంటి కోమలస్థితిలోకివచ్చింది. ఆ పూవులోని తేనెవలె అతనిమనస్సు ఇంకా కరగిపోయింది. అది ఇంకా కరగిపోయి పోబో నీళ్ళకున్ పల్చనైపోయింది. "నీళ్ళకంటె పల్చనైపోయింది అతని మనస్సు"అని శ్రీ సారంగు తమ్మయ్య కవి యీపద్యం ముగించాడు. నీళ్ళకంటె పల్చనైన ద్రవపదార్థాలు కూడా ఉన్నాయి. కిరసనాయిలు నీళ్ళపైన తేలుతుంవి. కిరసనాయిలు వంటి ద్రవపదార్థంగాకూడా మారిపోయి, చివరకు జ్యోతియై, జ్వాలయై, ఆ స్త్రీసంపర్కమునకు అతని మనస్సు ఆహుతియై కర్పూరము వలె హారించి పోయినదనిమాత్రము ఆ కవి తన పద్యాన్ని ముగించి అవిప్రనారాయణునకొక మంగళ హారతి పాడలేదు.

విప్రనారాయణుడు ఒక వైష్ణవ బ్రహ్మచారి. శ్రీరంగంలో రంగనాథస్వామి ఆలయంలో ఉంటూ ఉండేవాడు. తులసి మాలలు కట్టి స్వామికి సమర్పిస్తూ ఉండేవాడు. మాధుకరంచేసి జీవిస్తూ ఉండేవాడు. ఆలయంలోనే సదా స్వామిని ధ్యానిస్తూ నియమ నిష్ఠాగరిష్ఠుడై ఉంటూ ఉండేవాడు. దేవస్థానం తాలూకు మధురవాణి, దేవదేవి అనే వేశ్యలు ఇద్దరు ఉండేవారు. మధురవాణి పెద్దది. దాని చెల్లెలు దేవదేవి. వీళ్ళిద్దరూ ఆలయంలోకి వెళ్ళి అక్కడవున్న విప్రనారాయణుడనే బ్రహ్మచారికి నమస్కరిస్తే అతడు వారిని లక్ష్యం చేయకుండానే తలవంచుకొని పోయినాడు. "అతడు చాలా నిష్ఠాగరిష్ఠుడు. అతని వైరాగ్యభావం చలించేది కాదు కనుక మన శృంగారచేష్టలు అతని మనస్సును ఆకర్షింపజేయజాలవు" అని అక్కయైన మధురవాణి చెప్పింది. "వీని మనస్సు ఎట్లాగైనా నేను వశపర్చుకొని, అతనిని వైరాగ్యనిష్ఠలోనుంచి శృంగార చేష్టలలోకి దింపగలను" అని చెల్లెలైన దేవదేవి శపథం చేసింది. తన ప్రతిజ్ఞ నెరవేర్చుకొనడానికి, ఆ విప్రనారాయణుని వద్ద తానొక భక్తురాలుగా శిష్యురాలుగా చేరింది. ఆయనకు ఉపచారాలు చేసిచేసి అతనిని మెప్పించింది. ఈ ఉపచారాల మూలంగా తాను అతనికి చేయదలంచిన అపచారంకూడా చేసింది. అతనిని మెప్పించి ఒప్పించింది. మురిపించి మురిపించింది. వలచి వలపించింది. ఆయనను తన విటునిగా చేసింది. వేశ్యయింట్లో విప్రనారాయణుడు విషయలోలుడై ఉన్నాడు. అతడు ఏదైనా రొక్కంతెచ్చి సమర్పిస్తేనేగాని యింట్లో ఉండుటకు వీలులేదని దేవదేవి యొక్క తల్లి విప్రనారాయణుని వెళ్ళగొట్టింది. విప్రనారాయణుడు తిరిగి ఆలయంలోని తులసివనం చేరి శ్రీరంగనాథునకు తన హృదయావేదన చెప్పుకున్నాడు. శ్రీరంగనాథుడే తాను విప్రనారాయణుని శిష్యుడనని చెప్పుకొని దేవదేవి ఇంటికి వెళ్లి తనఆలయంలోఉన్న బంగారుగిన్నెను దేవదేవికి యిచ్చి, "యీ గిన్నెను నీకు యివ్వవలసినదిగా విప్రనారాయణుడు నన్ను పంపియున్నాడు" అని ఆ వేశ్యాంగనకు రంగడు తెలియజేశాడు. దేవదేవియొక్క తల్లి సంతోషించి తిరిగి విప్రనారాయణుని పిలిపించింది. కాని, ఆలయంలోని బంగారు గిన్నె పోయినదని ధర్మకర్తలకు అర్చకుడు విన్నవించాడు. ఊరిలోని యిళ్లన్నీ భటుల చేత సోదాచేయిస్తే దేవదేవి యింట్లో యీ గిన్నె దొరికింది. అప్పుడు విప్రనారాయణుని ధర్మకర్తలు పిలిపించి, "నిజం చెప్పి నేరం ఒప్పుకో!" అన్నారు. అప్పుడా వైష్ణవభక్తుడు స్వామియైన శ్రీరంగనాథుని వేడుకొని మొఱ పెట్టుకున్నాడు. అతని ఆర్తనాదం భగవంతునకు వినిపించింది. స్వామి ప్రత్యక్షుమై, తానే యీ గిన్నెను దేవదేవికి అందజేసితినని ధర్మకర్తలకు తెలియబరిచాడు. తన మెడలోని వైజయంతీమాలయొక్క అంశమై యీ విప్రనారాయణుడు యీ విధంగా జన్మించినాడని శ్రీరంగనాథుడు ధర్మకర్తలకు తెలియజేశాడు. విప్రనారాయణుడు దేవదేవి వలలో పడేటట్లు చేసింది కూడా తానే యని శ్రీరంగనాథుడు వివరించాడు. ఈ మహనీయుడే వైష్ణవ భక్తాగ్రేసరులగు పన్నిద్దరాళ్వారులలో ఒకడైన "తొండరడిప్పొడి ఆళ్వారు". "తొండర్" అనగా భక్తులయొక్క "అడి" అనగా అడుగుల (పాదముల) పొడి అనగా ధూళి—తాను భక్తుల అంఘ్రిరేణువును అని ఆ మహాభక్తుడు చెప్పుకొనేవాడు. అతడే "భక్తాంఘ్రిరేణువు" అనబడే "తొండరడిప్పొడి ఆళ్వారు"—

"భక్తుల పాదములకు అంటియున్న పరమాణువును నేను" అని ఎవడైతే త్రికరణశుద్ధిగా చెప్పుకోగలడో వాడు నిజంగా భక్తాగ్రగణ్యుడవుతాడు. భక్తిమార్గంలో ఉన్న మహోత్కృష్టవిషయమే అది. "అహంబ్రహ్మ" (నేనే బ్రహ్మను; భగవంతుడు నాలోనే ఉన్నాడు) అనే రాగం భక్తిమార్గం సాధకంచేసే భక్తుడు ఆలాపన చెయ్యడు. అదంతా జ్ఞానమార్గం సాధకం చేసేవాడు జపించేమన్త్రం. "సర్వధర్మాం

[illegible]

★ కాలక్షేపం ★

పరిత్యజ్య మామేకం శరణంవ్రజ” అనేది వైష్ణవభక్తి ప్రపత్తికి మూలసూత్రము. “నీవు నిర్వర్తించవలసిన విధ్యుక్తధర్మములను కర్మానుష్ఠానములను అన్నింటినీ నియమనిష్ఠా గరిష్ఠుండవై నిర్వర్తిస్తేనే నీ ఆత్మ పరిపక్వమై ముక్తినిపొందుటకు సాధ్యమవుతుందని భ్రమపడవద్దు. ఈ స్నానసంధ్యాది అనుష్ఠానములను అన్నింటినీ పరిత్యజించి నన్ను ఒక్కనినే శరణుజొచ్చి, నన్ను మనస్ఫూర్తిగా నీవు నమ్మకొన్నట్లయితే అటువంటి భక్తితత్పరత్వంవల్లనే నీవు ముక్తినిపొందగలవు” అని భగవద్గీతలో చెప్పబడినవాక్యం భక్తిమార్గాన్ని అనుసరించేవాళ్లకొక ఫర్మానా యిచ్చినట్లుగా ఉంది. నియమనిష్ఠలతోకూడిన కర్మమార్గాన్ని తూచాలు తప్పకుండా అనుసరించి ఆచరించవలెను. ఆమాటనిజమే. కాని, ఆ విధంగా అనుష్ఠించనివాడు అంతటితో అధోగతిపాలై పోతాడనే భయం ఉండనక్కర లేదన్నారు. కర్మమార్గం కరెక్టుగా అనుష్ఠించడమూ, ధర్మశాస్త్రాలుఅన్నీ తిరగవేసి ధర్మాధర్మ విచక్షణచేస్తూ “నిర్మలధర్మకర్మ దీక్షా పరతంతంత్రుడై” ప్రవర్తించడమూ అందరికీ సాధ్యంకాదు. అటువంటి నిష్ఠాగరిష్ఠులైన తపస్సంపన్నులు కూడా కఠోరమైన కర్మమార్గమును నియమ నిష్ఠతప్పకుండా ఆశ్వాసాంతం అనుష్ఠించలేకపోయినారు.

అయినా, ఒక్క పెద్దవిషయం గ్రహించాలి. కర్మనిష్ఠుడైనవాడు ఎప్పటికప్పుడు తన కర్మనిష్ఠ సరిగ్గా సాగుతున్నదో లేదో చూసుకుంటూ ఉండాలి. ధర్మాధర్మ సూక్ష్మాలు పరిశీలన చేసుకుంటూ ఎప్పటికప్పుడు తాను ధర్మమార్గం తప్పకుండా, నడుస్తున్నానా లేదా అని కర్మయోగియైనవాడు చూచుకుంటూ ఉండాలి. ఈ విధంగా పరిశీలించి చూచుకొని, తాను ధర్మకర్మనిష్ఠతో ఉన్నాననే సంతృప్తి పొందుతూ ఉండాలి. అటువంటి ఆత్మసంతృప్తి కలగడమే కాదు. తాను యితరులకంటె ఎక్కువ కర్మనిష్ఠతో ఉండవలెనని ప్రయత్నించి, ఆ విధంగా ఉండగల్గినప్పుడు తనకంటె నిష్ఠాగరిష్ఠుడు ఇంకొకడు లేడు అనే అహంకారం కూడా అతనిలో ప్రవేశించి ప్రవర్ధమానమౌతూ ఉంటుంది. తపోనిష్ఠులకున్నూ, యోగీంద్రుల మనిపించుకొనగోరేవారికిన్నీ, అటువంటి కర్మమార్గ ఫలిత పర్యవసానంగా యిటువంటి అహంభావం అహంకారం అప్రయత్నంగా, అజ్ఞాతంగా, అతి సహజంగా, అంతర్గతంగా వృద్ధిపొందుతూ ఉంటుంది. అటువంటి అహంకారం మూలంగా అతనికి కలుగవలసిన ఆత్మసంస్కారం అతనికి గలుగకుండాపోతుంది.

విద్యాధికుడైనవాడు తన విద్యవల్ల వినయగుణం పొందాలి. అందుకనే “విద్య యొసగును వినయంబు” అన్నారు. కాని, విద్య వచ్చిన తర్వాత చాలామందికి అనగా మూడు మువ్వాతిక మువ్వీసమునకు యీ వినయగుణం విశేషంగా ఏర్పడదు. తాను తెలిసికొన్నది చాలా అల్పమనిన్నీ, తాను తెలిసికోవలసినది అపారంగా ఉన్నదనిన్నీ గ్రహించినప్పుడే వినయం ఏర్పడుతుంది. విశేషంగా తెలియనివాడు విశ్వంమరచిఉంటాడు. విశ్వం తెలిసినవాడు అనగా విశ్వరూపసందర్శనం పొందినవాడు వినమ్రుడై ఆ విశ్వరూప సాక్షాత్కారముచే విస్మితుడై “మఱచెన్ మురారిసుతుడేతద్విశ్వమున్ భూవరా” అన్నట్లుగా విశ్వం మరచిఉంటాడు. కించిజ్ఞుడైనవాడు విశ్వంమరచి ప్రవర్తిస్తాడు. సర్వజ్ఞుడైనవాడుకూడా విశ్వంమరచి ప్రవర్తిస్తాడు. అయితే, కించిజ్ఞుడు అహంకారంచేత అట్లాఉంటాడు. కాని సర్వజ్ఞుడు అహంకార శూన్యుడై అట్లాఉంటాడు. సర్వశాస్త్రములను శోధించి తద్వారా ఆత్మవికాసం పొందడానికి ప్రయత్నించేవానికి విద్యాహంకారం సహజంగా మామూలుగా కలుగుతూఉంటుంది. జ్ఞానయోగికిమాత్రమే కాకుండా కర్మానుష్ఠానములయందు నియమనిష్ఠా గరిష్ఠుడై ప్రవర్తించేటటువంటి కర్మయోగికికూడా యిటువంటి నియమనిష్ఠాహంకారం కలుగుతూ ఉంటుంది. ఈ కర్మమార్గసాధకంలోనూ, ఈ జ్ఞానమార్గ సాధకంలోనూ అటువంటి స్వాతిశయం ఒకటి సహజంగా ఏర్పడుతూ ఉంటుంది.

ఇనుమునకు తుప్పు సహజంగా పట్టుతుంది. రాగికి కిలుము సహజంగా పట్టుతుంది. విరాగికి కూడా, అతడు చిలుము తాగినా తాగకపోయినా, అతని అంతరాత్మకొక కిలుముపట్టుతుంది. తాను జితేంద్రియత్వంలో వుస్తాదు నవుతున్నానని గాని, అయినాననిగాని, తన ఆత్మనిగ్రహబలము అంతకంతకు ఎక్కువైనదనే అహంకారాతిశయంగాని, అతని ఆత్మకొక కిలుమువలె పట్టుతూ ఉంటుంది. భగవంతుని యెదుట “దాసోహం”

(స్వామీ! నీ దాసానుదాసుడను) అనే ఆత్మసమర్పణభావం పూర్తిగా కలిగితే నే గాని ఆత్మ పరిపక్వము కాదననీ, ఆత్మకు విమోచన లేదనినీ భగవద్గీత బోధించింది. కనుక, యిదే ముక్తికి ముఖ్యసూత్రం అని వైష్ణవమతం నొక్కి వక్కాణించింది.

సంపూర్ణమైన ఆత్మార్పణం ఎవడైతే భగవంతునకు చేసి త్రికరణశుద్ధిగా శరణాగతుడవుతాడో వాడే ఆత్మసిద్ధిని ఆత్మ విమోచనమును పొందగల్గుతాడు. కనుక, నియమనిష్ఠలు భంగమైనా ప్రమాదం లేదు. జ్ఞానసాధకంలో విఘాతం వచ్చినా కొంప మునిగిందేమీ లేదు. ధర్మశాస్త్రాల ప్రకారంగా, న్యాయశాస్త్రాల ప్రకారంగా కొంత అక్రమ ప్రవర్తన కన్పించినప్పటికీ తప్పు లేదు.

భద్రాచల రామదాసువంటి మహాభక్తుడు తానీషా కివ్వవలసిన ద్రవ్యంతో శ్రీరాములవారికి భద్రాద్రిలో ఆలయం కట్టించాడు. నిజమే - ప్రభుత్వచట్టం ప్రకారంగా, న్యాయశాస్త్ర ధర్మసూత్రము ననుసరించి రామదాసుగారు చేసింది చెడ్డపని అని చెప్పవలసిందే. కాని, భగవంతునకు ఆత్మార్పణంచేసిన గోపన్నగారిని కొరడాదెబ్బలు కొట్టినప్పుడుకూడా "కోదండపాణీ! కోదండపాణీ!" అని స్మరించి దేహాన్ని విస్మరించాడు. అంతకన్నా ఎక్కువైన ఆత్మబలం లేదు. అంతకన్నా ఎక్కువైన ఆత్మ పరిపక్వం లేదు. అగ్నిపరీక్షకు నిలిచిన భక్తిపర్వతం అది. భక్తిపరత్వం అది. ఈ నిశ్చలమైన భక్తిజ్వాలలో ధర్మలోప ధర్మాతిక్రమణదోషాలు, కర్మలోపకర్మాతిక్రమణదోషాలు అన్నీ ఆహుతి అయిపోతాయి.

ఎట్లాగంటారా! దేశభక్తివల్ల దేశరక్షణకోసం యుద్ధాలు చేస్తున్నారు. అది చాలా ఉత్కృష్టమైన మహాత్యాగం అన్నారు. శత్రువును సంహరించడంకోసం, దేశాన్ని రక్షించడంకోసం, యుద్ధరంగంలో ప్రాణాలు అర్పిస్తున్నారు. (సామాన్యంగా యుద్ధరంగాలకు వెళ్లి పోట్లాడి చచ్చిపోయే వాళ్లూ, సైన్యంలో చేరినవాళ్ళూ నెల జీతాలకు ఎక్కువగా ఆశపడి ఆహుతి అవుతూఉంటారు. నిజమే.) కాని, నిజంగా దేశభక్తి చేతనే రాజపుత్రులు ఒకప్పుడు తురుష్క సేనలతో యుద్ధములు చేశారు. మహారాష్ట్ర వీరులు ధర్మరక్షణార్థమై పోరాడి తనువు లర్పించారు. రష్యాతో జపానుదేశం యాభైఏళ్ల క్రిందట ఘోరయుద్ధం చేసినప్పుడు, రష్యను సైన్యంలోని రష్యను యోధులను వలపించి వారిని తమ వలలో వేసికొని వారివద్దనుంచి రష్యను యుద్ధవ్యూహరహస్యములను తెలిసికొనివచ్చుటకై జపానులోనికొందరు అందమైనస్త్రీలు (సంసారస్త్రీలు) అట్టి సాహసకార్యాలకు ఒప్పుకొని, యుద్ధరంగాలలోనికి వెళ్లి శత్రువులగు రష్యను సైనికుల మకాములలోనికి ప్రవేశించి, దేశరక్షణార్థమై ఆరష్యను సోల్జరులతో వ్యభిచరించి, వారి సమర తంత్రముల ప్లాను కాగితాలను సంపాదించి తెచ్చారు. "సెహబాస్! దేశభక్తి అంటే అల్లా ఉండాలి. వీరమాతలంటే వీరే" అని కీర్తించి, వారికి జపానుజాతి హారతులిచ్చింది. "దేశభక్తి" అనే పరమోత్కృష్ట ధర్మం ముందర "పాతివ్రత్యం" అనే ధర్మం సూర్యునిముందర దివిటీవలె అముఖ్యమైనదిగా అడుగున పడిపోయింది.

విప్రనారాయణుడు నిష్ఠాగరిష్ఠుడే. తాను చాలా నిష్ఠాగరిష్ఠుడననే అహంకారం కూడా అతనిలో ఉన్నట్లుగా, అప్రయత్నంగా, దేవదేవి పసిపట్టింది. పాలకుండ వాసన పసిపట్టిన పిల్లి ఆ పాలకుండపై మూకుడును దొర్లించి దానిలో మూతి పెట్టి తాను త్రాగినంత త్రాగి, పాలకుండను పడద్రోసి పారిపోతుంది. అది ఆ పిల్లి స్వభావం. అట్టిదే ఈబోగంపిల్ల స్వభావం. ఇంతకూ, దైవయోగం అనే నమ్మకము మనకు ఉన్నట్లయితే, ఇదంతా భగవంతుని లీల అని చెప్పకతప్పదు. ఆ విప్రోత్తముడు వజ్రపంజరంలాంటి నిశ్చలచిత్తుడై బ్రహ్మచారిగా ఉండి కర్మనిష్ఠాగరిష్ఠుడై కర్మయోగిగా కొంత సాధకం చేయడం, ఎట్లా సంభవించిందో సంభవించింది. ఆ కర్మనిష్ఠలో తాను పుస్తాదును అయినాననిగాని, అవుతున్నాననిగాని, అంతరాత్మలో అనుకుంటూ ఉండడం కూడా అతి సహజంగా అతనికి అభ్యాసవశమై ఉంటుంది. అటువంటి అతిశయభావాన్ని అంతరింపజేయడానికే యీ వేశ్యావ్యామోహం అతనికి అక్కరకు వచ్చింది. అతనిమీదకు బంగారుగిన్నె చోరీకేసు రాగానే శ్రీరంగనాథునకు శరణాగతుడైనాడు. దేవదేవి యింటిలోనుంచి అతనిని వెళ్ళగొట్టినప్పుడే అతనికి అతని అల్పత్వము అనల్పంగా బోధపడింది. "గతమయ్యె నితాంత గర్వమున్" అన్నాడు. వేశ్యాలోలుడు కాకపూర్వముకూడా శ్రీరంగనాథుని ధ్యానిస్తూ పూజలు చేస్తూఉండేవాడు. నిజమే. కాని వేశ్యయింటిలోనుంచి తరిమి వేయబడిన పిమ్మట అతడు శ్రీరంగనాథుణ్ని కూర్చి చేసినధ్యానంవల్ల భక్తిసాధనలో విప్రనారాయణుడొక బంగారుకప్పును గెల్చినట్లయింది.

"హరిచరణస్మరణంబె శరణంబని నిటలతట ఘటితాంజలియై యిట్లనియె—



"ఇదుగో నాన్నా! ఇది నా ప్రోగ్రెస్ రిపోర్టు. ఇది నువ్వు చదువుకొన్నప్పుడు నీ ప్రోగ్రెస్ రిపోర్టు—అటకమీద వుంటే పట్టుకువచ్చాను!"

రంగ! రంగనాథ! రంగేశ! రంగేంద్ర!
రంగశాయి! యోపురాణపురుష!
నీకృపావిభూతి నీబంటు బంటుల
పాదధూళిమీద బరగజేయు."

నీ భక్తులకు నీ బంటులకు బంటులైనవారి యొక్క పాదముల ధూళివంటి వాడనైన నామీద నీకృపా మహిమను ప్రసరింపజేయుమా! అని వేడుకొన్నాడు. మనస్ఫూర్తిగా తాను భక్తాంఘ్రిరేణువునని అహంకారశూన్యుడై గ్రహించగల్గినసుదినం దేవదేవి మూలంగా సంభవించింది.

కర్మానుష్ఠానమార్గంలో గాని, శాస్త్రజ్ఞాన పరిశోధనమార్గంలో గాని, వజ్రంకూడా కరిగి నీళ్ళకుంబళ్ళనై, తిరిగి సరియైన మూసలో పోయబడితే నేతప్ప, ఆత్మ పరిపాకం అనేది అనేక సందర్భాలలో సమగ్రం కాదు. ఇదంతా ఆవిప్రోత్తముని అధఃపతనం కాదు. ఆకాశంబుననుండి శంభునిశిరం;

బందుండి శీతాద్రి; సు
శ్లోకంబైన హిమాద్రినుండి

(53-వ పేజీ చూడండి)

తీరిన కోరిక

శ్రీ యర్రా మురళీకృష్ణమోహన్

వయస్సు మళ్లుతున్నకొద్దీ, కోరికలు రూపాంతరము పొందుతుంటాయి. చిన్నతనంలో, తిన్నన్ని లడ్డూలు పెడితే చాలనుకుంటారు. కొంచెం పెద్దయితే మంచి చొక్కా, లాగూ వేసుకొంటేనే చాలు, ఇంకేమీ అక్కరలేదు అనుకుంటారు. ప్రపంచజ్ఞానం తెలిసేక, పెద్ద ఉద్యోగాలు చేయాలని, లేకపోతే 'టిక్కు టక్కు టముకుల బండి' అని పాటలు పాడుతూ సినీమాలలో నటించాలని, హిందీ, ఇంగ్లీషు సినిమాలు చూచి,'రాబిన్ హుడ్', 'సూపర్ మేన్'లా అవాలని అనిపిస్తుంది. ఇంకా పెద్దయ్యాక, అంటే ఇంచుమించు ఇరవై ఏళ్ళ సమీపించాక, హృదయంలో కోరికలు రూపాలు తీర్చిదిద్దుకొని, ఊటలూరి, అంచులు దాటుతోంటే తియ్యనికలలు కంటూ

"కలలు నిజము కాగా
కలకాల మొకటి......గా"

అని పాడుకొంటూ జీవితం పై అంబరం చుంబించే ఆశలతో ఉంటారు. ఆ తరువాత చాలా కాలానికి ఆ ఆశలు ఫలించక కొందరు హృదయంలో స్మశానాన్ని సృష్టించుకొని ఎందుకరదులై 'ఊరు పొమ్మని, కాదు రమ్మనే' పరిస్థితులలో 'రామనామ సంకీర్తనమే రక్తి ముక్తి' అంటూ జపతపాలతో కాలక్షేపం చేస్తూ భగవంతునిలో ఐక్యమయిపోవాలనుకుంటారు.

కాని శాంతమనస్సులో కోరిక ఎక్కడున్నావే గొంగళీ అంటే వేసినచోటే ఆ అన్నట్టు మార్పు చెందలేదు. తిన్నన్ని లడ్డూలు పెడితేచాలనుకుంటాం చిన్నతనంలో. కాని తిన్నన్ని ఎవరూ పెట్టరు. అమ్మనడిగి ఒకటి, నాన్నదగ్గరొకటి, బాబ్బని బెదిరించి ఇంకొకటి, చెల్లాయిని ఏడ్పించి మరొకటి. ఇలా మహా అంటే నాలుగయిదుకు మించవు. అయితే, తిన్నన్ని దొరకక పోయినా కొన్నాళ్లకాధ్యాస పోతుంది. ఆ తర్వాత ఇంకో దానిపై మనస్సుపుడుతుంది. శాంత కోరిక ఇలా పోలేదు. నానాటికి హృదయంలో తిష్ఠ వేసుకొని కూర్చున్నది. ఆమె తీరనికోరిక, ఏమిటంటే తను చెప్పే ప్రతీమాట, సలహా, ఎవరూ పాటించకపోవటమే.

"అమ్మా!...ఏదయినా పెట్టవే..." అంటుంది శాంత.

"ఇప్పుడు కాదు" అంటుంది అమ్మ.

ఇప్పుడు కాక మరెప్పుడో? అడిగినప్పుడు పెట్టదు.

"అమ్మా! కాలవకి నీళ్ళకు వెళ్ళనా?"

"వద్దమ్మా! జారిపడతావు."

హు! ఏదిచేస్తానన్నా వద్దంటుంది.

"పోనీ వంకాయలు తరగనా?"

"చెయ్యి తెగేను. వద్దు. ఏమీవద్దు."

"తమ్ముడ్ని ఆడించు శాంతా!"

"నేను ఆడించలేను బాబు. ఆ వెధవ నాదగ్గరుండడు. చేస్తానన్నది వద్దంటుంది చెయ్యనన్నది చెయ్యమంటుంది. ఏమిటో?"

"సరేలే అమ్మ!" అని ముద్దుగా నాన్నగాని, అమ్మగాని శాంతమాటకు ఒక్కసారి కూడా సమాధానం చెప్పలేదు. అయినా. ఆ పసి హృదయానికేమి తెలుసు మాత్రం పాపం. కాలవకు నీళ్ళకుపోతే జారి పడుతుందేమో? వంకాయలు తరుగుతుంటే చెయ్యి తెగవచ్చు. ఎప్పుడూ తాయిలాలు తింటూంటే అజీర్తిచేసి జ్వరం వస్తుంది. అందుకనే అమ్మ శాంత నేమీ చేయనీయదు. అయితే, ఆ పసిహృదయానికిదంతా తెలియదు. పెళ్ళయి పిల్లల్ని కన్నాక తెలుస్తుంది కడుపుతీపి.

పోనీ నాన్న సంగతి చూద్దామా "నాన్నా! మంచినీళ్లు కావాలా?" అంటే "అమ్మను పిలు శాంతా! కాఫీ తెమ్మను" అంటాడు నాన్న. కాఫీ తాగుతారుకదా అని మరునాడు ఆఫీసునుంచి రాగానే "కాఫీ తేనా, నాన్నా!" అంటుంది శాంత.

"వద్దమ్మ దార్లో తాగేవచ్చాను కానిన్ని మంచినీళ్లు తీసుకురా అంటాడు!" నాన్న. దార్లో పాతస్నేహితు డొకడు కనపడి కాఫీహోటల్ కి బలవంతంగా తీసికెళ్లాడు నాన్నని. కాఫీ తాగడానికీ కాలంలో సమయం సందర్భాలు లేకపోయినా, నాన్న రోజుకి రెండు సార్లే తాగుతాడు ప్రొద్దున్న, సాయంత్రం. 'మానవులు అలవాట్లకు బానిసలు' అన్న సంగతి శాంతకు ఇంకా తెలియదు.

"నే బెల్లమ్ముక్క తెస్తా" అనేది శాంత బువ్వాలాటల్లో.

"ఊహు! పంచదార తే" అనేవారు జట్టువాళ్లు.

"మేము ఆడపెళ్లివారం. మాబొమ్మ పెళ్లికూతురు."

"వీల్లేదు, మా బొమ్మ పెళ్లికూతురు."

ఇలా, బువ్వాలాటల్లో, బొమ్మలపెళ్లిళ్ళలో కూడా శాంతమాట ఎవరూ వినేవారు కారు. ఇది శాంతను మరింత పిచ్చెక్కించింది. అవును పాపం ఇంకా శాంతకు స్వార్థం తెలియదు. ఇంట్లో

మతిమరుపు

ఆరోజు పర్వదినం. నేనూ, నామిత్రుడూ సముద్ర స్నానానికి వెళ్లాం. బాగా ముసలి ఆయన – ఎవరో రిటైర్డైన ప్రభుత్వోద్యోగి కాబోలు- చేతికి మంచి ఖరీదైన గడియారం పెట్టుకొని అలాగే స్నానం చేయటానికి సముద్రంలో దిగుతున్నాడు. నేనూ నా మిత్రుడు ఆగడియారం పాడై పోతుందని కంగారు పడి, ఆముసలి ఆయనను పిలిచి 'తమరు గడియారం తీసెయ్యటం మరచిపోయినట్లున్నారు! అని హెచ్చరించాము.

"అవునవును. అన్నట్లు బాగా జ్ఞాపకం చేశారు" అంటూనే ఆయన గడియారం పట్టాను వూడదీసి పరాకుగా సముద్రం కేసి చూస్తూ, దాన్ని నీళ్లల్లో పడేసి తను వెనక్కి పోయి గట్టుమీద కూర్చొండి పోయాడు.



అమ్మ, నాన్నా కాక స్నేహితురాండ్రు కూడా తన మాట వినరేమిటా అని స్వతహాగా దెబ్బలాడే తరహాలేని కాంత అనుకొనేది.

అవి నాన్నకు వేసవి శెలవలు. నాన్న కాంతను వాళ్ళ బామ్మగారింటికి తీసికెళ్ళాడు. బామ్మ పిండివంటలతో నాన్నకు కాంతకు మస్తుగా వండిపెట్టేది. ఒకో రోజున కాంత ఏమీ తినకపోతే "అయ్యో అపురూపమా! కొంచెం వేసుకోవే" అనేది బామ్మ. అవాళ బామ్మ క్షీరాన్నం చేసింది. కాంతకు క్షీరాన్నం అంటే అబ్బ మహాయిష్టం. అందుకనే మూడుసార్లు వేయించుకుంది.

"కొస్త చూసుకొని తినవే పిల్లా" అంది బామ్మ. కాంత హృదయం చివుక్కుమంది. వద్దంటే వేయించుకోమంటుంది. ఇష్టమయినది కొస్త వేయించుకొని తింటే చూసుకొని తినమంటుంది. ఎలా చచ్చేదీ. కాంతకు రానురాను పెద్దాళ్లంటే చిరాకుపుట్టింది. పిల్లలనేది ప్రతిదీ, వాళ్లు చేసే ప్రతీపనీ పెద్దలు కాదనాలికాబోలు. తనూ పెద్దయ్యాక, తనూ పిల్లల మాటలు, పనులూ, "అలా కాదు" "ఇలా కాదు" అనాలి కాబోలునని సరిపెట్టుకుంది కాంత.

* * *

కాలం చాలా జోరుగా పరుగెడుతుంది. కాంత నేడు వివాహిత. చిన్నప్పుడు తన మాటలను అంతా తోసేసేవారు. పెద్దయితే తనమాట చెల్లుబడవుతుందనుకుంది. ఇప్పుడు తను పెద్దయింది. మాతృదేవికూడ కాబోతుంది. అటువంటి తన మాటంటే కట్టుకున్న మొగుడునుంచీ, అంట్లు తోమే సుబ్బిదాకా అందరికీ నిర్లక్ష్యమే-అందరూ వ్యతిరేకంగా అనేవారే.

"అత్తయ్యా! కూరేం చేయమంటారు?"

"ఏదో ఒకటి చెయ్యవే" అంటుంది అత్త. తీరా వంటయిపోయాక. విస్తరిముందు

"ఏమిచేశావే కోడలుపిల్లా" అంటుంది.

"అరటికాయ వేపుడు, పప్పులునూనండీ"

"కొబ్బరి పచ్చడి చేయకపోయావూ" అంటుంది. మొదట చెప్పకూడదూ!

"ఒసేయి! సుబ్బీ ముందీగది చిమ్ము"

"ఉండండమ్మా! ఏంటి ఖారు" ఉ... కసురుతుంది సుబ్బి.

" 'పెళ్లిచేసిచూడు' చాలా బాగుందట; తీసికెళ్ళరూ?"

"అది అమ్మనడగవలసిన విషయం" అంటాడు మొగుడుగారు.

ఇక ఇంట్లో కష్టసుఖాలు భర్తతో చెప్పబోతే "అబ్బబ్బ, ఇలాటివన్నీ వస్తాయనే నేనసలు పెళ్ళి వద్దన్నాను. అయితేం విధి వదలదుగా" అంటాడు, కించిత్తైనా ఆ వాతావరణాన్ని అర్థం చేసుకోని భర్త.

"అయితే మడికట్టుకొని కూర్చోలేకపోయారా? సన్యాసుల్లో కలిస్తే మరీ బాగుండేదిగా!" అని కాంతహృదయంలో ఎవరో చెప్తున్నట్టుండేది.

"ఆ! తప్పు. ఆయన దేవరనుకున్నావు; నీ భర్త. భారతనారీమణులను మరచిపోయావుటమ్మా? సీత, సావిత్రి, దమయంతి" .....అంటూ అంతరాత్మ గోల పెట్టేది.

"ఖర్మం కాకపోతే మరేమిటి. నే ననుకున్నది నా అంతరాత్మ కాదంటుంది; ఇక ఇతరులు అనటానికేం" అనుకొనేది కాంత.

రోజులు గడుస్తున్న కొద్దీ కాంతకా వాతావరణం అలవాటయిపోయింది. భర్త లాలనపాలనలలో ఆమె అమరసుఖాన్ని పొందుతున్నా, ఆమెలో అసంతృప్తి ఉండి ఉండి తలెత్తుతుండేది.

ప్రజలు ఆకలిదప్పులతో "అన్నమో రామచంద్రా" అంటూ అసువులు బాయుచున్నా; బొజ్జలునిండిన దొరలు విర్రవీగుతున్నా, "చక్కిలిగింతలు లేవా, చక్కని ఊహాలు రావా" అని ప్రణయ విశ్వవిద్యాలయంలో పట్టభద్రులైన యువతీయువకులు కేరింతలు కొడుతూ, మధుర మధురాసక్త హృదయాలతో స్వర్గసీమల్లో కన్నూ, మిన్నూ కానక స్వేచ్ఛావిహారం చేస్తున్నా, ఉన్నట్టుండి మానవులు సూర్య, చంద్ర గోళాల్లోకి ప్రయాణం సాగించబోతున్నా, యుగాంతానికి నాందిగా యాటంబాంబులు సృష్టింపబడుతున్నా, ఏమయినా సరే, - కాలచక్రం నివ్వెరబోదు, కొస్త ఆగి పరికించి చూడనైనా చూడదు. దానిపని దానిదే కదా!

(53-వ పేజీ చూడండి)

★ విశాలాంధ్ర అంతటా ★

ఈ నెల 26వ తేదీన విడుదల



సీరియల్ నవల

రెండు మహానగరాలు

చార్లెస్ డికెన్స్

43

అప్పుడే భోజనం ముగించి, లారీగారు, నిప్పుదగ్గిర కుర్చీ వేసుకుని అరికాళ్లు వెచ్చబెట్టుకుంటున్నాడు. ఆయన మనస్సులో తన యౌవ్వనదశనాటి రోజులు తియ్యగా మెసులుతున్నయ్. బర్సాడ్‌ను వెంటబెట్టుకుని కార్టన్ లోపలికి అడుగుబెట్టగానే, వాళ్ళ అడుగుల చప్పుడు చెవులబడి చివాల్న వెనక్కు తిరిగి చూచాడు. కార్టన్ వెంటవచ్చిన ఆ కొత్తమనిషి యెవరా అని ఆయనకు ఆశ్చర్యమేసింది. సిడ్నీకార్టన్ ఆ విషయం గ్రహించి 'మన ప్రాస్ తమ్ముడు—బర్సాడ్' అన్నాడు.

'బర్సాడ్?—అరే—ఈ పేరెక్కడో విన్నట్టుందే!—ముఖంకూడా యెక్కడో చూసినట్టే అనిపిస్తోంది.

'నీ మొహంలో అదో తరహా వుందని చెప్పలేదుటోయ్ తమ్ముడూ!—అలా కూర్చో' అన్నాడు కార్టన్, బర్సాడ్‌కు కుర్చీ చూపిస్తూ.

తను కూడా మరో కుర్చీలో కూర్చుంటూ, లారీగారికి కావలసిన భోగట్టా యిచ్చాడు: 'సాక్షి—డార్నే విచారణనాటి సాక్షి' అన్నాడు.

లారీగారికి గుప్పున జ్ఞాపకమొచ్చింది. వెంటనే వాడిమీద ఎక్కడలేని అసహ్యం కలిగి, మొహం అదోలా పెట్టేసి పెడగా తిరిగాడు.

'లారీగారూ!—మిస్ ప్రాస్, బర్సాడును, త్రోవను పోతుంటే గుర్తుపట్టింది' అన్నాడు కార్టన్—'మరో చెడువార్త—డార్నేను మళ్లీ అరెస్టుచేశారు.'

ముసలాయన కళవళపడిపోయాడు: 'ఆ!—ఏవిఁటీ—అరే ఇందాకేగా—రెండు గంటలసేపన్నా కాలేదే—నేను అక్కడి నుంచి తిరిగొచ్చి.'

'అరెస్టు చేసిన సంగతి నిజమేలెండి—ఎంతసేపయింది బర్సాడ్ అరెస్టుచేసి?'—

'ఇప్పుడే' అన్నాడు బర్సాడ్.

'మనవాడు బర్సాడ్‌కు అంతా తెలుసులెండి—యితగాడు మరో జైలుగొర్రెతో కూర్చుని తప్పదాగుతూ ఆ విషయం చెబుతుంటేనే నేను విన్నది. మనవాడు డార్నేను జైల్లో పెట్టించేవచ్చాడు; అందులో సందేహమేమీ లేదు.

ఆ మాట్లాడుతున్న కార్టన్ ముఖంలోకి చూస్తే డార్నే గారికి విషయమంతా అర్థమైపోయింది. కార్టన్ యేదో కథాక్రమంలోకి దిగటానికి ఉద్యుక్తుడై వున్నట్టుకూడా గమనించాడు. అందుచేత ఆ విషయం చర్చ పెంచటం మంచిదిగాదని విరమించుకున్నాడు.

'డాక్టర్‌గారి పలుకుబడి రేపుకూడా కొంత అక్కరకొస్తుందేమో బర్సాడ్! రేపే గాదూ తిరిగి విచారణ చేస్తారన్నావ్?'

'ఆఁ—రేపే జరుగుతుందనుకుంటాను.

'రేపుమాత్రం డాక్టర్‌గారి పలుకుబడి యెంతవరకు ఉపకరిస్తుందో—ఈవేళ యేవిఁ ఉపకరించింది? డాక్టర్‌గారు దగ్గిర వుండికూడా అరెస్టు జరక్కుండా ఆపలేకపోయారు.'

'బహుశా, ఈ సంగతి ఆయనకు ముందుగా తెలియదేమో' అన్నాడు లారీ.

'తెలిసినా తెలియకపోయినా అలా జరగటంమాత్రం ఏదో భీభత్సానికి దారి తీస్తున్నట్టే కనుపించుతోంది.

'నిజమే' అన్నాడు లారీ, కళావళంగా గడ్డం తడుముకుంటూ.

'ఎలాగైనా ఏదోరకమైన తెగింపుకు దిగాల్సిన సమయంగాని నిద్రపోవలసిన తరుణం గాదు. తెంపుగా పందెంవొడ్డి, తెంపుగా ఏదో ఆటకు దిగితే గాని లాభం లేదు; ఇంతకూ నేను ఇప్పుడు మొదలెట్టదలచిన ఆట యెవరితో నంటే—మన మిత్రుడు బర్సాడ్‌తో' అన్నాడు.

'ఎవరితో ఏ ఆటకు దిగినా చేతిలో మంచి పేకముక్కలుండాలి' అన్నాడు బర్సాడ్ అదో ధీమాగా.

'ఓస్!—వెధవ పేకముక్కల కేవిఁటి?—ఆమాత్రం సిద్ధపడకుండా వున్నానూ—ఏవంటారు లారీగారూ?—నేను పట్టిలత్తుకోరు వెధవనని మీకు తెలీదూ?—కొంచెం బ్రాందీ యేమన్నా వుంటే ఇట్టా నా మొహాన పోయించుదురూ!' అన్నాడు కార్టన్.


గ్లాసుమీద గ్లాసు రెండు గ్లాసులు ఒకదానిమీద ఒకటి ఎక్కించి, సాలోచనగా సీసా ముందుకు తోస్తూ ఉపక్రమించాడు, తనలో తను ఆలోచించుకుంటున్న వాడిలాగు:

'ఊహూ! బర్సాడ్—ఒకటి జైలుగొర్రె—రెండు రిపబ్లికన్ ఉద్యోగి—ఒకప్పుడు ఖైదీ—ఇప్పుడు జైలువార్డర్ - జీవితం పొడుగునా గూఢచారిత్వ జీవనం—సరే ఆంగ్లేయుడై వుండటం మరీ బాగుంది—ఇక్కడి ఫ్రెంచి అధికారులదగ్గిర తప్పుడు పేరు చెప్పుకు బ్రతుకుతూవుండం మరో మాంచి తురుపుముక్క. ఈ బర్సాడ్ ఫ్రెంచి ప్రజల స్వాతంత్ర్యాన్ని నాశనం చెయ్యటానికి కంకణం కట్టుకు కూర్చున్న ఆంగ్లేయ ప్రభుత్వంక్రింద పనక ఉద్యోగం చేసివుండటం అన్నిటికంటే పకడైన అరఖుజాకీ—ఈ బర్సాడ్ యిప్పుడు కూడా ఆంగ్లేయ ప్రభుత్వందగ్గిర డబ్బు తీసుకుని పిట్ మంత్రిత్వానికి గూఢచారిగా పనిచేస్తూ వుండవచ్చునని అనుమానించటానికి ఎంతైనా పావకాశం వుంది. ఇంతకంటే జోకరుముక్క యింకేవిఁ కావాలి!—నా చేతిలో వున్న ముక్కలేవిఁటో తెలిశాయా బర్సాడ్.'

'తెలిశాయి గాని మీరు ఆడబోతున్న ఆట యేవిఁటో మాత్రం అర్థం కాలేదు.

'సరే—ఆసుముక్కను ఆడేస్తున్నాను—దగ్గిరలో వున్న ప్రజాసంఘం ఆఫీసుకు పోయి, బర్సాడ్ సంగతి రిపోర్టుచేస్తాం

అనువాదం: తెన్నేటి సూరి



పండరి పురంలో పాండురంగ దేవాలయ శిఖరం —ఫొటో వి. యల్. యస్. చారిగారు.

★ రెండు మహానగరాలు ★

చూడు తమ్ముడూ ఆ దెబ్బ తట్టుకోడానికి నీదగ్గర ఏదైనా ముక్క వుందేమో నీ చేతిలో వున్న ముక్క లొకసారి చూసుకో—తొందర లేదు, జాగ్రత్తగా ఆలోచించుకోలే'

అంటూనే బ్రాందీ బాటిల్ అందుకుని మళ్ళీ పెగ్ మీద పెగ్ మళ్లీ బిగించుతున్నాడు. ఆ తాగటం చూసి ఆ గూఢచారి గాడు మరింత హడిలి చస్తున్నాడు; ఆ తప్పదాగిన శివంలో వెంటనే పోయి రిపోర్టు చేసేస్తాడేమో నని భయం. వాడు హడలటం గమనించి అదనంగా మరో పెగ్ అందుకుని మరింత మతిపోగొట్టాడు.

'ఏం తమ్ముడూ!—ఏవన్నా తేలిందా?'

నిజానికి కార్టన్‌కు యింకా చాలా విషయాలు తెలియవు గాని, కార్టన్ అంచనా వేసిన దానికంటే బర్సాడ్ చెయ్యి యింకా అధ్వాన్నమైన చెయ్యి; ఆటలోకి దిగితే మొత్తం కరారావుడైపోవటానికి తగిన దరిద్రపుగొట్టు ముక్కలు బర్సాడ్ చేతిని యింకా చాలా వున్నయ్. మితిమీరిన ధోరణిలో అబద్ధాలు చెప్పటంతో, అక్కడ ఇంగ్లండులో ఉద్యోగం వూడింది. అనంతరం ఫ్రాన్సు చేరుకుని మాజీ ప్రభుత్వం హయాములో గూఢచారిగా చేరి, ఫ్రాన్సులో వున్న ఆంగ్లేయులలో తిరుగుతూ తంపులు పెడుతూ వుండేవాడు. ఆ దశలో సెయింట్ ఆంటోనీ పానశాలమీద గూఢచారిగా నియమించబడి, మాడమ్ డిఫార్జ్ దృష్టిలో పడ్డాడు. మాడమ్ డిఫార్జ్ జాపితాల్లో అతని పే కూడా వుంది. అనంతరం లూయీ ప్రభుత్వం కూలిపోవటంతో పేరు మార్చుకుని ఫ్రెంచి జాతీయుడుగా చెలామణీ అవుతూ మళ్ళీ క్రొత్త ప్రభుత్వంలో కూడా మామూలు జైలుగొర్రె ఉద్యోగాన్ని సంపాదించి వెలుగుతున్నాడు. ఈ గ్రంథం యావత్తూ బయటికి రావటం జరిగితే, అతని తల ఏ గొడ్డలికో ఎరగాక తప్పదని అతనికి స్పష్టంగా తెలుసు. అందుచేత కార్టన్‌తో తటపటాయింపుకు దిగటం ప్రమాదకరమని తెలుసుకుని తెల్లమొహం వేశాడు.

వాడు డిక్కుమొహం వేయటం గమనించి కార్టన్: 'ఏం తమ్ముడూ! చేతిలో ముక్క లేవీ పనిగా వున్నట్టు లేవే!'—

బర్సాడ్ కార్టన్‌తో పోట్లాడి లాభం లేదని వార్ధక్యంతో తల నెరిసి కొంచెం జాలిపేగుల మనిషిలా కనుపిస్తున్న లారీగారి వంక తిరిగి బ్రతిమిలాట ప్రారంభించాడు:

'అన్నీ తెలిసిన పెద్దలు మీరు చెప్పండి— నేను గూఢచారి నన్నా నేననుకోండి—ఆ ఉద్యోగంలో నేను గాకపోతే మరొకడైనా వుండేవాడే—యీ, తండ్రి నాకుమల్లే అట్లాంటి గూఢచారి కాదుగదా—నావంటి వెధవల వ్యవహారంలో జోక్యం గల్గించుకోవటం అయనకు యేమంత మర్యాదగా ఉంటుంది. కొత్త

మీరు ఆయనకి చెప్పండి బాబూ!—నామీద ఆసును వాడతానంటాడు చూడండి ఎంత అన్యాయం'—

'లాభం లేదు బర్నార్డ్—అయిదారు నిమిషాల్లో ఆసును వాడి తీరతాను' అన్నాడు కార్టన్, లారీని సమాధానం చెప్పనియ్యకుండా.

'నా అక్క మొహమన్నా చూడరా బాబూ!'

'ఆవిడకి నీ పీడ విరగడచేసి పారెయ్యటంకంటే, ఆవిడకు నేను చూపగల మరో ఆదరం వేరే యేముంటుంది?'

'తమరు అట్టా చేసే మహారాజుగారు లేండి బాబూ!'

'ముమ్మాటికీ చేసి తీరతాను—ఆఁ అన్నట్టు మరోసంగతి—మరో తురుపు ముక్క చేతి కందినట్టుంది—ఇందాక నీతో మాట్లాడుతున్నాడే ఆ రెండో గొర్రె యెవడూ?'

'ఫ్రెంచివాడే—మీరు ఎరుగరు లెండి.'

'ఫ్రెంచివాడేం?—సరే'

'నిజం బాబూ! ఫ్రెంచివాడే.'

'నీ వన్నట్టు బాగా ఫ్రెంచిభాష మాట్లాడగలడుగాని, ఏలాగైనా కొంచెం యాసవుంది.'

'నాటుపరంనుంచి వొచ్చినవాడు లేండి.'

'తీసెయ్యవోయ్!— తప్పకుండా విదేశీయుడు; ఓల్డు బెయిలీ గూఢచారి, క్లై.

'మీరు యీ వరసలో తప్పకుండా ఓడిపోయారు—వాడు క్లైమాత్రం కాడు. క్లై ఏనాడో చచ్చాడు. లండన్లో పాన్ క్రాస్ చర్చిలోవాణ్ణి పాతేసి ఏనాడో అయింది. వాణ్ణి స్వయంగా శవపేటికలో వుంచింది యీ చేతులతో. వాడి శవాన్ని శ్మశానానికి తీసికెళ్ళేనాడు ఎంత గందరగోళం జరిగింది?—మీకు తెలీదూ?'

ఇంతలోనే, ఎదురుగావున్న గోడమీద ఒక పెద్ద క్రీనీడ పడ్డది. ఎవరో మనిషి లేచి నిల్చున్నట్టు తోచింది. ఎవరా అని లారీ వెనక్కు తిరిగిచూచాడు. ఈతముళ్లు పాతినట్టు నిటారుగా నిక్కబొడిచి నిల్చున్న జిఱ్ఱబొచ్చుతో క్రంచర్ కంటబడ్డాడు.

బుకాయించటానికి ఒక అవకాశం చిక్కనే చిక్కిందని బర్నార్డ్, అదే ధోరణిలో ఉద్ఘాటిస్తున్నాడు:

'మనం యే సంగతేనా సజావుగా మాట్లాడుకోవాలి; చూడండి యింకా కావలిస్తే; ఇదుగో! క్లైని భూస్థాపన చేసినట్టు గవర్నమెంటువారిచ్చిన సర్టిఫికెట్టు—ఆ నాటినుంచి నా నోటు పుస్తకంలోనే దాచివుంచాను—చూడండి యింకా కావలిస్తే అది మజాకా ఫోర్జరీ కాయితం గాదు; గవర్నమెంటిచ్చిన సిసలైన సర్టిఫికెట్టు'—అంటూ జేబులోనుంచి చిన్న కాయితం ముక్క ఒకటి తీసి కార్టన్కు అందించాడు.

గోడమీద వున్న క్రీనీడ మరింత బారై లేచి నిల్చుని ముందుకు సాగటం, లారీగారు గమనించుతూనే వున్నారు. క్రంచర్ గదిలోకి అడుగుపెట్టాడు. అతని జుట్టు ఏదుబంది ముళ్లలా నిక్కబొడుచుకుని వుంది. గూఢచారి అతని రాకను గమనించలేదు. క్రంచర్ మెమ్మదిగా వచ్చి అతని భుజంమీద చెయ్యివేశాడు.

'ఏంటండీ—ఇంతకీ ఆ ఆ క్లైగాణ్ణి ఆ పెట్టెలో పెట్టామంటారా?'

'ఔను పెట్టాను'

'అయితే యెవురు తీసేశారు?'

బర్నార్డ్ తెల్లబోయి కుర్చీలో యాలిగిలబడాడు—'ఇంతకీ నువ్వనే దేవిఁటి?'

'నేను అనేదేవిటంటే ఆడు అందులో లేడూ అని'—

గూఢచారి తక్కిన యిద్దరి పెద్దమనుషుల ముఖాల్లోకీ తెల్లబోయి చూశాడు; వాళ్లిద్దరూ క్రంచర్ ముఖంలోకి తెల్లబోయి చూస్తున్నారు.

'నే జెబుతాను ఇను—నువ్వు ఆణ్ణి పెట్టిలో ఎట్టి పాతేశావన్నమాట శుద్ధ అబద్ధం—ఆ పెట్టెనిండా కంకరరాళ్లు తప్ప ఆడెక్కడుండాడు?—ఈ సంగతి నా కొక్కడికే గాదు—మరో యిద్దరు పెద్దమణుసులుకి కూడా దెల్సు— ఈ తట్టుపర్ల మాటలన్నీ నాముంగల చెప్పమాక'—

'నీ కెట్టా దెలుసు?'—

'ఎట్టా దెలిస్తే నీకేం— తెలుసని చెప్తావుంటే; నాబోటి యీ పారస్థుల్నీ పెద్దమడుసుల్నీ దగాజేసినందుకు, నిన్నసలు పీక నులిమి చావనూకాల్చింది.'

ఈ వ్యవహారం, యిలా అద్భుతంగా రక్తిగట్టటంతో లారీతోపాటు ఆశ్చర్యచకితుడై— తెల్లబోయి చూస్తున్న కార్టన్ కొంచెం తెప్పరిలి, క్రంచర్ను బ్రతిమలాడాడు—కొంచెం తమాయించుకుని శాంతించమనీ, అసలువున్న సంగతేవిటో తెలిసేటట్టు చెప్పమనీ.

'అదంతా యిప్పుడు చెప్పటానికి యీల్లేదు లెండి సాఁవ్!—ఆ పెట్టెలో క్లైగాడి శవం లేదూ అని నేను చెబుతా వుండాను—వుండాడని యీణ్ణి గుండెలమీన చెయ్యేసి చెప్పమనండి—ఆమయిన పీకె బిసికి చావనూకుతనో లేదో.' ఆ సవాలు అందుకోటానికి బర్నార్డ్కు దమ్ములు లేకపోయినై. డిక్కముఖం వేశాడు.

కార్టన్ అందుకున్నాడు: అయితే మరో మజా అయిన మజేలా దొరికింది—ఏం తమ్ముడూ ఏవిటి మరి మన ఆటసంగతి?'

'ఓడిపోయాను—మీ రేంజెయ్యమంటే అట్టా నడుచుకుంటాను.'

'ఏఁబ్బే! నిన్ను ఎక్కువ బాధల్లోకి ఉంచే దేవీలేదు—నువ్వు జైలు వార్డరుగా వుంటున్నావు గాదూ.'

'లాభం లేదండీ. జైల్లోనుంచి ఖైదీలను తప్పించగలగటమనేది, అది వీలయ్యే మాట గాదు'—

'ఛాఛా! నేను కోరని మాట నువ్వెందుకు చెబుతున్నావ్?—నువ్వు వార్డరు'

'అవును'

'ఎప్పుడుబడితే అప్పుడు జైల్లోకి వెడుతూ వస్తూవుండొచ్చు?'

'వుండొచ్చు'—

కార్టన్ మరో గ్లాసునిండా సారా నింపి దాన్ని ధారగా ముందున్న నిప్పులో పోస్తున్నాడు. సాంతం అఖరైపోయిన తరవాత కుర్చీలోనుంచి లేచాడు.

'ఇప్పటివరకూ మనం యీ యిద్దరి పెద్దమనుషుల ముందూ మాట్లాడుకున్నాం—మరో చివరిముక్క నీతో ఏకాంతంగా మాట్లాడవలసివుంది. అలా ఆ చీకటిగొదిలోకి వెడదాంరా?' ★

అతకని బతుకులు

19

భోజనాలు చేస్తున్నాం.

"మీ కాలేజీకి ఎప్పటిదాకారా, సెలవులు?" అన్నాడు నాన్న; చెప్పాను.

"ఈ సెలవల్లోనే ఎక్కడన్నా ఇల్లు వెదుక్కో" అన్నాడు నాన్న; మళ్ళీ.

నేను మాట్లాడ్లేదు; మామగారివంక చూశాను: మెదలకుండా అన్నం తింటున్నాడు.

"ఈ ఎండాకాలంలోనే ముహూర్తం చూడండి—ఎంతకాలం హోటల్లో ఆ వెధవ కూడు తింటాడు" అన్నాడు నాన్న, మామగారివేపు తిరిగి.

"దానికేం లెండి?—అది ఎప్పటికైనా మీ పిల్లేగా"—అన్నారు మామగారు.

నాన్న మాట్లాడ్లేదు; అమ్మ మజ్జిగ వడ్డిస్తున్నది.

"అసలు మేముగూడ గుంటూరు మార్చేద్దామని చూస్తున్నాం. ఇక్కడమాత్రం అఘోరించేదేమిటి? కొత్త కోడుకూ, కోడల్ని చూసుకునైనా సంతోషించవచ్చు. ఆ చిన్న వెధవల్ని పెట్టుకుని ఇక్కడ మేంమాత్రం ఏం చెయ్యగలం?" అన్నది అమ్మ, మజ్జిగపోసి. ఎందుకో నా గుండెలు ఝల్లుమన్నై: మనస్సులో పిశాచాలు నాట్యం చేసినై.

"అవున్లెండి" అన్నాడు మామగారు, నిర్లిప్తంగా.

"మేమూ పెద్దవాళ్ళమైపోతున్నాం; ఒంటరిగా గడపటం చాల కష్టంగా ఉంది" అన్నాడు నాన్న.

"కాదు—మరి?" అన్నాడు మామగారు ఆమోదం వెలిబుచ్చి.

"నాకూ ఒంట్లో శక్తి చచ్చిపోయింది - ఒక పూట లేస్తే ఇంకోపూట లేచే ఓపిక లేదు. ఏదో వండి వాళ్ల ముఖాన పడేస్తే, వాళ్ళే సర్దుకుపోతుంటారు" అన్నది అమ్మ, తలుపు కానుకుని నిలబడి.

"ఆఁ, ఇంకా ఎంతకాలం లెండి!—పెద్దతనం!" అన్నాడు మామగారు.

ఎవళ్లూ మాట్లాడ్లేదు. కాసేపటికి, "అయినా, ఏదో కృష్ణా, రామా అనుకోవల్సిన కాలంలో ఇంకా ఎందుకు, మీకీ బాదరబందీ?" అన్నాడు మామగారు, నాన్న వేపు చూస్తూ.

"నాకల్లా ఏమీ లేదండీ - వాళ్లిద్దరు వెధవలూ పెద్దవాళ్ళైపోతే, అక్కడికిగాని తెరిపి చిక్కదు" అన్నాడు నాన్న.

"మీ కేమండీ, అదృష్టవంతులు! చేతి కందివచ్చిన కొడుకుండేను, అతనే నెట్టుకు పోతాడు" అన్నాడు మామగారు, నా వేపు చూస్తూ. నేను చివర ఆపోసన పడ్తున్నాను.

భోజనాలైంతర్వాత వాకిట్లో అరుబైట మంచాలమీద కూర్చున్నాం. చెట్లల్లోంచి చీకటి బైటి వెన్నెట్లోకి చొచ్చుకురావటానికి యత్నిస్తున్నది. వెల్లికిలా పడుకుని సిగరెట్టు ముట్టించాను; ఆకాశంలో నక్షత్రాలు నవ్వుకుంటున్నై. నాన్న, మామగారూ ఏదో మాట్లాడుకుంటున్నారు.

ఆ రాత్రి మెల్లిగా తెల్లవారింది! పల్చగా పొగమంచు ఆవరించింది. ముఖం పుల్ల నోట్లో పెట్టుకుని మామయ్య ఇంటికి వెళ్ళాను. శకుంతల వాకిలి ఊడ్చి, నీళ్లు చల్లుతున్నది. క్రీగంట చూశాను: చిక్కి, శల్యమైపోయింది. ఇదేనా, నేను వెర్రెత్తిపోయిన బంగారుబొమ్మ?-నవ్వుకున్నాను.

మామయ్య అరుగుమీద కూర్చున్నాడు, చుట్ట కాలుస్తూ. పక్కింటాయన పక్కనే కూచుని మాట్లాడ్తున్నాడు.

"రాత్రల్లా, పాపం, కంటిమీద కునుకు లేదండీ" అంటున్నాడు మామయ్య.

పక్కింటాయన మాట్లాడ్లేదు. నేను వెళ్లి పక్కనే కూర్చున్నాను. మామయ్య అరమోడ్పు కన్నుల్లోంచి ఆకాశంలోనికి చూస్తూ,చుట్టపొగ సుడులు తిరిగిపోతుంటే గమనిస్తున్నాడు.

"గుంటూరు తీసుకువెళ్లకపోయినారా?" అన్నాడు పక్కింటాయన, కాసేపటికి.

"వెళ్లాలి—ఆ పిల్ల కేమో నిండు నెలైపోయెను:—" అన్నాడు మామయ్య.

శకుంతల నీళ్లు చల్లిన నేలమీద రెండు ముగ్గుచారలు వేసి, లోపలికి వెళ్లిపోయింది.

"ఈ సమయానికే యీ పురిటి రోజులు రావటం మా ఖర్మ" అన్నాడు మామయ్య, ముందుకు వంగి తుపుక్కున ఉమ్మేసి. నేను పుల్లంతా నమిలేస్తున్నాను.

"కులాసాగా ఉన్నారా?" అన్నాడు పక్కింటాయన, నన్ను చూసి.

నేను విషాదంగా నవ్వి ఊరుకున్నాను.

"వస్తానండీ" అని పక్కింటాయన లేచి వెళ్లిపోయినాడు.

"డాక్టరెవరు, మామయ్యా?" అన్నాను, మెల్లిగా.

"ఒక డేమిట్రా?—అంతా అయినారు. ఈ నెల రోజుల్లో అరువందలు ఖర్చైంది" అన్నాడు మామయ్య, కొట్టొచ్చినట్టు. చూపుతున్న శ్రద్ధకి ఖర్చవుతున్న డబ్బు ఒక నిదర్శనం!

ఇంతలో అత్తయ్య పరుగెత్తుకొచ్చింది, లోపల్నుంచి: "చూడండి, అమ్మాయి నొప్పులు పడ్తున్నది" అన్నది, ఆదుర్దాగా. మామయ్య ఉన్నవాడున్నట్టు మంత్రసాని కోసం పరుగెత్తాడు. అత్తయ్య లోపలికి పరుగెత్తింది; నేను మెల్లిగా లోనికి వెళ్ళాను.

గదిలోంచి శకుంతల ప్రసవవేదన వినబడ్తూనే ఉంది: రెండో గదిలోంచి శకుంతల భర్త మూలుగుతున్నాడు. నేను మెల్లిగా వెళ్ళి అతని పక్కనే కూర్చున్నాను. నన్ను చూసి, కొద్దిగా, నీరసంగా మందహాసం చేశాడు. ఉదయిస్తున్న సూర్యుని కిరణాలు ఆ హాసంలోని నిశ్శబ్దానికి ఒణికిపోయినై. మనిషివంక పరీక్షగా చూశాను. కళ్లు లోతుకు పీక్కుపోయినై; నన్ను చూసి కొద్దిగా దగ్గాడు; పక్కకి తిరిగి పడుకున్నాడు.

తలకాయెత్తి చూశాను; అతని నెత్తికి పైగా పెళ్ళినాటి శకుంతల నవ్వుతూన్నదనిపించింది.

కాసేపటికి నీరసంగా, "శకుంతల ప్రసవిస్తున్నదా?" అన్నాడు; నేను తలకాయాడించాను. తనలో తాను వెర్రిగా నవ్వుకున్నాడు.

అవతలి గదిలోంచి శకుంతల వెర్రికేక వేసింది. మామయ్య మాటలు వినపడ్డై.

"సమయానికి పారిపోతావు కేం?" అంటున్నది అత్తయ్య.

"లేదమ్మా-నేను మీ ఇంట్లో పప్పన్నం కోసం కనిపెట్టుకునే కూచున్నాను" అంటున్నది వచ్చిన మంత్రసాని, నవ్వుతూ.

"పిచ్చిపిల్ల!" అని నవ్వుకున్నాడు మామయ్యల్లుడు, తనలో తాను. కాసేపటికి చేతులు మోడ్చి తలవేపు పెట్టుకున్నాడు, భగవంతుణ్ని ప్రార్థిస్తున్నట్టు.

శకుంతల మళ్లీ పిచ్చికేక పెట్టింది; పుట్టిన శిశువు కెవ్వుమంది.

మామయ్యల్లుడికి ఒక దగ్గుతెర విరుచుకపడ్డది: ఆయాసంతో మెల్లిగా లేచికక్కుక

న్నాడు. కళ్లలో రక్తం పడింది; నా కళ్లు చెదిరిపోయినై.

"మనవడే – మనవడే" అంటున్నది అత్తయ్య; మంత్రసాని తృప్తిగా నవ్వింది. శిశువు ఏడుస్తూనే వుంది.

మామయ్యల్లుడు తన్ను తాను సంబాళించుకున్నాడు. కాసేపుండి, "శకుంతల చాల మంచిపిల్లగదూ?" అన్నాడు, నా వేపు చూస్తూ నవ్వి. నేను మందహాసం చేస్తూ, తలకాయాడించాను. మామయ్యల్లుడు సంతృప్తిగా కళ్లు మూసుకుని పడుకున్నాడు.

నేను గదిలోంచి మెల్లిగా ఇవతలికి వచ్చాను.

"చాకు తీసుకురాండి" అంటున్నది, మంత్రసాని. మామయ్య అడావిడిగా తిరుగుతున్నాడు. "సాయంత్రం వస్తానత్తయ్యా" అన్నాను.

"మంచిది నాయనా. మీ ఇంట్లో చెప్పు: శకుంతలకు మగపిల్లవాడని" అన్నది అత్తయ్య, అడావిడిగా ఇంట్లోంచి బైటికి వస్తూ. నేను తలకాయాడించి, ఇంటికి బైలుదేరి వచ్చేశాను.

నేను ఇంటికి వచ్చేసరికి నాన్న, మామగారు కాఫీలు తాగుతున్నారు.

నేను ప్రవేశిస్తూనే, "మామయ్యకి మనవడు పుట్టాడు" అన్నాను, సంతోషంగా.

"ఎప్పుడు?" అన్నది అమ్మ.

"ఇప్పుడే –" అన్నాను.

"పోనీలే – పాపం, దాని కష్టానికి, తల్లీ, బిడ్డా బైటపడ్డారు" అన్నది అమ్మ సంతోషంగా, నిట్టూర్చి. నేను నీళ్ళతో ముఖం కడుక్కుని, కాఫీ తాగుతున్నాను.

"మీ మామయ్యల్లుడి కెట్లా ఉంది?" అన్నది అమ్మ, కాసేపుండి.

"ఏముంది – రాత్రి మళ్ళీ తిరగబెట్టిందిట" అన్నాను విషాదంగా.

అమ్మ మాట్లాడ్లేదు; దిగులుగా తలకాయ వంచుకున్నది.

"ఒరే – పంచాంగం పట్టుకురారా" అన్నాడు నాన్న, దగ్గర్లో పుస్తకం చదువుకుంటున్న రఘు నుద్దేశించి. వాడు బద్ధకంగా లేచి, లోపలికి పరుగెత్తాడు.

"బావగారూ – నేనీ బండికి వెళ్తాను" అన్నాడు మామగారు.

"వస్తాళ్ళెండి; కాస్త విశ్రాంతి తీసుకుని తీరుబడిగా వస్తాడు" అన్నాడు నాన్న; నాకు కాస్త దిగులు వేసింది. మామగారు మాట్లాడ్లేదు; నా వేపు చూశారు. నేను నేలమీద పడ్తున్న చెట్టు చివరలు కదుల్తుంటే చూస్తున్నాను.

రఘు పంచాంగం పట్టుకొచ్చాడు. దాన్ని తెరిచి, నాన్న ఒక్క క్షణం చూసి, మళ్ళీ మూసేసి, తలకాయ వంచుకున్నాడు. "ఏం నక్షత్రమండీ?" అన్నది అమ్మ, ఆదుర్దాగా.

"భరణి" అన్నాడు నాన్న, ముక్తసరిగా.

"భరణి!" అన్నారు మామగారు ఆదుర్దాగా.

అమ్మ తలకాయ వంచుకుని లోపలికి వెళ్లిపోయింది. నా హృదయం ఉద్వేగంతో మూలిగింది. సిగరెట్టు వెలిగించుకుని బజారుకు బైలుదేరాను.

"తప్పక రావాలి సుమండీ; సెలవల్లోనే చూదాం, ఏదైనా ఇల్లు దొరుకుతుందేమో" అన్నాడు మామగారు. నేను తలకాయాడించాను.

"క్షమించాలి; తొందరపడ్తున్నా. నేనీ బండికే వెళ్తున్నాను" అన్నాడు తిరిగి.

"ఆఁ – వెధవ పసివాడు; వాడు క్షమించటమేమిటి?" అన్నాడు నాన్న. మామగారు మాట్లాడ్లేదు. నేను వీధిలోకి వచ్చాను.

"మీరు రాకపోతే – అమ్మాయి చాల చిన్నబోతుంది" అన్నాడు మామగారు, ఆఖరుసారిగా నా వెనకాలే వచ్చి.

"ఎందుకండీ, యీ నెలాఖరుకు వస్తాగా?" అన్నాను నవ్వి.

మామగారు మాట్లాడ్లేదు; అసంతృప్తిగా తలకాయ వంచుకుని ఇంట్లోకి వెళ్లారు. రాధ చిలిపికళ్ళు నవ్వినై, నా మనస్సులో; తృప్తిగా చిరునవ్వు నవ్వుకున్నాను.

తాయి, శకుంతల నీడల్లా వెక్కిరించారు; వెగటుగా తోసేశాను. ఎండ కాస్త ఎక్కువైంది. మునిసిపల్ రీడింగురూముకు వెళ్లి, లోపలున్న పత్రికలు తిరగెయ్యటం మొదలు పెట్టాను.

20

తిరిగి ఇంటికి వచ్చేసరికి నాన్న వాకిట్లో కూర్చుని 'కళ్యాణ సుధ' చదువుకుంటున్నారు. నేను మెల్లిగా వెళ్ళి పక్కనే కుర్చీమీద కూర్చుని గోడలమీద పడ్తున్న ఎండవంక చూస్తున్నాను.

"మీ అమ్మ వెళ్ళి చాలసేపైంది – వెళ్తావా యేం?" అన్నాడు నాన్న.

నేను బైలుదేరాను. పైన ఎండకి మల్లేనే కడుపులోగూడ కాల్తున్నది. దోవలో హోటల్లో కాఫీతాగి మామయ్యయింటికి వెళ్లాను.

మామయ్య ఇంటిముందు అరుగుమీద కూర్చుని చుట్ట కాలుస్తున్నాడు. ఎదురుగుండా కారాగిఉన్నది. నేను గుమ్మంలో నిలబడి, ఇంట్లోకి చూశాను; అమ్మ శకుంతల ప్రసవించిన గదివాపునే నిలబడి చూస్తున్నది. ఇంతలోకి లేడీడాక్టరు గదిలోంచి వచ్చి, మామయ్యతో "లాభం కనబడదండీ" అని చెప్పి వెళ్లిపోయింది. మామయ్య లేచి నిలబడ్డాడు, బొటన వేలి వంక చూసుకుంటూ.

"ఏమైంది, మామయ్యా?" అన్నాను; మామయ్యకళ్ళు నా కళ్ళల్లోకి వెర్రిగా చూసినై.

నేను లోపలికి వెళ్లాను. నన్ను చూసి, "ఇప్పుడే వస్తున్నా – నీ వింటికి పద" అన్నది అమ్మ. అత్తయ్య బిగ్గరగా ఏడవటం మొదలు పెట్టింది, శకుంతల్ని కావిలించుకుని. పుట్టినబిడ్డ నేలమీద పడుకోనున్నది, ముఖం అవతలివేపు పెట్టి. నాకేమీ అర్థం కాలేదు. అమ్మవేపు చూశాను; కళ్లు నీళ్ళతో నిండిఉన్నై.

నా గుండెలు ఎగిరిపోయినై. దుఃఖం

చిన్న కుర్రవాడి నొకణ్ణి, వాగుడు గుణం ఎక్కువగా వున్న ఒక తల్లి, వైద్యానికి అని డాక్టరు దగ్గరకు తీసుకు వచ్చింది. డాక్టరు కనుపించింది మొదలు ఆతల్లి, పిల్లవాడిరోగ లక్షణాలు, గుణగణాలను గురించి అంతూ పొంతూ లేకుండా చెప్పుకు పోతున్నది. ఆవిడ చేసే ఆరొదలో ఎలాగో వీలు చేసుకొని డాక్టరు ఆపిల్లవాడినే ఒకటి రెండు ప్రశ్నలు అడిగాడు. పిల్లవాడు ఒక్కదానికీ సమాధానం చెప్పలేదు. డాక్టరుకు అనుమానం వేసి "నీకు మాట్లాడటం చేత కాదా?" అని అడిగాడు.

"ఎబ్బే! వినటమే చేత కావటం లేదండీ!!" అని ఆ కుర్రాడు సమాధానం యిచ్చాడు.

అతకని బతుకులు

ఆపుకోలేకపోయినాను. బిగబట్టుకుని, మామయ్యల్లుడున్న గదిలోకి వెళ్ళాను. అతను దగ్గుతున్నాడు. నన్ను చూసి, చిన్నగా నవ్వుకున్నాడు. నేను వెళ్ళి పక్కనే కూర్చున్నాను.

"శకుంతల క్షేమంగా ఉందా?" అన్నాడు. నేను తలకాయెత్తి పైకి చూశాను. పెళ్ళినాటి శకుంతల నవ్వింది. నేను పిచ్చిగా, మందంగా తలకాయూపాను.

మామయ్యల్లుడు మెల్లిగా లేచి దిండు కానుకుని కూర్చున్నాడు.

"పడుకోండి" అన్నాను; అతను వినిపించుకోలేదు.

"నేను చాల చెడ్డవాణ్ని" అని గొణుక్కున్నాడు; ఆశ్చర్యంగా అతని కళ్ళల్లోకి చూశాను.

"శకుంతల్ని ఎంత శ్రమపెట్టాను?" అన్నాడు మళ్ళీ దిగులుగా.

"ఇప్పుడదంతా తల్చుకోకండి" అన్నాను భయపడ్తూ.

"అది నిజంగా దేవకన్యే అనుకోండి" అన్నాడు నావేపు చూస్తూ నవ్వి.

నాకేమీ తోచలేదు. అతనివేపే నిర్ఘాంతపోతూ చూశాను. మామయ్యల్లుడు మెల్లిగా లేవటానికి యత్నించాడు. అతను లేవకుండా పట్టుకున్నాను.

"ఉండండి —శకుంతల్నోమాటు చూస్తాను", అన్నాడు, నావేపు దీనంగాచూసి.

నేను చెమ్మగిల్లిన కళ్ళతో చూశాను. అతను కిందివేపు చూస్తూ, "లేకపోతే దాని శవంగూడ నాకు దొరకదు" అన్నాడు. నా కళ్ళల్లోంచి నీళ్లు చిమ్ముకొచ్చినై.

ఈ లోకంలో శకుంతల నాకొక్కడికే బంగారు బొమ్మగాదు:— నవ్వుకున్నాను మళ్ళీ, నా వెనకటి వెర్రికి.

పక్క గదిలోంచి నాలుగైదు కంఠాలు కలిసి ఏడుస్తున్నయ్.

మామయ్యల్లుడికి దగ్గుతెర ముంచుకొచ్చింది. తట్టుకోలేక మంచంమీద పడుకుని, ముడుచుకుని గిలగిల తన్నుకోవటం మొదలుపెట్టాడు. చూడ్లేకపోయినాను; వాకిట్లోకి పరుగెత్తుకెళ్ళాను. మామయ్య నిశ్చలంగానిలబడి, దేనివంకో చూస్తున్నాడు.

"మీ అల్లుడికి ఎక్కువైంది" అన్నాను; మామయ్య కదల్లేదు.

మళ్ళీ హెచ్చరించాను. మామయ్య నావేపు శూన్యంగా చూసి, విషాదంగా నవ్వి ఊరుకున్నాడు. "ఆలస్యం చేస్తే లాభంలేదు మామయ్యా" అన్నాను అరుగా.

మామయ్య నావేపు భీకరంగా చూసి, నా వెనకాలే వచ్చాడు. శకుంతల్ని గదిలోంచి ఇవతలికి తీసుకొస్తున్నారు. ఆక్రందనాలు మిన్నుముట్టినై. చూడవచ్చిన వాళ్ళంతా బొమ్మల్లా నిలబడ్డారు, కళ్లు తుడుచుకుంటూ.

మామయ్యవేపు చూశాను; కళ్ళల్లోంచి నీళ్లు బొటబొట కారుతున్నై.

అల్లుడున్న గదిలోకి వెళ్లాం; మామయ్యల్లుడు భీకరంగా దగ్గి, మూలిగి వెల్లికిలా పడిపోయినాడు, పక్కమీద. నేను పరిగెత్తాను, మంచందగ్గిరికి. కళ్ళు తేలవేశాడు. మామయ్యా, నేనూ కలిసి అతన్ని కిందికి దించేశాం.

మామయ్య చతికిలపడి గోడమీద వేళ్లాడుతున్న అల్లుడి ఫొటోవంక వెర్రిగా చూశాడు. నేను గోడ కానుకుని మామయ్యల్లుడి ముఖంవంక చూడటం మొదలుపెట్టాను. బైట వరాండాలోంచి ఏడుపులు గొల్లుమంటునై.

ఇంతలోకి నాన్న వచ్చాడు. అక్కడి పరిస్థితంతా చూసి రెండు క్షణాలు నిశ్చ

"పంచతంత్రం" ★ ★ ప్రపంచ ప్రభావతంత్రం

మనదేశపు నీతికథల సాహిత్యంలో "పంచతంత్రం" చాలా ప్రశస్తమైనది. చాలా పురాతనమైనది.

సుప్రసిద్ధ ప్రాచీన చరిత్రకారుడైన ఫెరిస్తా యిట్లు వ్రాసెను.

క్రీ॥ శ॥ 581 మొదలు 571 వరకు పరిషియారాజైన నౌషెర్వానుకు భరతఖండపు రాజు ఒకడు "పంచతంత్రం" అనే గ్రంథమునున్నూ, ఒక చదరంగ పాళియున్నూ బహుమానంగాపంపెను.

ఆ పరిషియారాజుయొక్క మంత్రియైన "బూజూజ్మెన్‌హారు" దానిని సంస్కృతములోనుంచి పహ్లావీ భాషలోకి తర్జుమాచేసెను. ఈ పహ్లావీ భాషలోని పంచతంత్రమునకు "కలాలదమన" అని నామకరణం చేయబడెను. "కలాలదమన" అంటే "కరటక దమనక" అని అర్థం.

అటుపిమ్మట అది పహ్లావీభాషలోనుంచి "ఇబిన్–ఉల్–ముక్కా" అను పండితునిచే అరబ్బీ భాషలోకి తర్జుమా చేయబడెను.

ఘిరాన్ ఘిజ్నవీ అనే పరిషియను సుల్తాను కాలంలో అది పరిషియను భాషలోకి అనువదింపబడెను. ఈ తర్జుమా బాగాలేదని యెంచి హస్సన్ నైజ్ కాష్ఫి అనే ముల్లా (పండితుడు) దానిని సరళమైన పర్షియను భాషలో వ్రాసి యీ పర్షియను పంచతంత్రానికి "అన్వార్ సు హేలి" అని నామకరణం చేసెను. "చాందినీ దీపములు" అని యీమాటకు అర్థం.

అరబ్బీ ప్రతి అయిరోపా ఖండములో ప్రచారమైంది. దానినిబట్టి సిరియనుభాషలో ఒక ప్రతి క్రీ॥ శ॥ 570 లో వ్రాయబడెను. దానినిబట్టి గ్రీకు ప్రతి క్రీ॥ శ॥ 1180 లో వ్రాయబడెను. స్పెయిను భాషలోని ప్రతి క్రీ॥ శ॥ 1251 లోనూ హెబ్రూ ప్రతి క్రీ॥ శ॥ 1250 లోను వ్రాయబడెనని మాగ్డొనాల్డు పండితుడు వ్రాసెను.

హెబ్రూ ప్రతినిబట్టి లాటిను భాషలోనికి క్రీ॥ శ॥ 1480 లో "కాపు ఆజాన్" అనునతడు తర్జుమా చేసెను. దీనికి "డైరెక్టోరమ్ హ్యూమనే విటీ" అనగా (నీతికోశము) అని నామకరణం చేసెను. ఈ లాటిను గ్రంథమునుబట్టి జర్మను తర్జుమా క్రీ॥ శ॥ 1488 లో తయారుచేయబడెను. దీని పేరు "దస్ బుక్ దర్ బిస్పెల్ దర్ అల్టెన్ వైసెన్" (అనగా ప్రాచీన ఋషుల నీతికథల పుస్తకము) – 1552 సం॥లో ఇటాలియను భాషలో (లాటిను ప్రతిని అనుసరించి) పంచతంత్రం రచింపబడెను. ఈ ఇటాలియను ప్రతిని అనుసరించి సర్ థామస్ నార్తుగారు క్రీ॥ శ॥ 1570 సం॥లో యింగ్లీషు ప్రతిని రచించిరి.

సిరియను భాషలోని పంచతంత్రమునకు, "కలిలగ దమనగులు" అని పేరు. పహ్లావీ భాషనుంచి అరబ్బీ భాషకు తర్జుమా క్రీ॥ శ॥ 6 శతాబ్దంలో జరిగింది. ఈ అరబ్బీ గ్రంథం పేరు "కలీలా దమ్నహ్" క్రీస్తుకు పూర్వము 200 సం॥ నాటిది యీ పంచతంత్రం అని కాశ్మీరులో దొరికిన ప్రతినిబట్టి ఊహింపబడుచున్నది. నేటికిది మొట్టమొదటిసారిగా బొమ్మల రూపంలో యీ ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రకటింపబడుచున్నది.

లంగా నిలబడిపోయినాడు. నా వేపు బైటికి రమ్మన్నట్టు చెయ్యూపాడు. నేను మామయ్యవేపు చూశాను. మామయ్య తలకాయ వంచుకుని కూర్చున్నాడు, చతికిలబడి. నేనూ, నాన్న ఇవతలికి వచ్చేశాం. శకుంతల చుట్టూ ఆడవాళ్ళంతా మూగి ఏడుస్తున్నారు. "ఇంటికి పద" అన్నాడు నాన్న, తగ్గు స్థాయిలో.

"అమ్మని పిల్చుకొస్తాను" అన్నాను.

"మీ అమ్మ ఇందాకనే వచ్చేసింది" అన్నాడు నాన్న.

నేను మాట్లాళ్ళేదు; మెల్లిగా నాన్న వెనక నే నడక సాగించాను.

జీవితంలో దాక్కున్న కష్టాలు ఇంత దారుణంగా ఉండటం పగవాళ్లకి కూడ సహించరానిది. శకుంతల ఒక్కక్షణం నా హృదయంలో ఆడుకుంది; మరుక్షణం నిర్జీవియై నేలమీద పడింది.

మద్రాసులో అద్దెయిల్లు దొరకటం ఎంత కష్టమో అందరికీ తెలిసిందే.

వెనుక ఒకసారి మా మిత్రుడి యింటికి వెళ్లాను. ఆయిల్లు అతని స్వంతం. అందులో ఒక చిన్న భాగం ఖాళీ అయింది. వాకిట్లో ఒక బోర్డు కట్టించాడు. అందులో ఇలా వున్నది.

> 'అద్దెకు యీయ బడును. చిన్న భాగము.— పిల్లల్లేని వారికే!'

నేను అక్కడ వుండగానే వీధి తలుపుమీద ఎవరో తట్టినట్లు చప్పుడు అయింది. మా మిత్రుడు వెళ్లితలుపు తీశాడు. పదేళ్ల కుర్రాడొకడు ముందుకువచ్చి "ఆ భాగం అద్దెకు కావాలి. నాకు పిల్లలు లేరు. నేనూ నాముసలి తల్లీ తండ్రులూ తప్ప ఎవ్వరమూ వుండము." అన్నాడు బెరుకు బెరుకుగా.

కుర్రవాడు నిల్చున్న చోటికి కొంచెం ప్రక్కగా చూస్తే ?5 ఏళ్లు మించని ఒక పురుషుడు, 27 ఏళ్లకు మించని ఒకస్త్రీ, అతి దీనంగా నిల్చొని వున్నారు.

మా మిత్రుడు వాళ్లకు ఆభాగం అద్దెకు యిచ్చేశాడు.

అతకని బతుకులు

21

ఇంటికి వెళ్లేసరికి అమ్మ తల వంచుకుని వాకిట్లో కూర్చొనున్నది. నేను, నాన్న వెళ్ళి వరాండాలో కూర్చున్నాం. "ఇక అన్నానికి లేవండి" అన్నది అమ్మ, దిగులుగా.

"అన్నం తిన్నట్టే ఉన్నది" అన్నాడు నాన్న, కళ్లు మూసుకుని. నాకు గూడా కడుపు నిండుగా ఉంది. గొంతులో దుఃఖం అడ్డంపడి కరుడుకట్టుకుపోయిఉన్నది. సిగరెట్టు వెలిగించుకుని కుర్చీలో పడుకున్నాను. పొగ సుడులు తిరుక్కుంటూ పైకి పోతున్నది.

"పోనీ, నీవు లేరా" అన్నది అమ్మ. నేను అన్నం తినదల్చుకోలేదు; ఆ మాట చెప్పాను.

అమ్మ మాట్లాడ్లేదు; విచారంగా గుమ్మంమీద తల పెట్టుకుని, నేలమీద పడుకున్నది, ఇంటి కప్పుకేసి చూస్తూ.

కాసేపటికి రఘు, సీతాయ్ బడినుంచి వచ్చారు; అమ్మ వాళ్ళిద్దరికీ అన్నం పెట్టేందుకు లోపలి కెళ్లింది. నేను వాకిలి వేపు చూస్తున్నాను.

ఒక్కక్షణం స్వామి ఆశ్రమం నాకళ్ళ ముందు మెదిలింది. నల్లటి కొండలు వెక్కిరించినై. తాయిమూలుగు చెవిలో ప్రతిధ్వనించింది. నాన్న వేపు దిగులుగా చూశాను; ముసలితనం ప్రవేశించింది.

మెల్లిగా లేచి, మామయ్యఇంటికి వెళ్ళాను. నే వెళ్లేసరికి మామయ్య అరుగుమీద కూర్చుని చుట్ట కాల్చుకుంటున్నాడు. లోపల ఏడుపులు వినబడటంలేదు.

"శకుంతల బతికిందిరా" అన్నాడు మామయ్య, సంతోషంగా, నన్ను చూడగానే. ఎందుకనో నాకది శుభవార్త అనిపించలేదు.

"గవర్నమెంటుడాక్టర్ని పిలిపించాను; ఇంజక్షను ఇవ్వగానే కొద్దిగా కదిలింది" అన్నాడు మళ్లీ. నేను మాట్లాడ్లేదు.

"కాని—అల్లుడు దాటిపోయినాడు; మాఖర్మ" అన్నాడు, తలకాయ పట్టుకుని.

నేను తలకాయ వంచుకుని లోపలికి నడిచాను. మామయ్యల్లుడి శవం వరాండాలో ఉన్నది; గదిలో శకుంతల మెదలకుండా పడుకోనున్నది. అత్తయ్య పక్కనే కూచుని, నన్ను చూడగానే, తడి కళ్లు తింటేసుకున్నది. నేను రెండు క్షణాలు నిలబడి, వెనక్కి తిరిగి వచ్చేశాను. కాసేపటికి అమ్మగూడా వచ్చింది. రాగానే, మామయ్య శకుంతల సంగతి చెప్పాడు. అమ్మ నిట్టూర్చింది; మాట్లాడ్లేదు. లోపలికి వెళ్లింది.

"అల్లుడికి ఎంత ప్రయత్నించినా, లాభం లేకపోయిందిరా" అన్నాడు మామయ్య, దిగులుగా. నేను విషాదంగా చప్పరించాను.

"విధవ బ్రతుకు బతికేకంటె, అదిగూడ పోతేనే బాగుండేది" అన్నాడు మామయ్య చుట్ట నోట్లో పెట్టుకుంటూ.

"ఆ మాట ఎందుకనుకోవాలిలే, మామయ్యా" అన్నాను, ఓదర్చటానికి.

మామయ్య మాట్లాడ్లేదు. కాసేపుండి, "ఇక అది ఏం చూసుకుని బతుకుతుంది చెప్పు? ఆ బిడ్డగూడ బొడ్డుకోయకముందే పాయెను" అన్నాడు. నేను మాట్లాడ్లేదు.

"అది బతికినా, సుఖంలేదు" అన్నాడు మామయ్య, ఆఖరి మాటగా.

నాకు ఏమనాలో తోచలేదు. సిగరెట్టు వెలిగించి, మండుతున్న అగ్గిపుల్ల వేపు చూస్తున్నాను.

"ఇక దాని బ్రతుకు ఎట్లా తెల్లవార్తుందో?" అన్నాడు మామయ్య చుట్ట ఆర్పేస్తూ.

నేను మాట్లాడ్లేదు. శకుంతల కుళ్ళిపోతున్నా, చూసి ఊరుకోవటంకన్న నేను చేయగలిగింది లేదు; నా హృదయంలో నాట్యంచేసిన మూర్తి శిథిలమైపోయినా, కల్పించుకునే అవకాశం నాకు లేదు.

"ఇది దాటి బైటపడిందల్లే?" అన్నాడు మామయ్య, మళ్ళీ; నా గుండెలు కొట్టుకున్నై. శకుంతల్ని నేనే హత్యచేసినట్లు బాధపడ్డాను.

"ఇప్పుడు దాన్నిగురించి చేసేదేమీ అనుకోకు, మామయ్యా" అన్నాను మామయ్య వేపు చూసి. మామయ్య మాట్లాడ్లేదు — దూరంగా కనబడ్తున్న తాటిచెట్ల చివర్లకేసి చూస్తున్నాడు.

నేను లేచి నిలబడ్డాను: "వస్తా, మామయ్యా" అని ఇంటికి వచ్చేశాను. రాగానే నాన్నతో చెప్పాను, శకుంతల బతికిన విషయం. నాన్న మాట్లాడ్లేదు; ఒక్కక్షణం నా వేపు చూసి, తల తిప్పుకున్నాడు. నేను పక్కనే మంచం వాల్చుకుని పడుకున్నాను, సిగరెట్టంటించుకుని.

ఎండ మెల్లిగా వాలిపోయింది: లోకం చల్లబడ్డది. నేను స్నానంచేసి బజారుకు బైలుదేరాను.

ఒకవాడు శకుంతల నాతో కలిసి పరవళ్లు తొక్కింది; హృదయానికి హృదయమై వెన్నెలలు కురిపించింది; శాశ్వతంగా శకుంతల నాదేనని భ్రమసిపోయినాను.

కాని కాలం ఎదురుతిరిగింది; శకుంతల పరాయిదైపోయింది. ఏమైనా సుఖంగా ఉంటుందని ఆశించాను; గుండెల్లోని గాయం మానటానికి పారిపోయినాను. తాయి ఎదురైంది; అమాయికంగా ఒక్క రాత్రి చాంచల్యంతో నన్ననుసరించింది, తను కలలోగూడ భావించని కఠిన పాషాణ శిఖరాల మీదికి. కాని పాపం, అందుకో లేకపోయింది. నా సహాయాన్ని కాల దన్ని కాలగర్భంలో కలిసిపోయింది. పిచ్చెక్కి వెనక్కి తిరిగివచ్చాను. శకుంతల నన్ను మరచిపోయి, వేరే లోకాల్లో విహ రిస్తున్నది. నాదోవ నేను చూసుకున్నాను. ఇంతవరకూ నేను తలిచి ఎరుగని అమా యకురాలు తన యావజ్జీవితాన్ని నా పాదా లకు అంకితం చేసుకున్నది. నా గుండెలు కరగిస్తే; రాధ వాటిలో స్థానం ఏర్పరుచు కుంది. కాలం దెబ్బతీసింది. నా కళ్లముందు

కోలినాస్

ప్రకృతియొక్క ఆకుపచ్చ క్లోరోఫిల్ గలది

...మీ దంతధావనంలో యింతకు ముం దెన్నడు లేని గొప్ప పురోగమనం!

మొక్కలను తాజాగా ఆకుపచ్చగా ఉంచు ప్రకృతి సిద్ధమైన క్లోరోఫిల్‌తో...నోటి దుర్వా సనను రోజంతా పోగొట్టుకొనుడు...దంత క్షయమును చిగుళ్ల బాధను అపుకొనుడు!

నిస్సందేహంగా మీకింతకు పూర్వ మెన్నడు లభించని అమోఘమగు దంతరక్షణ యిదియే! క్లోరోఫిల్ గల అద్భుతమగు క్రొత్త కోలినాస్ దంతక్షయమును రోగ క్రిములను నాశనము చేయుటయేగా నోటి దుర్గంధము ఒక రోజంతా లేకుండ చేయును....ఇది మొక్కలను నవనవగా తాజాగా ఉంచు ప్రకృతి సిద్ధమైన రసా యనిక పదార్థమగు ఆకుపచ్చని క్లోరోఫిల్ వల్లనే. క్లోరోఫిల్ గల కోలినాస్ అమోఘమైనదగుటయే గాక పొదుపు కూడా. పొడి బ్రష్ మీద అరం గుళమే చాలు. ఆకుపచ్చని అట్ట పెట్టెలో అన్ని దుకాణాలలో దొరకును. నేడే కొని దంత శాస్త్రంలోకల్ల అపూర్వపు రోగమనంవల్ల కలిగే లాభములను పొందండి!

క్రొత్త ఆకుపచ్చ అట్ట పెట్టెను గమనించుడు.
స్టాండర్డ్ కోలినాస్ (పసుపుపచ్చ లేబిల్ గలది) కూడ లభించును.

2,000 అమెరికన్ దంతరోగులు క్లోరోఫిల్‌యొక్క సత్ఫలితములను నిరూపించుచున్నారు.


నాలుగు సంవత్సరముల పరిశోధన, దాదాపు 2,000 అమెరికన్ రోగులపై యింతకు మునుపెన్నడు జరుపబడని అత్యంత పెద్ద పరిశీలనవల్ల ఋజువైన దేమంటే. క్లోరోఫిల్ గల డెంటల్ క్రీమ్

- చిగుళ్ల సామాన్య జబ్బులన్నిటిని అరికట్టును
- నోటి దుర్గంధములను ఒక రోజంతయు పూర్తిగా పోగొట్టును
- దంతక్షయ క్రిములను అమోఘంగా నాశనం చేయును

మీ దంత వైద్యునకు ఈ శోధనలన్నియు తెలుసు. ఆయన యీ ఫలితములను నిర్ధారణ చేయగలడు.

* * *

★ నోటి దుర్గంధములను పోగొట్టును
★ చిగుళ్లకు పటుత్వము నిచ్చును
★ దంతక్షయమును అరికట్టును



'కోలినాస్' చిరునవ్వులో ఆరోగ్యం అగుపడుతుంది!

భారతదేశంలో తయారు చేయువారు: జ్యాఫ్రే మానర్స్ & కం. లి. బొంబాయి 1

GK 7131

అతకని బతుకులు

శకుంతల నీరసించిపోయింది. ఈ లోకములో ఎదురు దెబ్బలకు సిద్ధంగా ఉంది. శకుంతల బ్రతుకు నిరర్థకమై పోతున్నది; నేను రాధతో జీవితయాత్ర ప్రారంభించబోతున్నాను. శకుంతల జీవితంలోని సూర్యుడు అస్తమించబోయేసమయంలో, నా జీవితచంద్రిక ఉదయించబోతున్నది.

నేనూ, శకుంతలా ఒకరి కోసం ఒకరం పుట్టామనుకున్నాను, కాదు — ఒకరి దుఃఖాన్ని ఇంకొకళ్ళం గేలిచెయ్యటానికి పుట్టాం.

ఇక ఆలోచించలేకపోయినాను. ఎదురుగుండా కనబడ్డ కాఫీహోటల్లోదూరి కూర్చున్నాను. రేడియో ఎలుగెత్తి పాడుతున్నది, లోపలి కప్పుల మోతల్ని లక్ష్యం చెయ్యకుండా. కాఫీతాగి, పార్కుకెళ్ళి కూర్చున్నాను.

ఇక శకుంతల ఏం చూసుకోని బ్రతుకుతుందో నా కర్థం గాలేదు. నా హృదయంలో రాధ నవ్వింది. గట్టిగా కళ్లు తెరచి, సిగరెట్టు వెలిగించాను.

రేడియోపాట గాలిలో తేలిపోతున్నది-

ఇంటికి తిరిగి వచ్చేసరికి ఎనిమిదైంది. భోజనం కానిచ్చి మామయ్యఇంటివేపు వెళ్లాను. మామయ్యవాళ్లు డి శవాన్ని దహనానికి తీసుకునివెళ్ళిపోయినారు. శకుంతల గదిలో చిన్న గుడ్డిదీపం వెలుగుతున్నది. అత్తయ్య గుమ్మం దగ్గిరిగా తల వంచుకుని కూర్చున్నది.

"వియ్యంకుడుగారు వచ్చారా?" అన్నాను.

"పొద్దుపోయేటప్పుడు వచ్చారు-ఇప్పుడే తీసుకెళ్ళారు" అన్నది అత్తయ్య, రహస్యంగా.

"అమ్మా" అన్నది శకుంతల, నీరసంగా.

"ఏమమ్మా" అన్నది అత్తయ్య, దగ్గిరికెళ్లి; నేను గుమ్మం దగ్గర నిలబడ్డాను.

"వారి సంగతి కనుక్కుంటున్నావా?" అన్నది శకుంతల; నా హృదయం వెక్కి వెక్కి ఏడ్చింది.

"నీవు మెదలకుండా పడుకోమ్మా" అన్నది అత్తయ్య, చిన్నగా.

"కాదమ్మా - ఆయనసలే రోగిష్టి మనిషి. మీ రంతా ఇక్కడే ఉంటే ఎట్లా?" అన్నది శకుంతల మళ్ళీ. అత్తయ్య మాట్లాడ్లేదు.

"నాకేమీ ఫరవాలేదు లేవే — ఆయనకేం కావాలో కనుక్కుంటూండు" అన్నది శకుంతల, తిరిగి. "అట్లాగేలే అమ్మా" అని అత్తయ్య గది ఇవతలికి వచ్చింది.

నన్ను దగ్గిరికి పిలిచి — "ఓ అరగంట

కింవట యీ లోకంలోకి వచ్చింది—ఎంత సేపూ ఆ మొగుడి స్మరణే" అన్నది అత్తయ్య, గద్గదంగా. నేను మాట్లాళ్లేదు. నీళ్లునిండిన కళ్ళతో అత్తయ్య వంక చూశాను; ఆమెకళ్లు ఎండిపోయిఉన్నై.

"ఇవ్వాళ పాపిష్టి రోజురా, నాయనా" అన్నది అత్తయ్య, స్తంభాని కానుకొని కూలబడి.

"స్మృతి వచ్చింతర్వాత బిడ్డని గురించి గూడా అనుకోలేదు" అన్నది అత్తయ్య, కాసేపటికి.

నేను మాట్లాడకుండా సిగిరెట్టు వెలిగించాను.

"ఆ దెబ్బన ఇదిగూడ చచ్చిపోయినా బాగుండును" అన్నది అత్తయ్య, తలవంచుకుని. వరాండాలోని గుడ్డి వెల్తుర్లో అత్తయ్య కన్నీటి చుక్కలు మెరిసినై.

"అమ్మా" అని శకుంతల మూలిగింది; అత్తయ్య లేచి వెళ్ళింది.

"ఎవరే?" అన్నది శకుంతల, "బావలే—నిద్రపో" అన్నది అత్తయ్య.

శకుంతల మాట్లాళ్లేదు; పక్కకి తిరిగి పడుకున్నది.

"పాపాయి ఎక్కడమ్మా?" అన్నది, పక్క తడుముకోని.

"అవతలి గదిలో ఉన్నాలే — నీవు పడుకో" అంది అత్తయ్య, శకుంతల్ని గద మాయిస్తున్నట్టు. శకుంతల మాట్లాళ్ళేదు.

"నీళ్లు కాగానే గుంటూరు పోదామమ్మా—ఇక్కడుంటే వారికి నయంగాదు" అన్నది శకుంతల, కాసేపటికి. నా హృదయం బాధగా మూలిగింది. అత్తయ్య మాట్లాళ్లేదు.

"ఏమే—అమ్మా, పోవద్దూ?" అన్నది శకుంతల, తిరిగి.

"అట్లాగేలే—హైరానపడాావు; మాట్లాడకు" అని అత్తయ్య గదిఇవతలికి వచ్చేసింది. నేను మామయ్యల్లుడు దాటిపోయిన గదిలోకి వచ్చాను. గదంతా చీకటిగా ఉంది. ఆ చీకట్లో శకుంతల ఫోటో నవ్వింది. మామయ్యల్లుడు 'కార్నేషన్' గానులో భీకరాట్టహాసం చేశాడు.

ఆగలేక రహస్యంగా వెక్కి వెక్కి ఏడ్చాను. శకుంతలకే నేను పరాయివాణ్ణి. శకుంతల తన జీవితాన్ని ఇంకో వ్యక్తికి పెన వేసుకున్నది. తన దౌర్భాగ్యానికి, కుళ్ళి, నశించిపోతుందేగాని, నావంక కన్నెత్తి చూడదు.

22

"శకుంతల కెట్లా ఉందిరా" అన్నది అమ్మ, ఇంటికి తిరిగి రాగానే; చెప్పాను.

(54-వ పేజీ చూడండి)

మన చదువుల బడులకు బ్రిటిష్ ఏలుబడి చేతబడి

1931 సం॥లో "రాయల్ - ఇన్‌స్టిట్యూట్ - ఆఫ్ - ఇంటర్నేషనల్ - అఫైయిర్సు" (అంతర్జాతీయ వ్యవహారముల బ్రిటిష్ ప్రభుత్వ సంస్థ)లో ఉపన్యసిస్తూ గాంధిమహాత్ముడు యిలా అన్నాడు:—

"ఈ దేశానికి బ్రిటిష్‌వారు వచ్చి ఇక్కడ అమలులోఉన్న వ్యవస్థలను పద్ధతులను వినియోగించుకొనుటకు బదులుగా వాటిని నిర్మూలింపసాగిరి. అందువల్ల భారతదేశంలో సుమారు 50 సం॥ల క్రిందటగాని 100 సం॥ల క్రిందటగాని ఇప్పుడు ఉన్నంతమంది నిరక్షరులు లేరు. ఇప్పటికన్న అప్పుడే దేశంలో ఎక్కువ విద్యావ్యాప్తి ఉండేది."

ఈస్టుయిండియా కంపెనీవారి పరిపాలనావ్యవహారమును విమర్శించుటకు ఆ కంపెనీవారిచే నియమింపబడిన ఒక సెలెక్టు కమిటీ (ప్రత్యేక విచారణ సంఘము) 1832సం॥లో ఒక నివేదికను (రిపోర్టును) తయారుచేసెను. ఈ నివేదిక యొక్క మొదటి వాల్యూము (సంపుటి)యందు 503-504 పుటలలో-బళ్లారిజిల్లా కలెక్టరు అగు ఏ. డి. కాంబెలుగారు 17-8-1823 తేదీని వ్రాసిపంపిన రిపోర్టు ప్రకటింపబడెను.

1822 సం॥లో బళ్ళారిజిల్లా కలెక్టరు వ్రాసిన రిపోర్టులో యీ క్రింది విషయములను వ్రాసెను:—

"ఇంతకుపూర్వము (బ్రిటిష్ యీస్టు యిండియా కంపెనీవారి ఏలుబడి యిక్కడ ప్రారంభము గాకపూర్వము) చాలా గ్రామాలలో పాఠశాలలు ఉండేవి. కాని యిప్పుడటువంటివి ఏమీ కన్పించవు. పూర్వము భారీ విద్యాలయములుగా ఉంటూ ఉండినటువంటి వాటియందు యిప్పుడు కొద్దిమంది పిల్లలే చదువుచున్నారు. వీరైనను ధనవంతుల బిడ్డలు. బడి జీతములను చెల్లింపజాలని పేదవారి బిడ్డలు అట్టి బడికిపోవుటలేదు.

ఈవిధంగా గ్రామాలలోని చదువుల బడులు అంతరించిపోవుటకు గల పెద్ద కారణము ఏదనగా నానాటికి దేశము బీదస్థితిలోకి రావడమే. దేశములో తయారయ్యేడి వస్త్రములకు బదులుగా ఇంగ్లాండులో తయారైన మిల్లు గుడ్డలు విరివిగా దిగుమతి అవుతూ ఉన్నాయి. అందువల్ల ఇక్కడి గ్రామాలలోని బట్టల నేత పనివాండ్లకు ఆర్జన ఆదాయము చాలా తగ్గిపోయింది.

....

....

స్వదేశరాజుల చేతులలోను, వారి అధికారుల చేతులలోను ద్రవ్యం సమృద్ధిగా ఉండేది. వారు ఆ ధనమును యీ దేశంలోనే ఖర్చుపెట్టేవారు. కాని ఈ ప్రభువులవద్ద ఉండిన ధనం యూరోపియనుల చేతులలోనికి (యీస్టు యిండియా కంపెనీవారికి) చేరుతున్నది. కాని, ఆ ధనమును వారు భారతదేశంలో వినియోగించడం లేదు. ఆ విధంగా వినియోగించుటకు కంపెనీవారి శాసన నిబంధనలు ఒప్పుకొనవు. క్రమక్రమంగా దేశద్రవ్యం యీరీతిగా హరించి వేయబడుటవల్ల సాధారణ మధ్యతరగతి జనులున్నూ క్రిందితరగతి జనులున్నూ తమ పిల్లల చదువుకొరకై బడిజీతాలు యిచ్చుకోలేక, పిల్లలను బడులకు పంపించడం మానివేశారు. తమ పిల్లలకు రవ్వంత కాయకష్టం చేయగల దార్ఢ్యం రాగానే బడికి పంపించకుండా పనిపాటులలో ప్రవేశపెట్టుతున్నారు."

పైరీతిగా బ్రిటిష్‌వారు తమ ఏలుబడిలో మన చదువుల బడులకు చేసిన చేతబడిచేత భారతదేశంలో చదువుకొనేవారి సంఖ్య క్షీణించింది.

వేలంపాట

కన్నప్పని చూస్తే ఎవరికైనా సరే నవ్వు రాకుండా ఉండదు. చదువుకుంటున్న చిన్నపిల్లల దగ్గర్నుంచి ముసలివాళ్ళదాకా అతన్ని ఏవిధంగానైనాసరే ఏడిపించంది వదలరు. అలాగంటే కన్నప్ప వెర్రివాడని కాదు. ముప్ఫై సంవత్సరాల క్రిందట మూడో క్లాసు మూడేళ్లు వరసగా ఫేలయి, ఆఫీసులో గుమాస్తాగా చేరాడు. అదీ ఎకౌంట్సు డిపార్టుమెంట్ లో! అసలు అతన్ని అందరూ ఏడిపిస్తారంటే కారణం లేకపోలేదు. తనకు తెలిసిన వారందరి కంటే తను ఎంతో తెలివయినవాడనని అనుకుంటాడు. కాని అన్ని విషయాల లోనూ పప్పులో కాలు వేస్తాడు.

ముప్ఫై సంవత్సరాల క్రిందట కొన్న చేతివాచి అహర్నిశలు చేతికి తగిలించుకునే ఉండేవాడు కన్నప్ప. ఒకవేళ అది చెడిపోయినా, ఆగిపోయినా దాన్ని తన చేతినుంచి విడదీసేవాడు కాదు. నాలుగు రోజులై వరసగా గడియారం నడవడం లేదు. అందుకు కన్నప్పకి చాలా కోపం వచ్చింది. దానికితోడు హనుమంతరావు

ఆలోచన మందులా పనిచేసింది. హనుమంతరావు కన్నప్ప తోటి గుమస్తా. అందరి కన్నా కన్నప్పకి హనుమంతరావుమీద ఎక్కువ అభిమానం. గడియారాన్ని వేలం వేయించాలని హనుమంతరావు చెప్పిన ఆలోచన కన్నప్పకి బ్రహ్మాండంగా తోచింది. వేలం వేయించడానికి సంసిద్ధుడయాడు. వేలం పాడేందుకు వేరే ఒక గుమాస్తాని నియమించాలని, ఆ గుమాస్తాకి వేలం పాటలో అయిదు రూపాయలు ఇచ్చివేయాలని నిర్ణయించాడు హనుమంతరావు. దానికి కన్నప్ప ఒప్పుకున్నాడు. గడియారం వేలం వేయబడేవార్త ఆఫీసులో అందరికీ అందజేశాడు హనుమంతరావు. ఆఫీసు గుమస్తాలందరికీ సాయంకాలం అయిదు గంటలకు ఆఫీసుకు ఎదురుగా నున్న మైదానంలో చేరుకోవాలని నోటీసు పంపించడమయింది. ఆనాడు జీతాల రోజు గాబట్టి వేలంపాట పోటీ బాగుంటుందని కన్నప్ప గట్టిగా నమ్మాడు. హనుమంతరావు ఒక్కడే తన శ్రేయోభిలాషి అని ఆనాడు పూర్తిగా దృఢపరుచుకో గలిగాడు.

సాయంకాలం అయిదు గంటలకి గుమస్తా



లందరూ మైదానంలో హాజరయారు. గడియారం చేత్తో పట్టుకుని వేలంపాట పాడ్డానికి ఒక గుమస్తాని ఎన్నుకున్నారు

"కన్నప్పగారి రిష్టువాచి వేలంపాట ఖరీదు ఒక్క అయిదురూపాయిలే" అని వేలంపాట మొదలు పెట్టాడు గుమస్తా. అమాంతంగా గుండె ఆగిపోయినట్లయింది. కన్నప్పకి. కాని వేలం అని జ్ఞాపకానికి రాగానే మనసు కుదుటపడ్డది.

"కన్నప్పగారి బంగారు ముద్దలాంటి చేతి గడియారం పదిరూపాయిలు. ఇరవై రూపాయిలు! ఇరవై అయిదు రూపాయిలు" కన్నప్ప హృదయం ఆనందంతో ఊగిసలాడింది. దమ్మిడీకి పనికిరాని వాచి అయిదు నిమషాలలో పాతిక రూపాయిల విలువగలది అయింది. హనుమంతరావు అతని కళ్ళల్లో దేముడయాడు. "ముప్ఫై రూపాయిలు."

హనుమంతరావు కన్నప్ప చెవిలో అన్నాడు. "కన్నప్పగారూ మీ వాచీ ఖరీదయిందిలా ఉంది. లేకపోతే పోటీ ఇంత జోరుగా ఉంటుందా? ఇంతమంచిది వేలం వేయడం నాకేమీ నచ్చలేదు సుమండీ." కన్నప్ప మెదడులో ఆలోచనలు పరుగులెత్తాయి "అవునోయ్ నేను కూడా అదే ఆలోచిస్తున్నాను అసలు ఇటువంటి వాచీలు ఈ రోజుల్లో లేవంటేనమ్మ. కాని ఏం చేస్తాం? ఇంతదాకా వచ్చిన తరువాత ఇప్పుడు వేలం లేదంటే నోట్లో గడ్డిపెడ్తారు" అని కన్నప్ప తన విచారాన్ని తెలియబర్చాడు. "ముప్ఫై అయిదు రూపాయిలు" "నలభైరూపాయలు" నలభై అయిదురూపాయిలు." వేలంపాట పోటీ జోరుగావుంది. "మీకు మళ్లీ మీ వాచీ కావాలంటే ఒక్కటే ఒక్క ఉపాయం ఉంది. అలా చేస్తే మీ వాచీ మీకు దక్కుతుంది" అన్నాడు హనుమంతరావు. ఈ మాటలు కన్నప్పలో ఉత్సాహాన్ని రేకెత్తించాయి "ఆ ఉపాయం ఏమిటో వెంటనే చెప్పవోయ్." అని ఆరాటంతో అన్నాడు.

"స్వయంగా మీరే ఏభైరూపాయిలకి వాచీ తీసుకోండి." అని ఊదాడు హనుమంతరావు.

"నా వాచీకి నేనే..."

"నేనున్నానుగా పాడండీ" అని ఆవేశంతో అన్నాడు హనుమంతరావు.

"ఏభై రూపాయిలు" అనేశాడు కన్నప్ప గుమస్తాలు ఒక్కరొక్కరే జారుకున్నారు.

"ఏభైరూపాయిలు ఒకటి, ఏభైరూపాయిలు రెండు; ఏభైరూపాయిలు మూడు." అన్నాడు గుమాస్తా. కన్నప్ప దగ్గర ఏభై రూపాయిలు తీసుకుని గడియారాన్ని అతనికి ఇచ్చేశాడు—వేలం వేసిన గుమస్తా." కన్నప్పకి గుండె ఆగిపోయినట్లయింది.

"మరి నా డబ్బో" అని ఏడుపుముఖంతో హనుమంతరావుని అడిగాడు. "మీ డబ్బు మీదే. వేలం వేసిన అతనికి అయిదు రూపాయలు ఇస్తానని ఒప్పుకున్నారు కదూ మీరూ? ఇదుగో ఏభై రూపాయలకి మీ వాచి వేలంలో మీరు పాడుకున్నారు. దీంట్లో అయిదు రూపాయలు పోగా నలభై అయిదు రూపాయలు ఇవిగో తీసుకోండి" అని హనుమంతరావు 45 రూపాయలు కన్నప్పకి ఇచ్చివేశాడు. అయిదు రూపాయలు పోతే పోయాయికాని తన గడియారం పోలేదని సంతోషించాడు కన్నప్ప.

మర్నాడు హనుమంతరావు సెక్షన్‌లో అందరికీ పకోడీ, టీ ఇప్పించాడు - కన్నప్పకికూడా. ఎందుకో అర్థం అయిందికాదు కన్నప్పకి. కాని తరువాత తెలిసింది అతనికి. తనదగ్గర అయిదు రూపాయలు కొట్టేయడానికే హనుమంతరావు వేలంపాట ఏర్పాటు చేశాడని. కాని అతన్ని ఏమీ అనలేకపోయాడు కన్నప్ప, కారణం తన తెలివితక్కువ తనమే అని అతనికి తెలుసు. ★

నశ్యమహాసభ

"ఈశ్వర"

అఖిలభారత నశ్యమహాసభ మైలపూరులో మహావైభవంగా జరిగింది. భారతదేశపు నలుమూలలనుండీ ప్రతినిధులు సమావేశానికి వచ్చారు. శాంథోమ్ కు పోయేదార్లో ఒక పెద్ద భవనం తాలూకు దొడ్డిలో, మహాసభకై పెద్ద పందిలి వేయబడింది. సభనిండా మెర్క్యురీట్యూబులూ, రంగురంగుల అడ్వర్టయిజుమెంటులూ, ముచ్చట గొల్పేలాగా అలంకరింపబడ్డాయి. సభాతలాన పెద్దవేదిక-దానికి కుడివైపున పత్రికలవారికి ఏర్పాటు చేయబడింది. ఎడమవైపు మహారాజ పోషకులకు ప్రత్యేకించారు.

మద్రాసులో నశ్యం తయారు చేసే సంస్థలన్నీ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొన్నాయి. రంగురంగుల పోస్టర్లను సభాప్రాంగణంలో అలంకరింపచేశారు. సమావేశంరోజున ఆ కంపెనీలవారందరూ ప్రతికల్లో ఎడ్వర్టైజుమెంటులుకూడా ఇచ్చారు. ఇటీవల హైద్రాబాదులో ఎగ్జిబిషను జరిగినప్పుడు వారికి ప్రథమ బహుమతి లభించినవైనం, ఆ సందర్భంలో అక్కడి ఏజంటు హైద్రాబాదు మేయరుతో కలిసి తీయించుకొన్న ఫోటో, త్రివర్ణాలతో మొదటిపేజీలో ముద్రింపబడ్డాయి. కొన్ని కంపెనీ లానాడు నశ్యాన్ని కన్సెషను రేటుకుకూడా చిల్లరగా విక్రయించాయి.

దేశం మొత్తంమీద నశ్యాన్ని విరివిగా వాడేది దాక్షిణాత్యులేగనుక, ప్రథమ మహాసభాధ్యక్షులు దాక్షిణాత్యులే కావాలని, నిర్వివాదంగానే తేల్చబడింది. కుంభకోణం డెలిగేటు రంగయ్యంగారు మహాసభకు అధ్యక్షుడుగా ఎన్నిక అయ్యారు. మైలాపూర్ *Snuff Takers Union* (*S. T. U.*) (పొడుం పీల్చే పెద్దల సంఘం) శాశ్వతాధ్యక్షులు శంకర శివయ్యర్ ఆహ్వాన సంఘాధ్యక్షులుగా పట చేశారు.

మొదట ఆహ్వాన సంఘాధ్యక్షులు లేచి మాట్లాడుతూ, ప్రథమనశ్యమహాసభ మైలపూర్లో జరగటం చాలా సముచితమన్నారు. నశ్యాభిమానులకు నేటికి సభద్వారా గౌరవం కలగడంచూచి ఆయన చాలా గర్వించారు.

తరువాత సభాప్రారంభకులు ఉపన్యాసం మొదలుపెట్టారు. మొదట వారు చారిత్రకంగా నశ్యాన్నిగూర్చి ప్రస్తావిస్తూ, నశ్యం చాలా పురాతనంగా వస్తున్న గొప్ప టానిక్కనిన్నీ, దాని విలువ బ్రిటిషు హయాంలోనే కొంతవరకు కించపరుపబడిందనిన్నీ అన్నారు. స్వరాజ్య సాధనానంతరం దీనికి సముచితస్థానం లభించగలదని తాము ఆశించామనీ, కాని జాతీయ ప్రభుత్వం దీనినిగూర్చి శ్రద్ధ తీసుకోకపోవడం చాలా శోచనీయమనీ అన్నారు. ఇకముందుకూడా ఇట్లాగే అశ్రద్ధచేస్తే, ఈ పరిశ్రమ కూడా క్షీణించిపోగలదనే భయాన్ని కూడా వెలిబుచ్చారు. నశ్యం ప్రతివారికీ అందుబాటులో ఉంటున్నాకూడా, చాలామంది యువకులు సిగరెట్లపై మోజుపడడం తమకు ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. ఇటువంటి దుర్లక్షణాలను రూపుమాపాలంటే, సిగరెట్లు, బీడీలమీద ప్రత్యేకపు పన్ను విధించడంకన్న, మరేమీ గత్యంతరం లేదన్నారు.

తరువాత ఆయన ఈ అఖిలభారత సంఘాన్ని ఏయే పద్ధతులమీద నడిపించాలీ అన్న విషయంపై ప్రస్తావిస్తూ, కొన్ని విలువైన సూచనలు చేశారు. ఈ సంఘానికి ముఖ్యమైన నశ్యపు కంపెనీలన్నీ కొంత ధనసహాయం చేయాలనీ, దీనికి ప్రభుత్వం కూడా సబ్సిడీల నియ్యవలసి ఉంటుందనీ అన్నారు. ఈ అఖిలభారత సంఘం (1) పబ్లిసిటీ (*Publicity*)
(2) రిసెర్చి (*Research*)
(3) సేల్సు (*Sales*)
అనే మూడు శాఖలుగా వ్యవహరించడంబాగుంటుందని సూచించారు.

తరువాత హర్షధ్వనులు చెలరేగుతూండగా సభాధ్యక్షులు లేచారు. వీరు లేచి నిలుచోగానే వివిధ ప్రతికల *Staff Photographers* ఫొటోలుతీసుకొన్నారు. అధ్యక్షులు ఉపన్యాసం మొదలుపెడ్తూ, అది ప్రథమమహాసభ కనుక, అధ్యక్షోపన్యాసం సాధ్యమైనంత క్లుప్తంగా వుండాలని తాము అభిప్రాయపడ్తున్నామన్నారు. ఉపన్యాసం తేలికగా జ్ఞాపకముండేలాగు (తమకూ, శ్రోతలకీ కూడా), దాన్ని పద్యీకరించామని చెప్పి, చదవడం మొదలు పెట్టారు.

"పొడుంకోసం చచ్చిపోదాం!
పొడుంలేనిది బ్రతుకు దేనికి?
ఓ చిటికె పొడుమును పీల్చి చూడూ,
పొడుం పీల్చని పిచ్చివాడా!
పొడుం కాదా తెలివి నిస్తా
తమిళ దేశపు తంబిగాళ్ళకు*?

---

* ఈ మాటను అధ్యక్షులు స్వోత్కర్షగానే అన్నారు. కాని అనువాదంలో మరోభావాన్ని ఇచ్చినట్లయితే అనువాదకుడు క్షంతవ్యుడు.

పెద్దమిల్లు యజమాని ఒకాయన నాలుగేళ్ల తరువాత యీ వేసవి కాలానికి కొడైకెనాల్ కు వెళ్లాడు. అక్కడ ఆయన భార్య పిల్లలతో హాయిగా కాలం గడుపుతూ వుండగా, ఆయన తాలూకు మిల్లు వుద్యోగి ఒకడు ఆయనకు ఒక వుత్తరం వ్రాశాడు. అందులో యిలా వున్నది.

"మీరు మీ కుటుంబం అక్కడ హాయిగా నిశ్చింతగా కాలం గడుపుతున్నారని ఆశిస్తున్నాను. ఇక్కడ మన ఫ్యాక్టరీలో మేమందరమూ హాయిగా వుంటున్నాము!!"

పొడుం పీలిచి బాగుపడవోయ్
పొడుం పీల్చని పిచ్చివాడా!
మేటియైనది 'లవండరు స్నఫ్'
చురుకు నిచ్చును, మంచి వాసన
దుర్గుణాలే లేవు దీనికి
వాడి మేలును పొందవోయ్."

రంగయ్యంగారు ముగించి కూర్చున్నారో, లేదో సభలో పెద్ద దుమారం చెలరేగింది.

ఒక అభ్యుదయ నశ్య ప్రేమి లేచి, దేశం పురోగమించడానికి తీవ్రంగా కృషి చేస్తూంటే, రంగయ్యంగారు పద్యంలో ఉపన్యసించడం తాము తీవ్రంగా నిరసిస్తున్నా మన్నారు. 'ఉక్కారు', 'ఉక్కారు' అని నాల్గువేపులనుంచీ కేకలురావడంతో, ఆయన మళ్లీ మాట్లాడ లేదు.

ఇంతట్లో మరొకరులేచి, ఉపన్యాసం తేలికగా గుర్తుండటానికి, అధ్యక్షులవారు పద్య సందేశాన్నీయడం, సబబేనని సమర్థించారు.

ఇంతట్లో 'ఆంధ్ర' నుండి వచ్చిన ఒక డెలిగేటు వెంకట నరశింహాచారిగారులేచి 'లవండరు' నశ్యం, కేవలం ఒక కంపెనీ వారు తయారుచేసే ఒకనస్యవిశేషమనీ దాన్ని గూర్చి చివరలో ఉద్బోధించడం ప్రెసిడెంటుగారి పక్షపాత దృష్టికి తార్కాణమనీ, ఆయన ఇట్లా చేయడానికి, వెనుక ఏదో ఉన్నట్లు తమకు సందేహంగా వుందనీ సభకు తెలియ చేశారు.

సెక్రటేరియట్ నశ్యపోషక సంస్థ ప్రతినిధి లేచి, నశ్యం ఈమధ్య తన ఉచిత స్థానాన్ని కోల్పోటానికి కొంతవరకు దాని దుర్వాసన కారణం కావచ్చన్నారు. అటువంటి దుర్వాసనా రహితమైన దాన్ని గూర్చి ప్రస్తావించడం, అటు మహత్తర నశ్య ప్రాశస్త్యాన్నీ, ఇటు నూతన సమస్యనీ, సమన్వయ పరచడమే నన్నారు. ఇటువంటి సమర్థులు మొదటి అధ్యక్షుడు కావడం, ఈ సంస్థకు గల ఉజ్జ్వల భవితవ్యాన్ని సూచిస్తున్నదన్నారు. ఈ 'లవండర్ స్నఫ్' ఏదైనా కావచ్చుననీ, దీనికి ఏ ఒక్క కంపెనీతోనూ సంబంధం లేదనీ, చేతనైతే యింట్లోకూడా దీన్ని తయారుచేసికోవచ్చునీ ఆయన స్పష్టపరిచారు.

తరువాత ఇంకా కొంచెంసేపు తర్జన భర్జనలు జరిగినమీదట, సమావేశంవారు, ఈ క్రింది తీర్మానాలను ఆమోదించారు.

(1) అఖిలభారత నశ్యమహాసభ అనే పేరుతో, ఈసంస్థ రిజిస్టరుచేయింపబడాలి.

(2) మహాసభ తాలూకు ఒక ఉపసంఘం పత్రికాధిపతులను కలసికొని, ఇట్టి సంస్థల ఆవశ్యకతను గూర్చి కనీసం ఒక 'సబ్-లీడరు' అన్నా వ్రాయించవలసిందిగా కోరాలి.

(3) నశ్యపు డబ్బీలు క్వినైనుబిళ్ళలవలె, ప్రతి పోస్టాఫీసులోను లభించేటట్లు, ప్రభుత్వం సబబైన ధరలను నిర్ణయించి, ఏర్పాటు చేయించాలి.

(4) వివిధకంపెనీల నశ్యప్రాశస్త్యాన్నీ, *Comparative Study* (తారతమ్య పరిశీలన) చేసే ఒక వ్యాసరచనా పోటీ ప్రతి సంవత్సరం జరిపి, ఉత్తమ రచయితను ప్రభుత్వం తగురీతిగా సత్కరించాలి.

(5) నశ్యపు ప్రమాణాన్ని వృద్ధిచేసేందుకై (*For increasing the Standaard of snuff*) రిసెర్చి సాగించేందుకు, ప్రభుత్వం ఏటా గ్రాంటులు మంజూరు చేయించాలి.

హాచ్! హాచ్! అంటూ ముందు అధ్యక్షులవారూ వారివెంట సభ్యులు దిక్కులు మారుమూగేలా జయధ్వానాలు చేయగా సభ జయప్రదంగా ముగిసింది. ★



విజ్ఞానవీధులు

"డాక్టర్"



65. తామరాకు మీది నీటిబొట్టు

జిగజిగ మెరుస్తుందేమి? అని పెనుగొండనుంచి వై. వి. రావుగారు అడుగుతున్నారు. ఏ ఆకుమీద నిలిచినా, నీటిబొట్టు ఆ ఆకుకి అంటుకుంటుంది. వెల్తురు అలాంటి నీటిబొట్టుమీద పడినప్పుడు ఆ నీటిలో ప్రవేశించి ఆకుమీద పడుతుంది. ఆకు తనమీదపడ్డ వెల్తురులోని రంగులనన్నిటినీ పీల్చి ఆకుపచ్చరంగనిమాత్రం పరావర్తము చేస్తుంది. మనకంటికి అందేవెల్తురు ఆకుపచ్చనే కనక తడిసిన ఆకు ఆకుపచ్చగా వుంటుంది.


తామరాకు మీదివైపున, నీరు ఆకుకి అంటుకుని ఆ వైపునఉన్న సన్నరంధ్రాల్ని కప్పేయకుండా వుంచడానికి ఒక మైనపుపూతలాంటిది వుంటుంది. అందువల్ల తామరాకు మీదపడ్డ నీటిబిందువు ఆకుకి అంటుకోకుండా నీటిగుండులాగ ఆకుమీద కదుల్తుంది. ఇలాంటి బిందువుమీదపడిన వెల్తురు ఆ బిందువు ఉపరిభాగమువల్ల పరావర్తము చేయబడి మన కంటికి అందుతుంది. ఇది తెల్లని వెల్తురే. ఇక కొంతవెల్తురు బిందువులో ప్రవేశించి ఆకువైపుకి దిగుతుంది. కాని నీరు తామరాకుకి అంటుకోని కారణముచేత వెల్తురు తామరాకుదాకా దిగే ముందు నీటిబిందువు అడుగుకిదిగి బిందువు మట్టువల్ల పైకి పరావర్తమౌతుంది. ఇదీ తెల్లని వెల్తురే. అంటే బిందువు ఉపరితలమువల్లనూ, మట్టువల్లనూ పరావృతమైన తెల్లని వెల్తురు మనకంటికి అందుతున్నదన్నమాట. ఈ వెల్తురు చాలామట్టుకు బిందువు లోపలినుంచి వచ్చేదే కనక బిందువు తెల్లగా, అంటే మెరుస్తూ కనబడుతుంది.

తనలోనికి ప్రవేశించిన వెల్తురు కిరణాన్ని బయటికి పోనీయక మొత్తంగా పదేపదే తనలోపలికే పరావర్తము చేసుకోగల గుణము వజ్రానికుంది. అందువల్ల వెల్తురుతో నిండిపోయిన వజ్రము దక్కగా మెరుస్తుంది, సన్నపరిముల్లుమీద నిదురించే మంచుబొట్లుకూడా వాటిలో ప్రవేశించిన సూర్యకిరణాన్ని వెనక్కి వెనక్కి తిప్పకొడమువల్లనే జిగజిగ మెరుస్తాయి. బిందువులుగాని ఇంకొకరకపు ఆకుమీదపడితే, ఆ ఆకుకి అంటుకుంటాయి. వాటి గోళత్వమూ, ప్రత్యేకసత్తా నశించి, మెరవకపోడమేకాక అకంతటా చెదిరిపోతాయి.

66. ఆకాశంలోని పాలపుంత

"ఆకాశములో చీకటి రాత్రులందు యించుమించు ఈశాన్యమునుండి నైరుతి దిక్కునకు తెల్లగా చారవలె కాన్పించునది ఏమి?" అని చాటపర్రునుంచి వేగీ శీతారామయ్యగారు అడుగుతున్నారు.

ఈ 'పాలపుంత' నందరూ చూచి వుంటారు. హెర్షెల్ అనే ఆంగ్లేయ సిద్ధాంతి దీనిని మొట్టమొదట దూరదర్శనీయంత్రసహాయముతో పరిశీలించి, ఇది అసంఖ్యాకములైన నక్షత్రముల సముదాయమని నిర్ణయించాడు. దీనిలోనే 'రాజహంస' అనబడే 'అక్విలా' నక్షత్రాలున్నాయి. వాటి ప్రాంతాన్న తీసిన ఫొటోగ్రాఫులో నల్లని వాయుమండలాలుకూడా కనపడ్డాయి. కనక ఈ పాలపుంత అనంతాకాశములోని ఒక ద్వీపజగత్తన్నారు.



ఈ పాలపుంత పటకొలాగా ఆకాశములో ఈ మూలనుంచి ఆ మూలకి కనపడడము గుర్తించి హెర్షెల్ ఒక అద్భుతమైన ఊహ చేశాడు. పలచని భూతద్దాన్ని వేళ్ళమధ్యని పట్టుకుని అంచువైపుచూస్తే కనపడేటట్లే ఈ 'పాలపుంత' కూడా కనపడుతుంది కనక ఇది పలచని బిళ్ళ ఆకారంలో ఉన్న ఆకాశద్వీప జగత్తని ఆయన నిర్ణయించాడు. సూర్యుడూ ఆయనగారి గ్రహమండలమూ ఈ జగత్తులో ఒక బిందువు. కనకనే 'బిళ్ళ' లోకి చూసినప్పుడు కనపడేటన్ని నక్షత్రాలు, 'బిళ్ళ'కి లంబంగా చూస్తే కనపడవట! అంటే మనము అనంతాకాశంలో పాలపుంత అనే బిళ్ళలాంటి నక్షత్ర సముదాయంలోవుండి ఆబిళ్ళలోకి చూస్తున్నాము కనకనే పాలపుంత ఆకాశంలో ఈకొసనుంచి ఆ కొసకి కనపడుతోందన్నమాట.

ఈ పాలపుంతలో నలభయి లక్షలకోట్ల నక్షత్రాలుండవచ్చునని కేప్టెయన్ అనే ఒళందు సిద్ధాంతి లెక్కగట్టాడు. భూమికీ సూర్యుడికీ 10, 40, 00, 000 మైళ్ళని వైజ్ఞానికులు కనిపెట్టారు. అంటే సెకనుకి 186000 మైళ్ళచొప్పున ప్రయాణించే వెల్తురు సూర్యుణ్ణించి మనకి చేరడానికి ఎనిమిదిన్నర నిమిషాలు పట్టుతుంది. ఈ దూరాన్నే జ్యోతిర్నిమిషాల్లో చెప్పితే, "సూర్యుణ్ణించి భూమికి ఎనిమిదిన్నర జ్యోతిర్నిమిషాల దూరము" అనాలి. ఇక భూతఅద్దపు ఆకారంలోవున్న "పాలపుంతవ్యాసము 100000 జ్యోతిర్వత్సరాలు! దళసరి 10000 జ్యోతిర్వత్సరాలు. మన సూర్యుడూ ఆయనగారి గ్రహకుటుంబమూ ఈ పాలపుంత కేంద్రానికి 30000 జ్యోతిర్వర్షాలదూరంలో అంచువైపున ఉన్నారు.

ఈ పాలపుంతలోని నక్షత్రాలు కదులుతూనే వున్నా, మనకీ వాటికీ ఉన్న దూరమువల్ల అట్టే కదిలినట్టు కనిపించవు. కదలడమే కాదు. కేంద్రముచుట్టూ తిరుగుతున్నాయిట కూడానూ! ఈ పాలపుంత వయస్సు రెండు లక్షలకోట్ల సంవత్సరాలనుంచి పది లక్షలకోట్ల వత్సరాలదాకా ఉండవచ్చునట!

★ విజ్ఞాన వీథులు ★

చిట్టిప్రశ్నల జవాబులు

—ఎండలో నడిచినప్పుడు ఆ కాంతికి మన కళ్లు అలవాటుపడి వుంటాయి. ఎండలోనుంచి ఇంటిలోనికి ప్రవేశించినప్పుడు, కాంతివంతములైన వస్తువులనుంచి వచ్చే దీప్తిని చూడడానికి అలవాటుపడ్డ కళ్ళకి అంతకంటె తక్కువ దీప్తిగల ఇంటివస్తువులు ప్రత్యేకంగా కనబడవు. అయితే ఈ ‘అలవాటు’ ఎంతోసేపు ఉండదు. కళ్లు మూసుకుని ఒక క్షణము నిలబడి అప్పుడు కళ్లువిప్పితే, కళ్లకి చీకటిని చూడడము అలవాటై, ఈ చీకటి కంటె ఎక్కువ దీప్తిగల ఇంటివస్తువులు కనబడతాయి.

—మెఱుపు అన్నది ఒక మేఘంనుంచి ఇంకొక మేఘానికి జరిగే విద్యుత్ప్రవాహము. ఈ విద్యుత్ప్రవాహపు దారిలో గాలి దట్టముగా వుంటే పుట్టే చరక్కనే మెరుపే ఉరుము. గాలి గాని దట్టముగా లేకపోతే పాదరసపు దీపాలలోని వెలుగుకిలాగే జిగ్గుజిగ్గు మనే మెరుపుకి శబ్దము (ఎక్కువ) ఉండదు.

—నవ్వును ఆపడం ఎలా? నలుగురికీ చాలాదూరంలో కూర్చుంటే సరి. ఒక్కరమూ వుంటే సామాన్యంగా నవ్వు రాదు. నవ్వడంవల్ల నవ్వినవారికి లాభమేనట! ఊపిరితిత్తులకు సుఖమైన కసరత్తు.

—మట్టిపాత్రలోని నీరు ఆపాత్ర గోడలలోని సూక్ష్మరంధ్రాలద్వారా పైకి చిమ్ముతుంది; నీరు సులువుగా ఇగిరిపోగలదు కనక ఈ ‘చెమ్మ’ ఇగిరిపోతుంది. ఇలా ఇగిరిపోడానికి కావలిసిన వేడిమిని ఆ పాత్రలో వున్న నీటిలోనుంచి గ్రహిస్తుంది. అందువల్ల కూజా, కుండా, లోపలి నీరు చల్లబడుతుంది. కుండలోని నూనె పైకి చిమ్మినా, సులువుగా ఇగరదు. (నూనె కాగితము ఎండలో పెట్టినా నూనెఅంతా ఎండిపోదు—గమనించండి.) నూనె ఇగరకపోతే పాత్రలోని నూనెలోని వేడిమి ఎలా తగ్గుతుందీ? నూనెని లోహపు పాత్రలో పోసి, ఆ పాత్రకి తడిగుడ్డ చుట్టబెట్టి వుంచండి. ఆ గుడ్డ తడి ఆరేటప్పటికి పాత్రలోని నూనె చల్లబడుతుంది. తడిగుడ్డ ఆరడానికి లోహపాత్రయొక్క వేడిమి ఖర్చౌతుంది. ఈ పాత్ర నూనెనుంచి వేడిని గ్రహిస్తుంది. అందువల్ల నూనె చల్లబడుతుంది. అయితే మనము నూనెను ఇలా ఎందుకు చల్లార్చము? అవసరము లేదుగనుక.

—చేతి గోళ్లయొక్క ఉపయోగమేమిటో నేను చెప్ప నక్కరలేదనుకుంటాను. కాలిగోళ్లు ఈనాటికి మాత్రము వేళ్లకు కొంచెము కాపుదలగా ఉన్నాయి. మూతజోళ్లు బాగా అలవాటు కాగా కాగా భవిష్యన్మానవునికి కాలిగోళ్లు తగ్గిపోతాయని మన మూహించవచ్చును.

—సిగరెట్టులో ‘నికొటిను’ అనే విషజాతి వస్తువున్నది. మరి సిగరెట్టు పీల్చడమువల్ల నష్టములేదని ఎలాగ అనగలము? సిగరెట్టునుపట్టే వేళ్లు చూడండీ నల్లగా కమిలిపోతాయి.

—‘ఆకాశములో వురిమినప్పుడు భూమిలో వెదురుకర్రలు పొడుచుకువస్తాయి’ అన్న మాట నిజము కాదు.

—‘జ్వరజీవి’ నుండి ఉష్ణము అనుక్షణమూ గాలిలోనికి ‘దీప్తి’ గుణమువల్ల ఎక్కుతూన్నప్పటికీ శరీరంలోని జీవకణాలకీ, జ్వరవిషాలకీ సంగ్రామము జరుగుతూన్నంతసేపూ జ్వరజీవికి ఉష్ణపు సప్లై జరుగుతూనే వుంటుంది.

—మంగళగిరి పానకాలరాయుడు మనము తీసుకువెళ్లిన పానకములో సగం మాత్రమే తాగి బొళుక్కుమని ఉమ్మేయడు. పూజారిని తప్పుకోమని మీరుపోసి చూడండి. ఎంత పానకమూ, నీరూ అయినా సరే, ఆ కొండలోని ఆ బిలములోనికి పోయి ఇంకిపోతుంది. ఆ బిలానికి అడ్డుగా పెట్టినది విష్ణుమూర్తివారి చక్రము కాదు. పూజారుల చక్రము!

—దృష్టిదోష మన్నది అది వున్నదని నమ్మేవారి భయోత్పాతమేననీ, ఒకరి మనస్సులోని భయోత్పాతము ఇతరులకీ వస్తువులకీ కూడా ప్రసరించగలదనీ నేననుకుంటాను. కళ్లు గుడ్డతో కట్టిన కుమారునిచేత, తాను చేతితో పట్టుకున్న వస్తువు పేరు చెప్పించిన పాశ్చాత్య వనితను నేను చూచినాను. రోడ్డుపక్కన గారడీవాళ్లు కూడా, ‘మెస్మరిజం’ చేసి కంటిమీద వస్త్రము కప్పిన బాలునిచేత తాము ముట్టిన వస్తువు పేరును చెప్పించడము కూడా నేను చూచాను.

ఊహలను తరంగాలుగా ఒకరు పంపడమూ, వాటిని అందిపుచ్చుకుని ఇంకొకరు చెప్పడమూ వీలౌతుందని నా నమ్మకము. దృష్టి తగిలిన దనుకునే తల్లి భయోత్పాతమే బిడ్డపై కేంద్రీకరింపబడి బిడ్డను బాధిస్తుందని నే నంటాను. ‘నాకే దృష్టి తగిలినద’నుకుని బాధపడడము కూడా లోకములోకద్దు. అయితే దృష్టి దోషమనే స్ఫురణే లేని

★ విజ్ఞాన వీధులు ★

చిట్టిప్రశ్నల జవాబులు

—ఎండలో నడిచినప్పుడు ఆ కాంతికి మన కళ్లు అలవాటుపడి వుంటాయి. ఎండలోనుంచి ఇంటిలోనికి ప్రవేశించినప్పుడు, కాంతివంతములైన వస్తువులనుంచి వచ్చే దీప్తిని చూడడానికి అలవాటుపడ్డ కళ్ళకి అంతకంటె తక్కువ దీప్తిగల ఇంటివస్తువులు ప్రత్యేకంగా కనబడవు. అయితే ఈ 'అలవాటు' ఎంతోసేపు ఉండదు. కళ్లు మూసుకుని ఒక క్షణము నిలబడి అప్పుడు కళ్లువిప్పితే, కళ్లకి చీకటిని చూడడము అలవాటై, ఈ చీకటి కంటె ఎక్కువ దీప్తిగల ఇంటివస్తువులు కనబడతాయి.

—మెరుపు అన్నది ఒక మేఘంనుంచి ఇంకొక మేఘానికి జరిగే విద్యుత్ప్రవాహము. ఈ విద్యుత్ప్రవాహపు దారిలో గాలి దట్టముగా వుంటే పుట్టే చరక్కునే మెరుపే ఉరుము. గాలి గాని దట్టముగా లేకపోతే పాదరసపు దీపాలలోని వెలుగుకి లాగే జిగ్గుజిగ్గు మనే మెరుపుకి శబ్దము (ఎక్కువ) ఉండదు.

—నవ్వును ఆపడం ఎలా? నలుగురికీ చాలాదూరంలో కూర్చుంటే సరి. ఒక్కరమూ వుంటే సామాన్యంగా నవ్వు రాదు. నవ్వడంవల్ల నవ్వినవారికి లాభమేనట! ఊపిరితిత్తులకు సుఖమైన కసరత్తు.

—మట్టిపాత్రలోని నీరు ఆపాత్ర గోడలలోని సూక్ష్మరంధ్రాలద్వారా పైకి చిమ్ముతుంది; నీరు సుళువుగా ఇగిరిపోగలదు కనక ఈ 'చెమ్మ' ఇగిరిపోతుంది. ఇలా ఇగిరిపోడానికి కావలిసిన వేడిమిని ఆ పాత్రలో వున్న నీటిలోనుంచి గ్రహిస్తుంది. అందువల్ల కూజా, కుండా, లోపలి నీరు చల్లబడుతుంది. కుండలోని నూనె పైకి చిమ్మినా, సులువుగా ఇగర లేదు. (నూనె కాగితము ఎండలో పెట్టినా నూనెఅంతా ఎండిపోదు—గమనించండి.) నూనె ఇగరకపోతే పాత్రలోని నూనెలోని వేడిమి ఎలా తగ్గుతుందీ? నూనెని లోహపు పాత్రలో పోసి, ఆ పాత్రకి తడిగుడ్డ చుట్టబెట్టి వుంచండి. ఆ గుడ్డ తడి ఆరేటప్పటికి పాత్రలోని నూనె చల్లబడుతుంది. తడి గుడ్డ ఆరడానికి లోహపాత్రయొక్క వేడిమి కర్చౌతుంది. ఈ పాత్ర నూనెనుంచి వేడిని గ్రహిస్తుంది. అందువల్ల నూనె చల్లబడుతుంది. అయితే మనము నూనెను ఇలా ఎందుకు చల్లార్చడమూ? అవసరము లేదుగనుక.

—చేతి గోళ్లయొక్క ఉపయోగమేమిటో నేను చెప్ప నక్కరలేదనుకుంటాను. కాలిగోళ్లు ఈనాటికి మాత్రము వేళ్లకు కొంచెము కాపుదలగా ఉన్నాయి. మూతజోళ్లు బాగా అలవాటు కాగా కాగా భవిష్యన్మానవునికి కాలిగోళ్లు తగ్గిపోతాయని మన మూహించవచ్చును.

—సిగరెట్టులో 'నికొటీను' అనే విషజాతి వస్తువున్నది. మరి సిగరెట్టు పీల్చడమువల్ల నష్టములేదని ఎలాగ అనగలము? సిగరెట్టునుపట్టే వేళ్లు చూడండీ నల్లగా కమిలిపోతాయి.

—'ఆకాశములో వురిమినప్పుడు భూమిలో వెదురుకర్రలు పొడుచుకువస్తాయి' అన్న మాట నిజము కాదు.

—'జ్వరజీవి' నుండి ఉష్ణము అనుక్షణమూ గాలిలోనికి 'దీప్తి' గుణమువల్ల ఎక్కుతూన్నప్పటికీ శరీరంలోని జీవకణాలకీ, జ్వరవిషాలకీ సంగ్రామము జరుగుతూన్నంతసేపూ జ్వరజీవికి ఉష్ణపు సప్లై జరుగుతూనే వుంటుంది.

—మంగళగిరి పానకాలరాయుడు మనము తీసుకువెళ్లిన పానకములో సగం మాత్రమే తాగి బొళుక్కు మని ఉమ్మేయడు. పూజారిని తప్పుకోమని మీరుపోసి చూడండి. ఎంత పానకమూ, నీరూ అయినా సరే, ఆ కొండలోని ఆ బిలములోనికి పోయి ఇంకిపోతుంది. ఆ బిలానికి అడ్డుగా పెట్టినది విష్ణుమూర్తివారి చక్రము కాదు. పూజారుల చక్రము!

—దృష్టిదోష మన్నది అది వున్నదని నమ్మేవారి భయోత్పాతమేననీ, ఒకరి మనస్సులోని భయోత్పాతము ఇతరులకీ వస్తువులకీ కూడా ప్రసరించగలదనీ నేననుకుంటాను. కళ్లు గుడ్డతో కట్టిన కుమారుని చేత, తాను చేతితో పట్టుకున్న వస్తువు పేరు చెప్పించిన పాశ్చాత్య వనితను నేను చూచినాను. రోడ్డుపక్కన గారడీవాళ్లు కూడా, 'మెస్మరైజు' చేసి కంటిమీద వస్త్రము కప్పిన బాలునిచేత తాము ముట్టిన వస్తువు పేరును చెప్పించడము కూడా నేను చూచాను.

ఊహలను తరంగాలుగా ఒకరు పంపడమూ, వాటిని అందిపుచ్చుకుని ఇంకొకరు చెప్పడమూ వీలౌతుందని నా నమ్మకము. దృష్టి తగిలిన దనుకునే తల్లి భయోత్పాతమే బిడ్డపై కేంద్రీకరింపబడి బిడ్డను బాధిస్తుందని నేనంటాను. 'నాకే దృష్టి తగిలినద'నుకుని బాధపడడము కూడా లోకములోకద్దు. అయితే దృష్టి దోషమనే స్ఫురణే లేని

బలేదొంగ

"గోపి"

మాచవరంలో మల్లయపేరట
వర్తకుడొక్కడువున్నాడు.
మల్లయ భార్యా మహాలక్ష్మమ్మా
మంచి ధైర్యముగల వనిత
అలసి సొలసి ఒకనాటిరాత్రి వా
రొడలు మరచి నిదురించారు
దొరికిందే సందని ఆయింట్లో
దొంగ ఒక్కడూ దూరాడు
దొంగ కాలికీ పళ్ళెం తగిలీ
భళ్ళున శబ్దం అయ్యింది
అర్ధరాత్రి యీ శబ్దం ఏమిటి
అంటూ ఆవిడ లేచింది
వంట ఇంటిలో విహరిస్తున్నా
దొంగని ఆమే చూచింది
భద్రకాళిలా, రుద్రమాంబలా
ఉగ్రస్వరూపం దాల్చింది
ఒక్క అంగలో దొంగని చేతులు
వెనక్కి విరిచీ పట్టింది.



"ఏమండీ, మిమల్నే ! అబ్బా,
లేవండీ" అని పిలిచింది
భర్త ఇదంతా చూస్తూ కూడా
కిమ్మనకుండా వున్నాడు
మంచం కమ్మిని కావిలించుకుని
వణుకుతు ఇల్లా అన్నాడు
ఒసే, ఒసే, ఇఇ...ఇల్లా రావే
మోటవెధవ కాటేస్తాడు:
అని విన్నాడో లేదో ఆమెని
కండ లూడగా కరిచాడు.
పట్టు తప్పగా బ్రతుకు జీవుడా
అంటూ వీధిని బడ్డాడు
బలే ఉపాయం
చెప్పావయ్యా మల్లయ్యా
మంచం మాత్రం
దిగ బోకయ్యా మూడారైనాను
దొంగ మాటలను విన్నర గంటకి,
ఉగ్రమూర్తి ఐపోయాడు
పిరికి వెధవ నేం చేస్తానో అంటూ
మల్లయ మంచం దిగినాడు!

విచిత్ర వ్యక్తి



మూలం:- మార్క్ ట్వేన్

జరిగినకథ:— అస్ట్రియాదేశంలో ఈ జెల్ డార్ఫ్ మా స్వగ్రామం. నా యీడువాళ్లే అయిన సెప్పీ, నికొలాస్ అనే మరి ఇద్దరు బాలురతో కలిసి ఎప్పుడూ అడవుల్లో, కొండల్లో తిరిగేవాణ్ణి. ఒక రోజున మేము ఒక కొండమీద మా ఆట స్థలంలో కూర్చుని ఉండగా ఒక కొత్తవ్యక్తి వచ్చాడు. తన పేరు సైతాను అనీ, తను దేవతననీ చెప్పాడు. మాకు చాలా వింతలు చేసి చూపించాడు—

3

మా నూత్న మిత్రుడు చూడని సంఘటన లేదు; వెళ్లని స్థలం లేదు; అతనికి తెలియని విషయం లేదు; మరిచిపోయిన విషయం లేదు. మనం కొన్నేళ్లు శ్రమపడితే గాని తెలుసుకోలేని దాన్ని అతడు ఒక్క క్షణంలో చూపుతో గ్రహిస్తాడు. అతడు ఏదన్నా వర్ణించటం ప్రారంభిస్తే అది సజీవంగా మనకళ్లకి కట్టినట్టుంటుంది. భూమిని దేవుడు సృష్టించటం చూశాట్ట; మొదటి మానవుడైన ఏడం సృష్టిని కూడా చూశాట్ట. శాంసన్ దేవాలయస్తంభాల్ని ఊడబెరికి దేవాలయాన్ని ధ్వంసం చెయ్యటం చూశాడు. జూలియస్ సీజరు చనిపోవటం చూశాడు. స్వర్గంలో దేవతల దైనిక జీవితం ఎట్లా ఉంటుందో చెప్పాడు. నరకంలోని అగ్నిసరస్సులో దేవుడి విరోధులు మలమల మాడిపోవటం వర్ణించాడు. వీటన్నిటి గూర్చి చెబుతూ అవి మాకళ్ల ఎదట కనిపించేట్టు చేశాడు. మేము నిజంగా ఆయా స్థలాల్లో ఉన్నంత ప్రత్యక్షంగా అవన్నీ కనిపించాయి. నరకలోకపు అగ్నిసరస్సులో గిలగిల కొట్టుకునే పాపాత్ముల దారుణ బాధచూసి మేము గజగజలాడిపోయాం. కాని సైతాను ఆ దృశ్యం చూస్తూ ఉత్తుత్తి మంటల్లో ఉత్తుత్తి ఎలికలు కాలిపోతున్నంతగా కూడా చలించలేదు.

ఇక భూలోకంలో స్త్రీపురుషులను గూర్చి మాట్లాడుతున్నప్పుడు, వారి పనులను, ఎంత మహోత్తమమైనవాటినైనా సరే, వర్ణిస్తున్నప్పుడు, సైతాను ఇదంతా నిరర్థకమైన బొమ్మలాటగా పరిగణిస్తున్నట్టు మాట్లాడాడు. అతడు మనుషుల్ని గూర్చి మాట్లాడుతున్నా, ఈగల్ని గూర్చి, దోమల్ని గూర్చి మాట్లాడుతున్నట్టు అనిపించింది. ఆమాట స్పష్టంగా చెప్పేశాడు కూడా: మానవులు పట్టిదౌర్భాగ్యులు, అజ్ఞానులు, గర్వపోతులు, శుష్కదండగగాళ్లు, రోగిష్ఠులు, బలహీనులు, ఎందుకూ పనికిరాని చెత్తరకంగాళ్లు. అయినప్పటికీ వాళ్లని చూస్తుంటే తనకేదో తమాషాగానే ఉంటుందని మెచ్చుకున్నాడు. మానవులను ఇన్ని బండబూతులు తిట్టినా, ఆ తిట్టడంలో ఎక్కడా అతనిద్వేషం వ్యక్తం కాలేదు. మామూలుగా అన్నట్టే అన్నాడు. పెంటపోగును చూసి మనం దూరంగా తొలగిపోయినప్పుడు దానిమీద మనకి వ్యక్తిగతంగా కోపం వుంటుందా? ఉండదు. అట్లాగే మానవులంటే అతనికీ కోపం లేదు. మనని తిట్టాలని తిట్టకపోయినప్పటికీ అదేమంత పెద్దమనిషితరహాగా లేదని మనసులో అనుకున్నాను.

"పెద్దమనిషితరహా కాదా? నే నన్నది అక్షరాలా నిజం. నిజం చెప్పటంకంటే పెద్దమనిషితరహా

అనువాదం: శ్రీ నండూరి రామమోహనరావు

ఏముంది?... ఆ, ఇదుగో, కోట తయారైంది. బావుందా?" అన్నాడు సైతాను.

నిజానికి బొమ్మకోట చాలా బావుంది. కందకం, ప్రహరీగోడ, బురుజులు, రెపరెపలాడే చిన్న జెండాలు—పరిమాణంలో చిన్నదైనా నిజమైన కోట అంత సర్వాంగ సుందరంగా ఉంది. సైతాను బురుజుల మీదికి ఫిరంగుల నెక్కించమనీ, సైనికులను బారుగా నుంచోపెట్టమనీ, అశ్వికదళాన్ని సమాయత్త పరచమనీ మాకు ఆదేశించాడు. మేము తయారుచేసిన మనుషులను, గుర్రాల్ని చూస్తే మాకే నవ్వొచ్చింది. సైతాను వాటిని ముట్టుకుని ప్రాణం తెప్పించాడు. మాకు బొమ్మలు చెయ్యటం తిన్నగా చేతకాలేదు. మనుషులకి, గుర్రాలికి కాళ్లు వంకరటింకరగా ఉన్నాయి; ఒకకాలు పొట్టి, ఒకకాలు పొడుగుగా తయారయ్యాయి. మనుషులు వంకరటింకరగా నడుస్తుంటే తాగినవాళ్లు తూలుతూ నడుస్తున్నట్టుంది. పైగా నడవటం కుదరక అడుగడుక్కీ కూలబడి కాళ్లు చేతులు విరగ్గొట్టుకున్నారు. చివరికి ఒకరి నొకరు తోసుకుని అంతా కూలబడి లేవలేక తన్నుకోసాగారు. తోటి మానవులు అలా, బాధపడుతుంటే మాకు సిగ్గువేసినా, మరొకవంక ఆపుకోలేని నవ్వు కూడా వచ్చింది. ఇక మేము చేసిన ఫిరంగులున్నాయి—వాటిని ఫిరంగు లనటానికే వీలులేదు. వాటిలో మందు కూరి పేల్చేసరికి అవి వంకరగా ఉన్నందున ఒక్కసారిగా అన్నీ ముక్కలు ముక్కలుగా బద్దలై పోయాయి. ఆ ప్రేలుడుకు చుట్టుప్రక్కల ఉన్న ఫిరంగిసైనికులు కొందరు మరణించారు; కొందరు గాయపడ్డారు.

తరవాత సైతాను కోటఉన్న ప్రదేశానికి గాలివాన తెప్పిస్తా నన్నాడు. కావలిస్తే భూకంపం కూడా తెప్పిస్తా నన్నాడు; ప్రమాదం రాకుండా మమ్మల్ని దూరంగా నుంచోమన్నాడు. మనుషుల్ని కూడా ఇవతలకు పిలుద్దామనుకున్నాము గాని సైతాను వద్దన్నాడు. కావలిస్తే మళ్లీ మనుషుల్ని తయారు చేసుకోవచ్చనీ, వీళ్లు నశించినంత మాత్రాన నష్టమేమీ లేదనీ అన్నాడు. ఇంతలో కోటశిఖరాల మీదుగా నల్లటి మబ్బులు వ్యాపించి ఆ ప్రదేశమంతా చీకటి చేశాయి. చిన్న చిన్న మెరుపులు మెరిశాయి; బుల్లి బుల్లి పిడుగులు పడ్డాయి; గాలి హోరున



వీచింది; భూమి కంపించింది; వాన ప్రారంభమైంది; జనమంతా రక్షణ కోసం కోటలోకి చొరబడ్డారు. మబ్బులు అంతకంతకు చిక్కనై, నల్లనై కోటను పూర్తిగా మూసివేశాయి. మెరుపులు తీగెలు తీగెలుగా కోటను ముట్టడించాయి. కోట భగ్గుమని అంటుకుంది. వెయ్యి నాల్కల పాము లాగ అగ్నిదేవుడు బుసలు కొట్టాడు; జ్వాలా తరంగాలమీద నాట్యం చేశాడు. కోటలో దాక్కున్న మనుషులు హృదయ భేదన ధ్వనులు చేస్తూ మళ్ళీ బయటికి పారిపోయి వచ్చారు. సైతాను మళ్ళీ వాళ్లని కోటలోకే తోసివేశాడు; వారి దురవస్థ చూసి మాకు కూడా ఏడుపొచ్చింది. వద్దని ఎంత బతిమాలుతున్నా సైతాను వారిని మంటల్లోకే తోశాడు. కోటలో ఉన్న మందుగుండు సామాను అంటుకుని ఢామ్మని ధ్వనించింది. ఆ ప్రేలుడుకు భూమి బద్దలైంది. కోట, అందులో వున్న వందలాది అమాయిక ప్రాణులు భూగహ్వరంలోకి పడి

★ విచిత్రవ్యక్తి ★

పోయి, క్షణంలో అంతా అదృశ్యమై పోయింది. ఒక్క మనిషి కూడా మిగల్లేదు. భూమి ఏమీ ఎగర నట్టు తిరిగి మూసుకుంది. ఆ దృశ్యం చూసి మా గుండెలు బద్దలై పోయాయి. ఏడవకుండా ఉరుకోలేక పోయాము.

"ఎందుకేడుస్తారు? ఇంకా ఇలాంటి వాళ్లని ఎంత మందిని కావలిస్తే అంతమందిని తయారు చేసుకోవచ్చు," అన్నాడు సైతాను నిర్దయగా నవ్వుతూ.

సైతాను హృదయకాఠిన్యాన్ని కరిగించాలను కోవడం కంటె నిరర్థక ప్రయాస ఇంకో టుండదు. అతనిలో మనుష్యత్వం బొత్తిగాలేదు; అతనికి మానవ హృదయం అర్థం కానేకాదు. తన ఎదుట జరిగిన పైశాచిక హత్యాకాండ చూసి పెళ్లి వేడుక చూస్తు న్నట్టు ఆనందించాడు. తన ఆనందాన్ని మేము కూడా పంచుకునేలాగ చేయాలని ప్రయత్నించాడు. మమ్మల్ని మరిపించటం అతనికేమీ కష్టమైన పని కాదు. జేబులోంచి ఏదో చిత్రమైన వాద్యం తీసి వాయించాడు. అది సంగీతమేనా? ఏమో చెప్పలేము. అంత విచిత్రమైన, వినూత్నమైన మధుర శబ్దాలు మేము ఎప్పుడూ ఎక్కడా వినలేదు. బహుశా అది స్వర్గలోకపు సంగీతమై ఉండి ఉండచ్చు. 'అవున'ని సైతాను సమాధాన మిచ్చాడు. క్షణం లో గత సంఘటన లన్నీ మరిచిపోయి, అప్రయత్నంగా లేచి నిలబడి నాట్యం చెయ్యసాగాము. ఆనాట్యం ఎలా చేత నైందో మాకే తెలియదు. ఆనాట్యం కూడా స్వర్గ లోకపు నాట్యమే నన్నాడు సైతాను. వాద్యం వాయిస్తున్నంత సేపు అతని కళ్లనుండి మాకళ్లు తిప్పుకోలేక పోయాము. మా చూపులు హృదయాల్ని చీల్చుకుని వచ్చినట్టు తోచింది. వాటిలో అతని పై భక్తి తప్ప మరొక భావమే లేదు.

సంగీతం ఆగింది. నెమ్మదిగా మా నాట్యం కూడా ఆగింది. కలలోంచి మేలుకున్నట్టు జాగరితుల మయ్యాము. సైతాను తనకు వేరేచోట పనివుంది, వెళ్లిపోవా లన్నాడు. అతడు వెళ్లిపోతే మేము భరించలే మన్నాము. అతని చేతులు పట్టుకుని దీనంగా బతిమాలు కున్నాము వెళ్లనద్దని. సైతాను మాప్రార్థన మన్నించాడు. మేము బతిమాలటం తనకు సంతోషం కలిగించిందన్నాడు. ఇంకా కొంచెం సేపు మాత్రమే మాతో ఉంటానన్నాడు. తన

ఆయన మానసిక తత్వ శాస్త్రం మహా ఘనంగా చదివిన మహాశయుడు. ఏతత్ శాస్త్ర సారాన్ని ప్రయోగంలో పెట్టాలన్న ఆలోచన రాగా తన పెంపుడు కుక్కను పట్టుకొచ్చి దానికి మాటలు నేర్పాలని తంటాలు పడ్డాడు. అందుకు ఆయన అనుసరించిన మార్గం యిది:

ప్రతిరోజూ దానికి అన్నం పెట్టే వేళకు అన్నం పళ్లెం తాను దానికి అందకుండా చేత్తో పుచ్చుకొని, తానే కుక్కలా మొరగటం మొదలు పెట్టాడు. ఇలా చేయగా చేయగా కొంత కాలానికి ఆకుక్క అన్నం కోసం అర వటం అలవాటు చేసు కొంటుందని ఆయన ఆశ పడ్డాడు.

అలా ఒక వారం రోజుల పాటు చేసి, ఆ తరువాత ఒక రోజు అన్నం పళ్లెం చేత్తో పట్టుకొని తను అరవకుండా ఆ కుక్కే అరుస్తుందా, లేదా అని చూస్తూ నిల్చొన్నాడు. అది ఎంతసేపటికీ అరవనే లేదు. చివరికి ప్రాణం విసిగి అన్నం పళ్లెం దాని మూతి దగ్గిరగా పెట్టాడు. అయినా పరే - అలవాటు ప్రకారం యాయనను మొరగమని అడుగుతున్నట్లుగా ఆ కుక్క ఆయన మొఖంకేసే చూస్తూ వుండిపోయింది. ఆయన మొరిగితేనే కాని అది, ఆ తరువాత మరెప్పుడూ అన్నాన్ని అలా వాసనైనా చూచేది కాదు.

అసలు పేరు సైతాను అయినా, ఆ పేరు మా ముగ్గురికీ తప్ప ఇంకెవరికీ తెలియకూడదనీ, ఇతరు లున్నప్పుడు తన్ను ఇంకో పేరుతో పిలవాలనీ చెప్పాడు. ఫిలిప్ ట్రామ్ అని పిలవమన్నాడు.

సైతాను లాంటి అద్భుత వ్యక్తికి ఫిలిప్ ట్రామ్ అనే మామూలు పేరు తగదనిపించింది. కాని సైతాను ఒక నిర్ణయం చేశాక దానికి తిరుగేముంది!

ఇవ్వాళ మేము ఎన్నో విచిత్రాలు చూశాము· ఊళ్లోకి వెళ్లాక మాతోటి పిల్లలతో ఇదంతా చెబితే ఎంత గొప్పగా ఉంటుందో అనుకున్నాము. కాని మా ఆలోచనలు గ్రహించాడు సైతాను.

"వద్దు వద్దు; ఈ వేళ జరిగిన విచిత్రాలు మన నలుగురిలోనే అణగి పోవాలి. ఒక్క పిసరు కూడా బైటికి పొక్కగూడదు. మీరు బాల్య చాపల్యం చేత ఒకవేళ ఎవరితోనన్నా చెప్పాలను కున్నా చెప్పలేరు. చెప్పాలను కునప్పుడల్లా వాగ్బంధం చేసి ఉంచుతాను, అని హెచ్చరించాడు.

ఇదంతా రహస్యంగా ఉంచాలనే సరికి మాకు ఆశాభంగం అయింది. కానీ చేసేదిలేక నిట్టూర్పు విడిచి ఊరుకున్నాము. మళ్ళీ కబుర్లలో పడ్డాము. సై·ను మా మనస్సులో మెదిలే ఆలోచనల కెప్పటి కప్పుడు సమాధానా లిచ్చాడు. ఇలాగ ఇతరుల ఆలోచనలను కనిపెట్టటం అన్ని చిత్రాల కంటే చిత్రంగా ఉందనుకున్నాను. కాని సైతాను సమాధాన మిచ్చాడు:

"మీకైతే చిత్రంగా ఉండచ్చుగాని నాకది చిత్రమేమీ కాదు. మీకు మల్లే నేను పరిమిత జీవిని కాను. మీ మానవ లక్షణాలకి నేను అతీతుణ్ణి. మానవుల దౌర్బల్యాన్ని నేను తరిచి తరిచి పరిశోధించాను. కాని ఆ దౌర్బల్యం నన్నంటదు. మీరు నన్ను ముట్టుకుంటే మనుష్య శరీరం ఉన్నట్టే ఉంటుంది; కాని నాకు శరీరంలేదు; నాబట్టలు నిజమైన బట్టలు కావు. నేను అశరీరిని...అదుగో ఫాదర్ పీటర్ వస్తున్నాడు."

మేము చుట్టూ చూశాము. ఎవరూ కనబడ లేదు. "మీకతను డిప్పుడప్పుడే కనిపించడు. మీ కంటికి అందని దూరంలో ఉన్నాడు," అని సైతాన్ అన్నాడు.

"ఫాదర్ పీటర్ని నువ్వెరు గుదువా?" అని అడిగాము.

"ఉఁహు."

"ఆయనిక్కడికి వస్తే ఆయనతో మాట్లాడవూ? ఆయన మాకు మల్లే ఏమీ చదువుకోని అజ్ఞానుడు కాదు. మాట్లాడవూ?"

"ఇప్పుడు కాదు. ఇంకోసారి ఎప్పుడన్నా మాట్లాడతాను. నాకు వేరే తొందరపని వుంది. ఆ, అదుగో. ఇప్పుడు చూడచ్చు మీరు. సద్దుచెయ్యకుండా కూచోండి. మాట్లాడ కండి."

ఫాదర్ పీటర్ దూరంగా చెట్లమధ్య నుండి మాకేసే వస్తున్నాడు. మేము ముగ్గురం దోవపక్కగా పెరిగిన పచ్చికలో కూర్చున్నాం. సైతాను దోవ మధ్యగా కూర్చున్నాడు. ఫాదర్ పీటర్ తలవంచుకుని, దీర్ఘంగా ఆలోచిస్తూ, వచ్చి వచ్చి, మాకు రెండు గజాల దూరంలో ఆగాడు. ఆగి, టోపీతీసి, జేబురుమాలతో మొహం తుడుచుకుంటూ మాతో మాట్లాడ బోతున్నట్టు చూశాడు. కాని మాట్లాడ లేదు. "ఇక్కడి కెల్లా వచ్చాను? ఇంతకు ముందే గదా నాగదిలో కూర్చుని చదువు కుంటున్నాను? నని క్కడి కెవరో లాక్కొచ్చినట్టు కనిపిస్తుంది. లేకపోతే నా అంతట నేనే ఇంతదూరము నడిచి వచ్చానేమో? అంతా గందరగోళంగా వుంది. ఈమధ్య మనస్సు మనస్సులో వుండటంలేదు," అని తనలో తను గొణుక్కున్నాడు. తరవాత ముందుకు నడిచాడు. సైతాను అక్కడ కూర్చున్నది కూడా చూసుకోకుండా సూటిగా అతనిగుండా నడిచాడు. మాకు చెప్పరాని ఆశ్చర్యం వేసింది. భయభ్రాంతులమై కెవ్వుమని కేక వెయ్యబోయాము కాని ఏదో మంత్రశక్తి వల్ల మానోళ్లు తెరిచినవి తెరిచినట్టే ఉండి పోయాయి. ఫాదర్ పీటర్ అలా చెట్లచాటుకు నడిచిపోయి ఇక కనిపించలేదు. సైతాను ఇలా అన్నాడు:

"చెప్పానా, లేదా? నేను అశరీరినని."

"అవును, నువ్వు అశరీరివే," అన్నాడు నికొలాస్; "కాని మేము అశరీరులం కాదే. నిన్ను ఫాదర్ పీటర్ చూడనట్టు తెలుస్తూనే వుంది. కాని మమ్మల్ని కూడా చూడకుండా ముందుకు వెళ్లి పోయాడు. మాకేసి చూస్తూ కూడా మేమిక్క-

★ విచిత్ర వ్యక్తి ★

డున్నట్టు గ్రహించలేదు. మేము కూడా నీలాగే అదృశ్యులమై ఉన్నామా?"

"అవును. మన మెవ్వరం అతనికి కనిపించ లేదు. కనిపించ గూడదని నేను అనుకున్నాను; అల్లాగే జరిగింది."

అతడు చెప్పింది ఒక పట్టాన నమ్మ శక్యం కాలేదు. ఎప్పుడో జరిగాయని కథలుగా చెప్పకునే అద్భుత విచిత్రాలన్నీ మా విషయంలోనే జరుగు తున్నాయంటే, ఇదంతా కలా, నిజమా అనిపించింది. కల అని ఎలా అనుకోగలం? నిజమైన మనిషి లాగానే మా ఎదురుగా కూర్చుని, నవ్వుతూ, నవ్విస్తూ, కులాసాగా కబుర్లు చెబుతున్నాడు సైతాను. అప్పటి మా మనస్థితి వర్ణించటం నాతరంకాదు. తన్మయత్వం అంటే పరిపోతుందేమో ! కాని తన్మయ స్థితిని మాటల్లో వర్ణించటమెల్లా? తన్మయత్వం అనేది సంగీతం లాంటిది. సంగీతం ఈమాదిరిగా ఉంటుందని మరొక మనిషికి వర్ణించటమెల్లా?

సైతాను తిరిగి ప్రాచీన యుగాల కథలు చెప్ప సాగాడు. అబ్బ! అతనికి తెలియనిది, అతడు చూడనిది లేదు ! అతడు చెప్పేవి వింటూ, అతనికేసి చూస్తూ, అంత విస్తారమైన విజ్ఞానం, అంత అనంతమైన అనుభవం సంపాయించిన వాడి మనస్సు ఎలా ఉంటుందా అని ఆలోచించ సాగాము. అతనితో మమ్మల్ని పోల్చుకుంటే, పోలికకైనా సరిపోని తుణ కీటకాలమని పించింది. సైతాను మాట్లాడటంలో కూడా అతని దృష్టికి మానవులు పెంట కుప్పలవంటి వారేనన్న ధోరణి తప్ప మరొకటి వ్యక్తం కావటం లేదు. అయితే మానవులను అవమానించాలనే ఉద్దేశ్యం అతనిలో ఎక్కడా కనిపించలేదు. పెంటకుప్పను తీసి అవతల పారవేసి నప్పుడు దాన్ని అవమానిస్తున్నామనే భావం మనకుంటుందా? ఉండదు. అలా పారవేయుటం వల్ల పెంటకుప్ప ఎంత బాధ పడుతోందో, ఎంత వ్యాకుల పడుతోందో అనే ఆలోచనే మనకిరాదు. అసలది బాధ పడగలదో లేదో అనే ఆలోచన కూడా రాదు.

నేనిక సహించలేక ధైర్యంచేసి సైతాన్ని అడిగాను, "మనుషులంటే నీకింత నిరసన భావం ఎందుకూ? నీకూ మాకూ తేడా ఏమిటి?" అని. నా ప్రశ్న విని నివ్వెర పోయాడు; ఏమడుగు తున్నానో కూడా అతనికి కొంతసేపటి వరకూ అర్థం కాలేదు.

చివరికి ఇలా గన్నాడు:

"నాకూ మనిషికీ తేడా ఏమిటా? మర్త్యుడికీ అమర్త్యుడికీ తేడా ఏమిటా? మేఘానికీ, ఆత్మ పదార్థానికీ తేడా అడుగుతున్నావా?" అని పక్కనే పాకుతున్న పురుగునొక దాన్ని పట్టుకుని "దీనికీ సీజరుకీ తేడా ఏమిటి?" అని అడిగాడు.

"ఈ పురుగునూ సీజరునూ పోల్చటం న్యాయం కాదు. సీజరు తత్వానికీ, ఈపురుగు తత్వానికీ, సీజరు జీవించిన కాలానికీ, ఈ పురుగు జీవించే కాలానికీ ఎంతో అంతరం ఉన్నది," అన్నాను నేను.

"అవును. నీ ప్రశ్నకు నువ్వే సమాధానం చెప్పుకున్నావు. దాన్ని నేను విడమర్చి చెబుతానాగు. మానవుని సృష్టిని నేను కళ్లారా చూశాను. మానవుడు మట్టితో సృష్టించబడ్డాడు. నేను మట్టితో సృష్టి కాలేదు. మానవుడు చిత్ర విచిత్ర రోగాల మ్యూజియం లాంటి వాడు; అశుచికి నిలయమైన వాడు. మానవుడు ఇవ్వాళ వస్తాడు; రేపు పోతాడు. బురదగా ప్రారంభమై దుర్గంధంగా నిష్క్రమిస్తాడు. నేను అమరుల కోవకు చెందినవాణ్ణి. నాకూ మానవుడికీ ఇంకొక పెద్ద భేదం ఏమిటో తెలుసా? మానవుడికి ధర్మాధర్మ విచక్షణ జ్ఞానం ఉన్నది. నాకు లేదు. తెలిసిందా?"

సైతాను మాట్లాడకుండా ఆలోచనలో పడ్డాడు. ధర్మాధర్మ విచక్షణ జ్ఞానమంటే నాకు బాగా తెలియదు; చూచాయగా మాత్రమే ఆమాట అర్థం తెలుసు. కాని అదేదో గొప్పదనీ, ఆ విచక్షణ శక్తి మానవులకి ఉండటం గర్వించ దగిన దని మాత్రం నాకు నిశ్చయంగా తెలుసు అటువంటి దాన్ని పట్టుకుని సైతాను నిర్లక్ష్యం చెయ్యడం నాకు చాలా కష్టం కలిగించింది. క్షణం సేపు అందరం మౌనంగా కూర్చున్నాము. తరవాత సైతాను మళ్ళీ కబుర్లు ప్రారంభించాడు. మానిరుత్సాహం పోగొట్ట డానికై హాస్య కథలు చెప్పి ఉషారు చేశాడు. చివరికి లేచి నిలబడ్డాడు.

"ఇక నేను వెళ్లిపోవాలి. పనుంది."

"వద్దు వద్దు. అప్పుడే వెళ్లవద్దు. ఇంకా కాసేపు కూర్చో. ఇక మళ్ళీ రావు నువ్వు," అని ముగ్గురం ఒక్కసారిగా అన్నాం.

"ఊహు. వెళ్లాలి. మళ్లీ వస్తాను. తప్పకుండా వస్తాను."

"ఎప్పుడూ? ఇవ్వాళ రాత్రికా? చెప్పు ఎప్పుడొస్తావో?"

"త్వరలోనే. మీరే చూస్తారుగా."

"నువ్వంటే మాకెంతో ఇష్టం. నువ్వు రాకపోతే ఎంత బాధ పడతామో తెలుసా?"

"అవును. మీరంటే నాకు కూడా ఇష్టం ఏర్పడింది. అందుకే మీకోసం ఒక తమాషా చేసి చూపిస్తాను. సాధారణంగా నేను నిష్క్రమించేటప్పుడు హఠాత్తుగా అంతర్ధానమై పోతాను. ఇప్పుడు మెల్లి మెల్లిగా హరించి పోతాను."

అంటూండగానే సైతాను క్రమంగా హరించి పోసాగాడు. చివరికి సబ్బు బుడగ అంత పరిమాణానికి వచ్చాడు. కాని కాళ్లు, చేతులు, ముఖం ఈ ఆకారమంతా యథారూపంలోనే ఉంది. సబ్బు బుడగలోంచి అవతలి వస్తువులు కనిపించినట్టే అతనిలోంచి అవతలి పొదలు, పచ్చిక అన్నీ కనిపిస్తున్నాయి. సబ్బు బుడగ మీద సూర్యరశ్మి పడి ఇంద్ర ధనస్సు రంగులు వచ్చినట్లే అతడు కూడా చిత్ర చిత్ర వర్ణాలతో ప్రకాశించాడు. సబ్బు బుడగను ఊదినప్పుడు మెల్లిగా ఎగురుతూ పోయి నేలమీద పడి రెండు గంతులువేసి టప్‌మని బద్దలవుతుంది. అలాగే సైతాను కూడా సబ్బు బుడగంత తేలికై పోయి కొంత దూరం ఎగిరి పోయాడు. తరవాత పచ్చిక మీదికి దిగాడు. మళ్లీ ఎగిరి మరి కొంత దూరంలో వాలాడు. అలా చాలదూరం పోయిపోయి బద్దలై మాయమయ్యాడు. అతడు ఇందాక ఉన్నస్థలంలో శూన్యం మిగిలింది.

ఈ దృశ్యం పరమాద్భుతంగా ఉంది. ఏదో ఇంద్రజాలం చూస్తున్నట్టు ఊపిరి బిగపట్టి చూశాం. సైతాను మాయమైన కొంతసేపటికి దీర్ఘంగా నిట్టూర్పులు విడిచాం. చివరికి సెప్పీ లేచి నుంచుని,

"అసలి దేమీ జరగ లేదను కుంటాను," అన్నాడు.


"అవును. ఇదంతా మాయ," అన్నాడు నికొలాస్.

నాకూ అలాగే అనిపించింది. కాని మాట్లాడకుండా, స్తబ్ధుగా కూర్చుండిపోయాను. (ఇంకా వుంది)

జంతుకోటిలో మానవలక్షణాలు



ఉత్తర అమెరికాలో (ఒ) ఒపోసమ్, (రా) కూన్ అనే రెండు రకాల జంతువులు వున్నాయి. ఈ రెండు జంతువులూ అక్కడి ప్రజలకు చాలా మాలిమి అయిన కారణంచేత, వాటిని పాత్రలుగా వుపయోగించి వారెన్నో రకరకాల కట్టు కథలు చెప్పుకొంటూ వుంటారు. ఈ రెంటి రూపాల్లోనూ పోలికలు ఎక్కువగా వున్న కారణంచేత ఏది ఏదో పోల్చుకోవటం, అంతగా అలవాటు పడిన ఆ దేశస్థులకే కష్టమౌతుంటుంది. రూపాలు యించుమించు ఒక్కలాగే వున్నా యీ రెంటిలో ఒకటి శుద్ధ మొద్దు; రెండోది అతి తెలివి కలది.





(ఒ) ఒపోసమ్

ఒపోసమ్ అనేది శుద్ధ మొద్దు. అంత తెలివి తక్కువ జంతువు ఎప్పుడో అంతరించి పోవాలసిందే! అయినా ఆ జంతువులు యింకా భూమిమీద కనిపిస్తూనే వున్నా యంటే, దానికి ముఖ్యమైన కారణం ఆడ 'ఒపోసమ్' జంతువులు ఏటేటా 30, 35 దాకా పిల్లలను కనగలిగి వుండటమే! ఇది పెద్దదైన ప్పుడు బాగా అడివి పిల్లి అంత ప్రమాణంలో వున్నా, పుట్టంగానే మాత్రం మన చిటికినవేలు అంత అయినా వుండదు. కళ్లు కూడా వుండవు. అల్లాటి పసిగుడ్లని తల్లి జంతువు తన పొట్టకు వుండే సంచిలో పడేసుకు తిరుగు తుంటుంది. తల్లి స్తనాలు కూడా ఆసంచిలోపలనే వుంటాయి. ప్రతి పిల్లా ఒక్కొక్క స్తనాన్ని నోట కరుచుకొని 5, 6 వారాల దాకా విడవకుండా పాలు తాగుతూనే వుంటుంది. అప్పటికి యివి కాస్త పెద్దవై సంచుల్లో నుంచి బయటకు వస్తాయి. తల్లిప్రాణి తిండి వేటకు బయిలుదేరే టప్పుడు పిల్లల నన్ని టిని బొమ్మలో కనపరచిన విధంగా తోకమీద ఎక్కించుకు తిరుగుతుంది.

ఏకాస్త ప్రమాదం వచ్చినా పోసమ్ మూర్ఛపోతుంది. అలాటి స్థితిలో దానిని చూసిన వారెవరైనా యిదేదో యిక్కడ చచ్చి పడి వుందని అనుకోవాల్సిందే! అంత బాగా చావు నటించ గలగటమే దాని ప్రాణానికి పెద్దరక్ష.



(ర) కూన్

రెండో జంతువు (ర) కూన్ ఇది చూడటానికి కొంత మటుకు అసహ్యంగానే వుంటుంది. దీనికి వున్న తెలివి తేటల మూలంగా దీంతో వేగటం మానసిక శాస్త్రవేత్తలకే కష్టమని పిస్తుంటుంది. దీని తెలివి తేటలను పరీక్షిద్దామని పట్టి తీసుకొస్తే, ఆ తెచ్చిన శాస్త్రకారుడి జేబులో ఏముందో ముందుగా యిది తడిమి చూడందే వూరుకోదు. మిగిలిన జంతువులు తెరవలేని చిక్కు పెట్టెలన్నీ యిది అతి అవలీలగా తెరిచి పెట్టగలదు. వీటికి కొంటెపనులు చేయుటమంటే మహా యిష్టం. ఒకసారి న్యూయార్క్ పార్కులో చిన్న చిన్న పిల్లలు నిద్ర పోతున్నారట. ఆపార్కులో ఒకవైపున బోనుల్లో పెట్టివుంచిన యీ కూన్ ఎల్లా తప్పించుకు వచ్చిందో, ఏమో, చప్పుడు చేయకుండా వచ్చి పట్టుకుచ్చులాటి తన తోకను ఆపసిపిల్ల ముఖంమీద రుద్ది నిద్దర లేపింది. ఆపిల్ల హడిలిపోయి లేచి కూర్చొని వుండగా, రెండో కూన్, ఆపిల్ల పడుకున్న చాప కిందినించీ చాక్

(43 వ-పేజీ చూడండి)



హారతి

శ్రీ కొప్పర్తి సూర్య భాస్కరరావుగారు వేసిన ఒంటిగీత బొమ్మ.

ముద్దు-ముచ్చట

పిల్లల నాటిక

శ్రీ మద్దంశెట్టి
హనుమంతరావు

[తెరయెత్తగానే లీల, బాబు పుస్తకాలు చదువుతుంటారు. వారి మధ్య కొన్ని పుస్తకాలు చిందర వందరగ పడి వుంటయ్]

బాబు: (పుస్తకం చదువుతున్న వాడల్లా, తల పైకెత్తి) అక్కా!

లీల: ......

బాబు: నిన్నే నే ... అక్కా! (చేతితో తట్టుతాడు)

లీల: (విసుగ్గా) ఏమిటిరా?

బాబు: ఆడుకుందాం పదవే- ఎప్పుడూ యెంతని చదువుతాం?

లీల: అమ్మో! యిప్పుడా? నాన్నగారింట్లో వున్నారన్న మాట మర్చి పోయావా? వళ్లు హూనం చేసేస్తారు తెలుసా?

బాబు: నువ్వు ఎందుకే భయపడతావు? నువ్వంటే నాన్నగారి కెంత ముద్దు! అమ్మ ఎప్పుడైనా మాట వరసకు నీమీద కోప గించుకున్నా నాన్న అమ్మనే చివాట్లు పెడతారు కదా!

లీల: మరి నువ్వంటే అమ్మకు ముద్దు కదూ! నేనయినా, నాన్నయినా నిన్ను పల్లెత్తు మాట అంటే, అమ్మ 'గంయి' 'గంయి' మంటూ మామీది కొస్తుందే!

బాబు: ఎలాగైనా నాన్నగారికి నీమీదే యెక్కువ అభిమానం లేవే! మొన్న నువ్వు చెప్పడమే తడవుగా ఎంచక్కా చిన్న గొడుగు, మంచి పుస్తకాల సంచి, క్రొత్త సిల్కు గౌను తెచ్చారా లేదా? నే నెన్ని సార్లు మొత్తుకుని చెప్పినా గొడుగు తెచ్చి పెట్టారా మరి?

లీల: పెద్ద గొడుగుందిగా?

బాబు: ఆఁ - వుంది! ఆగొడుగంత పొడుగైనా వుండను కదా— దాన్నియెలా పట్టుకుంటానో నువ్వే చెప్పు!

లీల: అలాగైతే మొన్న అమ్మ మాత్రం నీకు బట్టలు తెప్పించ లేదూ? అన్నీ బోలెడంత డబ్బు పోసి కొన్నది! అదికాకుండా నువ్వు అడిగావో, లేదో-'ఆవారా' బుష్ షర్టు కూడా తెప్పించి పెట్టిందిగా నీకు?

బాబు: ఆ బుష్‌షర్ట్‌ను గురించి నాన్న యెంత వాదించారనుకున్నావ్? అసలు కొనను పొమ్మన్నారు: అమ్మ బలవంతం మీద కొన్నారు.

లీల: నాన్న నాకు గొడుగు కొంటూంటే అమ్మ మాత్రం హంస పాదు పెట్టలేదూ? నాన్నగారే పట్టుపట్టి కొని పెట్టారు.

బాబు: పోసి! ఈపుస్తకాల సంచి విషయం చూడు. నీకు కొన్నప్పుడే నాకోటి కొనేస్తే యేం పోయింది చెప్పు? నాన్న దంతా పొంత గుణమే! సంచి కోసం నే నెన్నిసార్లు మారాం చేసినా చెవిని వేసుకొన్నారా?


లీల: నీ కెందుకు లేరా— స్కూలికి పోవాలా యేమన్నానా? యింట్లో చదువేగా! అందుకే కొనలేదు.

బాబు: ఊఁ! నువ్వెలాగూ నాన్ననే వెనకేసుకొస్తావ్. ఏం? నన్ను కూడా స్కూలికి పంపిస్తే, నేను మాత్రం వెళ్లనా?

లీల: ఈ ఖరగ్‌పూరు చదువులు మనకు పనికిరావురా బాబూ! విజయ నగరంలో నిన్ను చదివించటానికేగా ప్రయివేటు చెప్పిస్తున్నారు!

బాబు: నువ్వెన్ని చెప్పు— నాన్నకు నేనంటే పరమ అసహ్యం.

లీల: నేనూ అనుకుంటుంటారా —అమ్మకు నేనంటే యెందుకో అంత కోపం మరి!



బాబు: నిజానికి నాన్నకు నువ్వంటే యెక్కువ అభిమానం.

లీల: అమ్మకు నువ్వంటే ఎక్కడలేని ప్రీతి!

బాబు: నామీద యెవరికీ అభిమానంలేదు. అందరూ నన్ను చీవాట్లు పెట్టే వారేనే!

లీల: నామీదకూడా అంతేరా; తమ్ముడూ (వాదన విని తండ్రి వస్తాడు)

తండ్రి: ఎందుకురా తగువులాడుకొంటున్నారు? చదువుకి కూర్చున్నారంటే, తగవులాట్టమో ముచ్చటలు చెప్పుకోవటమో తప్ప, చదువుకోవటం లేదు కదా! ఇంతకీ దేన్ని గురించిరా మీ తగువు?

లీల: (భయంగా) లేదు నాన్న-వీడు, మీకు నేనంటేనే 'ముద్దని' అంటున్నాడు, నాన్నా!

బాబు: (వణుకుతూ) అదికాదు నాన్నా - అమ్మకు నేనంటేనే 'ముచ్చట' అని అక్కే అంటోంది నాన్నా!

లీల: ముందన్నా నాన్నా!

బాబు: లేదునాన్నా - అక్కే ముందంది.

లీల: (తమ్ముడి వేపు తిరిగి! నువ్వే ముందన్నావ్!

బాబు: నువ్వే ముందన్నావ్(

తం: చప్! ఊరుకోం డింక...

(వంటగదిలో నుంచి తల్లి వస్తుంది)

తల్లి: ఏవిటండీ! మీరు దగ్గరే వుండి కూడా అది గోలచేస్తుంటే వూరుకున్నారా?

తండ్రి: (నవ్వుతూ) వీళ్లకి పెద్ద సందేహం వచ్చి పడింది.

తల్లి: ఏఁ విటండీ అది?

తండ్రి: లీల అంటుందట—నీకు బాబంటే ముద్దట. వాడంటాడట—నాకు లీలంటే ముద్దుఅట (నవ్వుతాడు)

తల్లి: చదువు లేకపోయినా అనవసర ప్రసంగాలు యెక్కువై పోతున్నయ్ వీళ్లకి. పోనీ—పెద్దది దీనికైనా బుద్ధి వుండొద్దూ? ఈ యీడువచ్చిన పిల్ల యిలాగానే మాట్లాడవలసింది? (కోపంగా అంద)

తండ్రి: కాకపోయినా వేలెడంత లేడే వెధవ! వీడికి యివేం మాటలంట! (తెరవాలుతుంది.)

రెండవ రంగం

(లీల, బాబు యేడుస్తుంటారు-ముఖాలు వెనక్కు త్రిప్పుకుని)

లీల: నువ్వెందుకురా యేడుస్తున్నావు? (మధ్య మధ్య యేడుస్తూ)

బాబు: ఎందు కేడుస్తున్నావో నువ్వే చెప్ప కూడదూ?

లీల: ఉదయం నువ్వన్నావ్ కదూ-నాన్నకు నామీదే యెక్కువ

(5-వ పేజీ చూడండి)



మాయల మల్లీ తెల్లని పిల్లి

ఒకపట్నంలో తెల్లని పిల్లి ఒకటి వుంటుండేది. ఆమె పేరు చీలమ్మ. పగలంతా ఆయింట్లోనూ యీ యింట్లోనూ దూరి కడుపు నింపుకొంటుండేది. సాయంత్రం తనింటికొచ్చి నిద్ర పోతుండేది. ఇలా వుంటూండగా దేశంలో కంట్రోళ్లు వచ్చిపడ్డాయి. తిండికి ప్రజలు నానా యిబ్బందులు పడి పోతున్నారు. డబ్బు పెట్టి కొనుక్కున్నా అన్నం, పాలకు మళ్లే కొల్చి యిస్తుండేవారు. మనుష్యులకే తిండి కొఱత అయేసరికి, మన చీలమ్మకు ఒక అన్నం మెతుకయినా దొరకటం లేదు. ఇంతవఱకూ సుఖంగా బ్రతికిన జీవమేమో — ఒక్కసారి కష్టం కలిగేసరికి గాభరా పడిపోయింది. "ముందు గతేమిటి?" అన్న ఆలోచనలో పడిపోయింది. రెండు మూడురోజు లాలోచించింది. చివరికి చక్కని ఒక వుపాయం తట్టింది. వెంటనే యింట్లోకి పోయి పెట్టె తెరిచి చీర కట్టుకొని నాలుగు గుడ్డలు మూటకట్టి కఱ్ఱకు తగిలించి భుజాన వేసుకొని అడవి త్రోవ పట్టింది. జంతువులకు రాజయిన సింహాన్ని మాయచేసి, కఱువు కాలం గడిపి వేద్దామని ప్లాను వేసింది.

ఎంతో ఆనందంతో చీలమ్మ అడవిన పడి నడుచుకుంటూ పోతున్నది. కొంచెం దూరంలో ఒక పంది కనిపించింది. దాని దగ్గఱకు వెళ్లి దర్జాగా చీలమ్మ —

"అడివిలో తిరిగేటి ఓ వూరపందీ!
అతి శ్రద్ధతో విను, అడిగేటి మాటా —
నీరాజు సింహమూ ఎచట నున్నాడూ?
నీవిపుడు చూపుమూ వాడున్న స్థలమూ"

అని అడిగింది. దానికా పంది ఆశ్చర్యంతో:

"నారాజు పేరెత్త నీ వెవరవమ్మా"
నారాజుతో నీకు పనియేమిటమ్మా' ?

అని ఎదురు ప్రశ్న వేసింది. అది విని చీలమ్మ రీవిగా —

శ్రీ కె. జానకిరామ్
పట్నాయక్

"వినరోరి పందిగా; నీరాజు నాకూ '
మనుమడౌ తాడురా మందమతి వాడా!"

అని జవాబిచ్చింది. పంది అది విని:

"ఎలక మాంసము తిన్న పిల్లి పిన్నమ్మా —
ఎటునుంచి వచ్చితివో అటు వెళ్లవమ్మా"

అని పారిపోయింది. చీలమ్మ కోపంతో:

"పందిగా నీపనీ పడతానూ నేనూ,
తొందరెందుకు నాతమాష చూడూ!"

అని ముందుకు నడిచింది. కాని అలా ఎంత దూరం వెళ్లటమో, ఏత్రోవను పోవటమో తెలియక తికమక పడుతుంటే, ఒక నక్క పోతు కనిపించింది. తక్కుతూ తారుతూ దాని చెంతకు వెళ్లి:

"చిక్కు పిక్కులా నక్కయ్యా!
ఒక్కమాటను వినవయ్యా!
ఎక్కడ మృగరాజుంటాడో
చక్కగ చెప్పుము నక్కయ్యా!"

అని భోగట్టా చేసింది. దానికి నక్కపోతు:

"మృగ రాజెందుకు పిల్లెమ్మా
ముందుగ చెప్పవె పిల్లెమ్మా?"

అని అడిగింది. అందుకు చీలమ్మ చిరాకు తెచ్చుకొని

"మృగరాజు సింగంబు నక్కయ్యా
మనుమడౌ తాడు నక్కయ్యా"

అని జవాబిచ్చింది. అది విని నక్క పండ్లి గిలించి:

"ఎలుకలు తినుటకు లేవే, లేవే,
ఏలను మాయలు పోవే, పోవే,"

అని పరుగు పెట్టింది. చీలమ్మ అతి కోపంతో.

"నీపని పట్టెదనక్కయ్యా
నిముషము తాళుర నక్కయ్యా!"

అని అక్కడ నుంచి బయలు దేరి ముందుకు పోయింది. అక్కడ ఒక చెవుల పిల్లి కనిపించింది. దాని దగ్గరకు వెళ్లి:

"పెద్ద చెవులా ముద్దయ్యా
సద్దు చేయకా వినవయ్యా
ఎద్దరి సింహము వుంటాడో
బుద్ధిగ చెప్పుము పెద్దయ్యా"

అని అడిగింది. చెవుల పిల్లి అందులకు —

"మాయల మల్లీ; తెల్లని పిల్లీ!
మామృగ రాజెందుకు తల్లీ"

అని ప్రశ్న వేసింది. దానికిచీలమ్మ

"మనుమ డౌతాడురా, నీరాజా!
మాటలాడక చూపు మారోజా!"

అని అన్నది. అదివిని చెవుల పిల్లి

"ఎలుకలు తింటావో లమ్మా
ఎరగ మశే నీపనులన్నీ
ఎందుకు డాబులు చెప్పమ్మా
పొందుగయిపుడే పోవమ్మా!"

అని గంతులు వేసుకుంటూ పారి పోయింది.

"నీపని పట్టెద చెవులయ్యా!
నిక్కము నమ్మర చెవులయ్యా!"

అని నడక సాగించింది. అర ఫర్లాంగు దూరం వుళ్ళేసరికి అక్కడ ఒక కోతి కనిపించింది. దాని దగ్గఱకు వెళ్లి చీలమ్మ శాంతంగా—

"కోతీ కోతీ కోపం చేయక
ప్రీతిగ చెప్పుము ఒక మాట!
అడవికి రాజగు సింహము యెచ్చట?
వడిగా చూపుము అత్తోవా!"

అని అడిగింది. దానికి కోతి, బొమ లెగుర వేసి—

"ఎందుకే సింహమూ, ఓపిల్లీ!
ఏమి పని ఉన్నదీ ఓపిల్లీ?"

అని ప్రశ్నించింది. అందులకు చీలమ్మ—

"మృగరాజు సింహము మనుమడే నాకు
జగమెల్ల యెరుగును! తెలియదా నీకు?"

అని జవాబిచ్చింది. అప్పుడుకోతి

"చిన్నయెలుకలు తిన్న చీలమ్మ నువ్వు
చెన్నుగా సింహముకు అవ్వవౌతావా?"

అని కిచకిచ లాడుతూ చెట్టు మీదకు యెక్కిపోయింది. అప్పుడు చీలమ్మకు చాలా కోపం వచ్చిందేమో—

"కోతిగా నీ పనీ పడతాను జూడూ
కొంచె మోపికపట్టి తమాష చూడూ!"

అని ముందుకు బయలు దేరింది. చాలా దూరం నడిచింది. మరే జంతువూ కనిపించ లేదు. చాలా అలిసి పోవటం వల్ల ఒక చెట్టునీడను కూచొని విశ్రాంతితీసుకుంటున్నది. కాస్సేపయాక చూసింది. ఒక కొమ్మ మీద చిలక పిల్ల కనిపించింది. చీలమ్మ మెల్లగా చెట్టు యెక్కి తక్కుతూ తారుతూ, వెనక మారున వెళ్లి గబుక్కున ఆ చిలక పిల్లను పట్టుకొంది! పాపం చిలక పిల్ల గడగడ లాడిపోయింది. చీలమ్మ దాన్ని పట్టుకొని దిగువకు వచ్చి

"చెప్పవే చిలక పిల్ల, సింహ మెచటుందో?
చెప్పకపోతివా చంపి వేస్తాను!"

అని కండ్లెఱ్ఱ జేసి భయపెట్టింది. చిలక పిల్ల అలానే గజగజ కంపిస్తూ తొట్రుపడ్డ కంఠంతో మెల్ల మెల్లగా

"నన్నొదిలి పెట్టి నా వెనక నే వస్తే
సన్న సన్నగ మీకు త్రోవ చూపిస్తా!"

అని అన్నది. చీలమ్మ చిలక పిల్లను ఒదిలి పెట్టింది. అది మెల్ల మెల్లగా ఎగురుకొంటూ పోతూంటే దాన్ననుసరిస్తూ చీలమ్మ నడక నారంభించింది. కాస్సేపటికి చిలక పిల్ల ఒక గుహ దగ్గఱ కొచ్చి దాని మీద వ్రాలి—

"ఇందులో నుంటారు, మృగరాజు గారు
పొందుగా పోయి యిక కలియండి మీరు"

అని తుఱ్ఱున యెగిరి పోయింది. చీలమ్మ గుహ తలుపు దగ్గఱకు వెళ్లి తట్టింది. గడియ తీసుకొని సింహం బయటికొచ్చి "ఎవరది?" అని గర్జించింది. చీలమ్మ, సింహం కాలు పట్టుకొని బిగ్గరగా ఏడువ నారంభించింది. పాపం, సింహం బేజారెత్తి పోయింది. ఏమీ అన కుండా చీలమ్మను చూస్తూ నిల్చుండి పోయింది. కాస్సేపటికి చీలమ్మ—

"నీ తాత పోయెరా, నాముద్దు మనుమడా!
నీచెంత కొస్తిరా నన్ను పోషించవా?"

అని అడిగింది. చీలమ్మ మాటలను నిజమని నమ్మి సింహం అతి ఆదరంతో గుహలోనికి తీసుకు పోయింది.

నాటి నుంచీ చీలమ్మ మహా

మాయలమల్లి - తెల్లనిపిల్లి

దర్జాగా మహా మజాగా సింహం తెచ్చియిస్తూన్న మాంసాన్ని రోజూ మెక్కుతూ కాలక్షేపం చేస్తున్నది. కాని తనను అవమానించిన ఆపంది మీద, నక్కమీదా, చెవుల పిల్లి మీదా, కోతిమీదా యేవిధంగా పగతీర్చు కోవటమా అని మథన పడింది. చివరకు ఒక నిశ్చయాని కొచ్చి ఒకరోజున ముసుగు తన్ని పరుంది. సింహం అది చూసి

"ఏమే అవ్వా! పడుకున్నావూ?
ఏముచ్చిందో త్వరగా చెప్పవె!"

అని అడిగింది. దానికి చీలమ్మ మూల్గుతూ—

"తల నొప్పిరా బాబు
తలనొప్పిరా
తట్టుకో లేను యిక
తలనొప్పి తోనూ!"

అని అన్నది. దానికి సింహం విచారాన్ని వెలి బుస్తూ—

"అవ్వా-ఉండే వెజ్జుని తెస్తా
అతి త్వరలో తలనొప్పి మాన్పిస్తా"

అన్నది. అందుకు చీలమ్మ నింపాదిగా—

"ఎందుకురా వెజ్జు?
పందితోక తెచ్చి
తలపై వుంచిన క్షణమే
తగ్గిపోవురా నొప్పి!"

అని అన్నది. వెంటనే సింహం బయలుదేరి అడవిలో తిరిగి తిరిగి చీలమ్మ చెప్పిన ఆనమాళ్లు గల ఆపందిని పట్టుకొచ్చి, చీలమ్మ యెదుట నిలిపి కత్తితో దానితోక కోసి వేయబోయే సరికి పంది ఏడుస్తూ—

"నమస్కారమో మృగరాజా
నా తోకను కోయకు మృగరాజా"

అని వేడుకున్నది. దానికి సింహం—

"మా యవ్వకు మందూ నీతోకా
మానను కోయుట నీతోకా!"

అని అన్నది. అప్పుడు పంది ధైర్యంతో—

"మీ యవ్వ కాదిదీ, మృగరాజా
మాయల పిల్లిది మృగరాజా!"

అన్నది. అందుపై చీలమ్మ అతి కోపంతో—

"అవ్వ కాననీ యెట్లు చెప్పెదవు
కొవ్వుతో బలిసిన పూరపందిగా?"

అని ప్రశ్నించింది. దానికి పంది నవ్వి—

"మృగరాజుకు అవ్వవు అయితే
ముందరి కోఱలు చిన్నవదేలా?"

అని అడిగింది. అప్పుడు చీలమ్మ—

"ముసలివానను అయిపోవుటచే
ముందరి కోఱలు అరిగిపోయెరా!"

అని చీలమ్మ సమాధానం చెప్పింది. అది నమ్మిన సింహం—

"ఇక నేమంటావ్ పందయ్యా?
ఇదిగో కోసెద నీతోకా!"

అని కత్తితో కఱుక్కున పంది తోక కోసి వేసింది. 'గుఱ - గుఱ' మని గుర్ఘురించు కుంటూ పంది పారిపోయింది. చీలమ్మ బుఱ్ఱ తటాయించి నవ్వింది.

వారం రోజులు పోయాక చీలమ్మ తిరిగా ముసుగు తన్నింది. సింహం అడిగేసరికి—

"కడుపు నొప్పిరా బాబూ
కదలలేనురా బాబూ
నక్క ముక్కూ తెస్తే
చక్కగ కుదురును నొప్పి"

అని చీలమ్మ జవాబిచ్చింది. సింహం నక్కను వెదికి తెచ్చి, చీలమ్మ ఎదట నుంచి ముక్కు కోయబోయే సరికి, నక్క—

"దండము దండము మారాజా
దయజూడుము మామహారాజా!
ముక్కును కోయగ పనియేమీ?
నిక్కము చెప్పుడు మహారాజా!"

అని వేడుకొన్నది. అందుకు సింహం—

"మా యవ్వకు మందూ నీ ముక్కూ
మానను కోయుట నీముక్కూ!"

అని అన్నది. నక్క అది విని దృఢ స్వరంతో—

"మీయవ్వ కాదిదీ మృగరాజా
మాయల పిల్లిది మృగరాజా!"

అని చెప్పింది. అందులకు చీలమ్మ నవ్వి—

"అవ్వను కానని నక్కయ్యా
ఎవ్విధి చెప్పెదు నక్కయ్యా?"

అని ప్రశ్నించిది. దానికి నక్క గట్టిగా—

"సింహానికి నీ వవ్వవు అయితే
చిన్న శరీరము నీకేలా?"

అని అడిగింది. చీలమ్మ ఆ మాటకు—

"ముసలివగ్గునై పోవుట చేతా
ముడుచుకు పోయె శరీరమ్మంతా"

అని బదులు చెప్పింది. అప్పుడు

"ఇక నేమంటావ్ నక్కయ్యా?
ఇదిగో కోసెద ముక్కయ్యా"

అని చఱుక్కున నక్క ముక్కు కోసి చీలమ్మ కిచ్చింది. చీలమ్మ దాన్ని నోట్లో వేసుకొని గర్వంగా నవ్వింది. నక్క కుయ్యో-మొఱ్ఱో మంటూ పారిపోయింది. మఱలా నాలుగు రోజుల నాడు చీలమ్మ ముసుగుతన్ని పడుకుంది. సింహం అడిగితే—

"గుండె మంటరా, బాబూ
ఉండలేనురా బాబూ
చెవులపిలీ చెవులుంటే
చేసుకుందురా మందూ!"

అన్నది. వెంటనే సింహం బయలుదేరి చెవుల పిల్లిని పట్టుకొచ్చి, చీలమ్మ ఎదట నిలిపి చెవులు కోయబోతుంటే—

"చిత్తము చిత్తము సింహంబా
చెవులేల కోతువు సింహంబా?"

అని వినయంగా అడిగింది. దానికి సింహం—

"మాయవ్వకు మందూ నీ చెవులూ
మానను కోయుట నీచెవులూ"
అని సింహం తయారు పడ్డది.
అప్పుడు——

"ఎక్కడ అవ్విది మారాజా?
ముక్కడి పిల్లిది మారాజా!"
అని చెవుల పిల్లి ఫిర్యాదు
చేసింది. చీలమ్మ కోపంతో

"పెద్ద చెవులా దద్దమ్మా!
పేలకు అధికము పద్దమ్మా!
అవ్వను కౌనని నీవు చెప్పితే
నవ్వను లోకం దద్దమ్మా?"

★ మాయలమల్లి - తెల్లనిపిల్లి ★

అని హేళన చేసింది. దానికి చెవుల పిల్లి సాహసంగా---

"పంజా లెందుకు చిన్నవి నీకూ
పలుకుము వేగమె పిల్లెమ్మా"

అని ప్రశ్నించింది. వెంటనే చీలమ్మ---

"పట్నములోనే కాళ్లకు జోడూ
బాగుగ వేయుచు నుందును రోజూ;
పంజా లందుకు చిన్నవైనవీ!
బాగుగ తెలియుము దద్దమ్మా"

అని సమర్థించుకొన్నది. అది విని సింహం ఒక్క వుదుటున

"ఇక నేమంటావ్ చెవులయ్యా
ఇదిగో కోసెద నీచెవులా"

అని 'కఱ - కఱ' మని చెవుల పిల్లి చెవులుకోసి చీలమ్మ కిచ్చివేసింది. వాటిని తీసుకొని చీలమ్మ అట్టహాసంతో నవ్వింది. చెవుల పిల్లి "అమ్మో - నాయనో" అని యేడ్చుకుంటూ పారిపోయింది.

పందికీ, నక్కకూ, చెవుల పిల్లికీ జరిగిన పరాభవాలను గురించి కోతికి ఎల్లాగో తెలిసింది. వెంటనే పైయెత్తు ఆలోచించి ఒక ఎలక పిల్లను పట్టుకొని దగ్గఱ వుంచుకుంది. వారం రోజులు పోయాక చీలమ్మ తిరుగా ముసుగు వేసుకొని పరుంది. యథాప్రకారం సింహం వచ్చి అడిగేసరికి చొంగలుకారుస్తూ చీలమ్మ---

"నాలుక నిండా పూత పూసెరా
నాకిది బాధర ముద్దు మనుమడా!
కోతి నాలుకా కోసి యిస్తివా
కొంచె ముండదుర యీబాధా!"

అని అన్నది. వెంటనే సింహం బయలుదేరి కోతిని పట్టుకు వచ్చి చీలమ్మ ఎదట నుంచగనే, కోతి దీనంగా---

"ఎలను తెస్తివి మారాజా?
ఏమి చేసితిని మారాజా!"



అని అడిగింది. దానికి సింహం గర్జించి---

"మా అవ్వకు నాలుక పూసెనురా
మందుచేయు నీ నాలుకతో"

అని జవాబిచ్చింది. అప్పుడు కోతి---

"ఎలుక మాంసము తినేటి పిల్లీ
ఏవిధి మాయవ్వ యెనురాజా?"

అని అడిగింది. దానికి చీలమ్మ

"అవ్వను కావని తిమ్మన్నా
ఎవ్విధి చెప్పెదు తిమ్మన్నా?"

అని ప్రశ్నించింది. కోతి దానికి జవాబు చెప్పకుండా, చేతిలో దాచి వుంచిన ఎలకపిల్లను విడిచి పెట్టింది. ఆ ఎలక పిల్ల పారిపోబోతుండగా చీలమ్మ చూపులు దానిమీద పడ్డవి! ఎన్నో రోజుల నుంచీ ఎలక మాంసానికి వాచిఉన్న చీలమ్మకి అప్పటి తన స్థితీ, జరుగుతున్న మాటలూ మర్చిపోయి ఒక్క వుదుటున ఆ ఎలక పిల్ల మీాది, గెంతింది!

అప్పుడు కోతి సింహంతో

"మాశారా, మహారాజా!
చూరెలకను ఎటు పట్టిందో?
సింహానికి యిది అవ్వే అయితే
చిన్న ఎలకనూ తింటుందా?"

అని అడిగింది. చీలమ్మకు అప్పుడు తెలివి వచ్చింది! తనగుట్టు బట్ట బయలయింది! దాన్ని మరి కప్పుకో లేక పోయింది! ఏమీ తోచక తెల్లబోయి చూస్తూండే

(58-వ పేజీ చూడండి)

★ జంతుకోటిలో మానవ లక్షణాలు ★

(35-వ పేజీ తరువాయి)

లెట్ ముక్క కొట్టేసి చప్పరించి పూరుకొన్నదట.

ఇవి బోనులోనుంచీ చాలా చమత్కారంగా తప్పించుకొంటాయి. బోనుల్లోనుంచి బయట పడినాక కూడా, ఎక్కడికైనా వెళ్లి పోవచ్చుగా! అలా వెళ్లకుండా కాస్సేపు అక్కడా అక్కడా తిరిగి మళ్ళీ ఆబోను దగ్గరకే వచ్చి నిలబడతాయి. అంటే వాటికి కావలసిందల్లా బోనులో నుంచి బయటపడ గలగటమే కానీ, అక్కడ నుంచీ పారిపోవటం కాదన్నమాట!

ఈ కొంటె గుణానికి తోడు వీటికి భలే అహంభావం కూడాను! అది వున్నబోను ముందు నుంచీ పోతున్న మనిషి ఎవ్వరైనా సరే, తన వైపు ఒకసారి చూసి పళ్లు యికిలించకుండా తల వంచుకుపోతే,—రోడ్డు మీద ఎదురైన స్కూలు పిల్లలు దణ్ణం పెట్టకపోతే హెడ్ మాస్టరుగారు ఎంత గింజుకొంటారో,—అంత గింజుకొంటుంది యీ కూన్ కూడా.

చిన్న పిల్లలకు మల్లే, యీ జంతువుకు కూడా కొత్త వస్తువు ఏదైనా ఒకటి కనిపించిందంటే దాన్ని ఒకసారి దగ్గరకు పోయి చూడకుండా వుండలేదు. నిజానికి ఆమాదిరి తత్వం ఎవరిలోవున్నా అది తెలివి తేటలు గలవారి లక్షణమే అని ఒప్పుకోవాలి. కానీ ఒక్కొక్కప్పుడు యీ లక్షణమే దీని ప్రాణానికి ముప్పు తెచ్చి పెట్టుతుంది. దీనికి గల యీబలహీనత ను కనిపెట్టే, వేటగాళ్లు యీ కూన్‌ను పట్టుకోవాలని పన్నే వలల మీద రంగుల కాయితాలు, వింత వింత గుల్లలు తగిలిస్తుంటారు. వాటిని చూసి భ్రమసిపోయి, యింత తెలివిగల జంతువూ వాటి దగ్గరకుపోయి ఆవలల్లో చిక్కుకుపోతూంటుంది.



బాడ్జర్


పందికొక్కు లాంటి జంతువు ఒకటి అమెరికాలో వుంటుంది. దీని పొడవు దాదాపు 2 అడుగులు వుంటుంది. దీన్ని వాళ్లు 'బాడ్జర్' అంటారు. అల్లాంటి బాడ్జర్ ఒకదాన్ని పట్టుకొని యీ కొంటె 'కూన్' తెగ ఏడిపించేసింది. ఒకానొక మానసిక శాస్త్రవేత్త తానేవో కొన్ని పరిశోధనలు జరుపుకోవటం కోసం ఒక 'బాడ్జర్'నీ, ఒక 'కూన్'ని తన పెరట్లో పెంచుతున్నాడట. ఆ బాడ్జర్ ఎప్పుడు కాస్త కళ్లుమూసి ఓ కునుకు తీద్దామనుకొన్నా, కేవలం దీన్ని ఏడిపించటానికని 'కూన్' దాని దగ్గరకు వెనగ్గాపోయి, ఒక్క పోటు పొడిచి చేతికి అందకుండా పారిపోవటం మొదలు పెట్టిందట. ఈ చెరలాటం శృతిమించి రాగాన పడింది ఆ బాడ్జర్‌కి నిద్రపోవటానికి వీల్లేకుండా పోయింది. ఒక రోజు మధ్యాహ్నం నిద్ర మత్తు ఎక్కువగా వుండి బాడ్జర్ పెద్దగా ఆవలించిందట. ఆవలించటం కోసం తెరిచి పెట్టిన నోటిని, దవడబొమికె ఏదో పట్టుకుపోయి మూయటానికి వీల్లేక పోయినట్లుగా అలాగే చాలా సేపు తెరిచి వుంచిందట. ఇదంతా అల్లంత దూరం నుంచీ చూస్తూ వున్న 'కూన్' బుర్రలో పురుగు తొలిచి, దీన్ని ఏడిపించాలన్న బుద్ధి పుట్టింది కాబోలు; గబగబా ఆ 'బాడ్జర్' దగ్గరకు వచ్చి, తెరచివున్న దాని నోట్లోకి తన తలను దూర్చిందట. అంతే! ఆ బాడ్జర్ రక్కున రెండు దవడలనూ నొక్కేసుకొంది. కొంటె తనానికి పోయిన 'కూన్' గారి ముక్కు కత్తిరించుకు పోయింది. చావు దప్పి ముక్కు గాడి పడిపోయి ఎలాగో తప్పించుకు బయట పడింది. అప్పటి నుంచీ ఆ 'కూన్' బాడ్జర్ జోలికి పోవటం మానేయటమే కాక, అనుకోకుండా ఆ బాడ్జర్ ఎప్పుడైనా ఎదురు పడ్డా కూడా, గబిక్కున తన ముందు కాళ్లు రెండూ పైకి ఎత్తి ముక్కును గట్టిగా కప్పి పెట్టుకొనేదట!

వీటి చిలిపి పనులను గురించి యిలాంటివే ఎన్నో కథలు వున్నాయి. ఒక కూన్ దారిని పోతూ పోతున్న కోడి పుంజు తోక పట్టుకొని, కొన్ని యీకలు వూడ లాగి, వాటిని కలికి తురాయిలా తన తల వెంట్రుకలలో గుచ్చుకొని గంతులు వేసిందట.

(ఇంకావుంది)



భాస్కర్ ప్రొడక్షన్సు వారి "బ్రతుకు తెరువు"లో శ్రీరంజని.



"మన్ మోర్ మచావేషోర్" అనే పాట లతా మంగేష్కర్ ఆర్కెస్ట్రాతో కలిసి సాధకం చేస్తోంది. సంగీత దర్శకుడు సుదర్శనం కండక్టు చేస్తున్నారు.

గంధర్వగాయని లతామంగేష్కర్‌తో

★ ఇంటర్వ్యూ ★

ఆది ఎ వి ఎమ్ స్టూడియోలోని రికార్డింగ్ గది దాదాపు ముప్ఫయి వాయిద్యాలు మోగుతున్నాయ్ సంగీత దర్శకుడు సుదర్శనం ఆర్కెస్ట్రాను కండక్టు చేస్తున్నారు ఎదురుగా కొంతదూరంలో కుర్చీల్లో వరసగా దర్శకుడు ఎమ్ వి రామన్, స్టూడియో ఉద్యోగులు, అతిథులు కూర్చున్నారు వారిలో ఒక అమ్మాయి కూడా కూర్చుని ఉన్నది మామూలు వాయిల్ చీర కట్టుకున్నది, పరమ నిరాడంబరంగా ఉన్నది ఆమెయే లతామంగేష్కర్ అని రామన్ పరిచయం చేశారు ఫొటోలో చూసిన వారుకూడా ఆమె లతా మంగేష్కర్ అని అనుమానించలేరు కోట్లకొలది సినిమా అభిమానులను, సంగీతప్రియులను మాధుర్య తరంగాల్లో ఓలలాడించిన గంధర్వగాయని ఆమే నంటే నమ్మటం కష్టమైంది

ఆర్కెస్ట్రావారు తమతమ వాయిద్యాలు అడ్జస్ట్ చేసుకున్న తరవాత లతామంగేష్కర్ లేచి వారికి ఒక పెడగా కూర్చుని రిహార్సిల్స్ చేసింది ఆమె ఆవేళ పాడిన పాట మరొక ప్రసిద్ధ గాయని గీతా రాయ్‌తో కలిసి పాడే డ్యూయెట్ పాట ఇద్దరూ మైక్రోఫోనుకు చెరొక పక్కన నుంచుని పాడారు "మన్‌మోర్ మచావే షోర్, ఘటాఘన్‌ఘోర్ ఛాయీ ఫిర్ కే—" అనే పాట ఈపాట "లడ్కీ" చిత్రంలో అంజలీదేవి, వైజయంతీమాల కలిసిన ఒక సన్నివేశంలోనిది వైజయంతీమాలకు లతా, అంజలీదేవికి గీతా ప్లేబాక్ పాడుతున్నారు

లతా మంగేష్కర్ ఇందూరు సంస్థానానికి చెందినది మహారాష్ట్ర బ్రాహ్మణ వంశం, కుటుంబంలో పారంపర్యంగా సంగీత సంప్రదాయం ఉన్నది. తండ్రి దీనానాన్ మంగేష్కర్ మహారాష్ట్ర ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన నటుడు, గాయకుడు బల్వంత్ సంగీత్ మండలి అనే నాటకాల కంపెనీ స్థాపించి అనేక నాటకాలు ప్రదర్శించేవాడు లతా తండ్రి




లతామంగేష్కర్, గీతారాయ్, రాజేంద్ర కిషన్.

లతామంగేష్కర్‌తో ఇంటర్వ్యూ

వద్దనే సంగీతం అభ్యసించింది ఆమె అధికంగా సినిమా పాటలు పాడి పేరు తెచ్చుకున్నా, మూడు నాలుగేళ్ళ వయస్సునుండీ విన్నదీ, నేర్చుకున్నదీ స్వచ్ఛమైన శాస్త్రీయ సంగీతమే బంగారానికి తావి అబ్బినట్లు శాస్త్రీయ సంగీతజ్ఞానానికి జన్మతః సంక్రమించిన మధుర కంఠం తోడైతే ఇక చెప్పవలసిం దేముంది? ఆమె ఆసక్తి చూసి తండ్రి ఆమె కెంతో ప్రోత్సాహం ఇచ్చారు అందువల్ల ఆమె లేత వయస్సులోనే గొప్ప ప్రావీణ్యం సంపాదించగలిగింది ఇంత కీర్తి సంపాదించినా అంత నిగర్విని మరొకరిని చూడలేము "నే నింకా సంగీతంలో అర్భకురాలిననే నా భావం బడేగులాం అలీ, రోషనారా బేగం నాకు గురుతుల్యులు వారిముందు నేనేపాటి అనే భావం నాకు నిత్యమూ కలుగుతూ వుంటుంది. నేనింకా

మధ్యలో డైరెక్టరు ఎమ్ వి రామన్, ఇటూ అటూ గీతారాయ్, లతా మంగేష్కర్.





రాజ్యం పిక్చర్సువారి "దాసి"లో జమీందారు బావమరది నారాయణగా రంగారావు, జమీందారు భార్య పార్వతిగా శాంతకుమారి.

నేర్చుకోవలసిన దెంతో వుంది. జయించవలసిన ఔన్నత్యాలెన్నో ఉన్నాయి. వాటికోసమే నాజీవితం అంకితంచేశాను," అన్నదామె

ఏ. వి. ఎమ్. వారి బాక్సాఫీసు డైరెక్టరు ఎస్. వి. రామన్ తమ "లడ్కీ" చిత్రంలో ప్లేబాక్ పాటలు పాడేందుకు లతాను బొంబాయినుండి పిలిపించారు. "లతాకు తను గొప్ప గాయకురాలిననీ, ధనవంతురాలిననీ గర్వం ఏ కోశానా లేదు. అందుకే ఆమె అంటే నాకింత ఇష్టం. ఆమె నెప్పుడూ 'బేబీ' అనే పిలుస్తాను," అని రామన్ అన్నారు.

లతాతో మాట్లాడుతున్నంతసేపూ పత్రికాప్రతినిధితో ఇంటర్వ్యూ అన్న ధోరణే లేకుండా అరమరిక లేకుండా స్వేచ్ఛగా గడిచిపోయింది. బెయిటర్ కాఫీ వగైరాలు ట్రేలో పట్టుకువచ్చి ఇచ్చాడు. వద్దంటున్నా వినకుండా లత తనే మాకు కాఫీ కలిపి ఇచ్చింది.

సంభాషణలోకి దిగాను. "ప్రస్తుతం బొంబాయిలో అనుసరించబడుతున్న సంగీతధోరణిపై మీ అభిప్రాయం ఏమిటి?" అని అడిగాను. ఆమె సమాధాన మిచ్చింది: "నేను శాస్త్రీయసంప్రదాయంలో పుట్టి పెరిగినదాన్ని. అందుచేత స్వతహాగా నాకు మన సంగీతం సంకరం కావటం ఇష్టంలేదు పాశ్చాత్యబాణీలను, భారతీయ బాణీలను కలగలుపు చెయ్యటం నాకు సుతరామూ ఇష్టం లేదు. ప్రజలకా సంగీతమే ఇష్టమని అంతా అంటున్నారు. అందుచేత నా కిష్టం లేకపోయినా మిగతా వారినే అనుసరిస్తున్నాను."

"మీకు మా దక్షిణాది సంగీతంతో పరిచయం ఉందా?" అని అడిగాను. "ఎక్కువ పరిచయం లేదు. ఎమ్. ఎస్. సుబ్బులక్ష్మి పాట, చౌడయ్య వయొలిన్ చాలసార్లు విన్నాను. వారి గానం నన్ను చాలా ఆకర్షించింది. మీ సినిమా సంగీత దర్శకులలో కే. వి. సుబ్బరామన్ సంగీతం నాకు బాగా ఇష్టం" అన్నది. ఇంతలో రామన్ అందుకుని "ఆమె హిందూస్థానీ సంగీతం ఒక్కటే పాడుతుందని మీ రనుకుంటున్నారల్లే వుంది ఆమెచేత మా చిత్రంలో కర్ణాటకబాణీ పాడిస్తున్నాను ఏది బేబీ! సుబ్బులక్ష్మి పాటపాడు," అన్నారు. ఆమె మొదట సందేహించింది చివరికి తల వంచుకుని సిగ్గుపడుతూ "గిరిధర గోపాలా, కంసవిదార," అనే సుబ్బులక్ష్మి పాట పాడింది. స్వచ్ఛమైన కర్ణాటక పోకడలతో అతిమనోహరంగా ఉంది ఆ పాట.

తను పాడిన అన్ని పాటల్లోకి "మహల్" చిత్రంలోని "ఆయేగా ఆనెవాలే" అనే పాట చాల ఇష్టమని ఆమె చెప్పింది. బొంబాయి తారల్లో అశోక్ కుమార్, గీతా బాలీ అగ్రగణ్యులని, మద్రాసు వారిలో భానుమతి బాగా నటిస్తుందని ఆమె అభిప్రాయం.

లతా ఇటీవల సి. రామచంద్ర, భగవాన్‌లతో కలిసి "మ్యాజిక్ మేకర్స్"

లతామంగేష్కర్‌తో ఇంటర్వ్యూ


ఆశ ప్రొడక్షన్ సంస్థ ప్రారంభించింది. వారిప్పుడు "సురేలీ" (మధుర గాయని) అనే హిందీ చిత్ర "వాదళ్" (తుఫాను) అనే మరాఠీ చిత్రం తీస్తున్నారు. "సురేలీ" చిత్రానికి సి. రామచంద్ర సంగీత దర్శకుడు; భగవాన్ దర్శకుడు, నటుడు; గీతాబాలి తార; లతామంగేష్కర్ ప్లేబాక్. ఈ చిత్రంలో లతా తన గాన ప్రతిభ యావత్తూ గుమ్మరిస్తోందట.

ఈమధ్య వచ్చిన "ఆన్" తమిళ తర్జుమా చిత్రంలో తన తమిళ ఉచ్చారణ బాగా లేదని పలువురు విమర్శించారనీ, తను కూడా అలాగే అభిప్రాయపడుతున్నాననీ ఆమె చెప్పింది. ఒక భాష చిత్రాన్ని మరొక భాషలోకి డబ్ చేసేటప్పుడు ఆ భాషకు తగినట్టుగా పాటల రాగాలు వేరే సమకూర్చుకోవాలని ఆమె అభిప్రాయపడింది. హిందీపాట రాగాన్ని అనుసరించి తెలుగులోనో, తమిళంలోనో పాట రాస్తే భాషకు అన్యాయం చేసినట్లవుతుందని ఆమె అన్నది.


"మీ రేమైనా జాతీయ గీతాలు పాడారా?" అని అడగ్గా "ఆనందమఠ్" చిత్రంలో వందేమాతరం తప్ప మరే జాతీయగీతమూ పాడలేదన్నది.

ప్రతిభావంతు లందరివలెనే లతా మంగేష్కర్‌కు కూడా సినిమారంగంలోకి కష్టంమీద ప్రవేశం దొరికినా ఈనాడామె అత్యుచ్ఛదశలో ఉన్నది. బొంబాయి ప్రొడ్యూసర్లు ఆమెను ప్రాణప్రదంగా చూసుకుంటారు. ఆమె పాడినపాట కనీసం ఒక్కటైనా ఉంటేగాని తమ చిత్రం రాణించదనీ, డబ్బు గడించదనీ వారికి నమ్మకం. అందుచేత సాధారణంగా ఆమె పాట లేని బొంబాయి చిత్ర మంటూ ఉండదు. రోజుకి రెండుపాటల చొప్పున, నెలకి సగటున అరవై పాటలు రికార్డింగ్‌కై పాడుతూ ఉంటానని ఆమె అన్నది. ఈ పాటల కవసరమైన రిహార్సిల్స్ వగైరాలు కలుపుకుంటే ఆమెకు అసలు తీరిక నేది ఉంటుందా అనిపిస్తుంది.

"మద్రాసు రెండుమూడుసార్లు వచ్చారు గదా, ఇక్కడి స్టూడియోలనుగూర్చి మీ అభిప్రాయం ఏమిటి?" అని అడగ్గా "బొంబాయి స్టూడియోలకంటే ఇక్కడి స్టూడియోలు పనివాడితనంలోను, ఆర్గనైజేషన్‌లోను, అనుసరించే పద్ధతులలోను మెరుగుగా ఉన్నాయి" అని ఆమె జవాబిచ్చింది.



ప్రకాష్ స్టుడియోలో "కన్నతల్లి" షూటింగ్ జరుగుతోంది. జి. వరలక్ష్మి, సి. వరలక్ష్మి, నాగేశ్వరరావు వేషాల్లో వున్నారు. జి. వరలక్ష్మి తల్లి. నాగేశ్వరరావు పెద్దకొడుకు, సి. వరలక్ష్మి అతనిభార్య. గృహచ్ఛిద్రాల్లో పడి కలగి నలిగిన రైతు కుటుంబం అది. దర్శకుడు ప్రకాశరావు సంభాషణ లేస్థాయిలో వుండాలో చెబుతున్నారు. కెమేరామాన్ జాగీర్దార్ వ్యూఫైండర్ లోంచి చూస్తున్నారు.



షాట్ అయిపోగానే బయటకు వచ్చి కూర్చున్నా రంతాను. నాగేశ్వరరావు ఫోన్ చెయ్యటానికి వెళ్లిపోయాడు. జాగీర్దార్ ప్లేట్ లోంచి టిఫిన్ తీసుకుని తింటోంది జి. వరలక్ష్మి, ప్రకాశరావు, దగ్గర కొచ్చిన కుక్కకు కొత్త బజ్జీముక్క పెట్టున్నాడు.


ఇంగ్లండు ప్రయాణం

'ఇంకా ఎవరికీ చెప్పని వార్త' అంటూ

ఆమె 1953 మే నెలలో తను ఇంగ్లండు వెడుతున్నానని చెప్పింది. లండన్‌లోని మన హైకమీషనర్ బి జి. ఖేర్ ఆమెను ఆహ్వానించారట. తన క్లాసికల్ గీతాల రికార్డులు కూడా తనతో తీసుకువెడతానని, అక్కడ పాట కచేరీలు చేయదలచానని ఆమె అన్నది ఆమె పాటలను బి బి. సి. వారు బ్రాడ్‌కాస్ట్ చేయదలచారట. ఆ ప్రోగ్రాములో ఒక విచిత్రాంశం ఏమిటంటే, ఇంగ్లీషులో ఉన్న ఒక పాటను హిందూస్థానీ బాణీలో లతా పాడబోతున్నదట.

లతామంగేష్కర్ 1942 లో "పహిలీ మంగళగౌర్" అనే చిత్రంలో మొదటిసారిగా నటించుచూ పాడింది బర్సాత్, ఏక్‌థీలర్కీ, షహనాయ్ మొదలైన చిత్రాల పాటలతో ఈమె ఖ్యాతి సంపాదించింది. జననం 28 సెప్టెంబరు 1929 ఇంకా అవివాహిత —ఎస్నార్

★



ప్రకాష్ స్టుడియో ముందు ఆవరణలో, విశ్రాంతి తీసుకుంటూ కాఫీ త్రాగుతూ కూర్చున్న సౌండ్ ఇంజనీరు ముకుంద్, నాగేశ్వరావు, జి వరలక్ష్మి, కెమెరామాన్ జాగీర్దార్, దర్శకుడు ప్రకాశరావు, తమిళ కవి సుబ్బరాములు

బొంబాయి పరిశ్రమలో మాంద్య పరిస్థితి

బొంబాయి సినిమారంగంలో పనిచేసే ప్రముఖులెవరైనా మద్రాసు వచ్చినప్పుడల్లా ఇక్కడి స్టూడియోలను, పనిచేసే పద్ధతులను మెచ్చుకుంటూ ఉంటారు. దీన్నిబట్టి మద్రాసుతో పోల్చిచూస్తే బొంబాయి పరిశ్రమ మరీ అరాజకస్థితిలో ఉందని అర్థం చేసుకోవలసివస్తున్నది. బొంబాయిలో దాదాపు నూరుచిత్రాలకు డైలాగ్స్ రచయితగా పనిచేసిన రాజేంద్రకిషన్ ఇటీవల మద్రాసు వచ్చినప్పుడు అయన్ని కలుసుకోగా ఇలా చెప్పాడు:

"బొంబాయి స్టూడియోలకంటే ఇక్కడి స్టూడియోలే బాగా వున్నవనిపిస్తున్నది. ఇక్కడకూడా తారల పద్ధతి వగైరాలు వున్నప్పటికీ బొంబాయిలో ఉన్నంత దారుణంగా లేదు.

బొంబాయి సినిమా పరిశ్రమ ప్రస్తుతం ఆర్థికమాంద్యంలో పడింది. యుద్ధకాలంలోను, యుద్ధం ముగిసిన కొత్తరోజుల్లోను ప్రజలు సినిమాలకు వెచ్చించినంతగా ఇప్పుడు వెచ్చించటం లేదు. చిత్రాల ఉత్పత్తి వ్యయం తగ్గకుండా రాబడిమాత్రం తగ్గిపోయింది. రాబడి తగ్గుదల నూటికి 60 వంతులదాకా వున్నది.

ఈ పరిస్థితికి ప్రజల కొనుగోలుశక్తి తగ్గిపోవట మొక్కటే కారణం కాదు తయారయ్యే చిత్రాల్లో ఎక్కువభాగం తుక్కుగా ఉండటం కూడా ముఖ్యకారణమే నిర్మాతలు ప్రసిద్ధ తారలను నమ్ముకుని కథలను, కథకులను నిర్లక్ష్యం చేశారు. మంచి కథలకు ఎన్నటికీ విలువ పోదు. తారలకు ఎంత మంచి నటులైనా త్వరలో విలువ తగ్గిపోతుంది చూసిన తారనే పదిసార్లు చూసేసరికి ఏ ప్రేక్షకుడికైనా మోజు దిగజారిపోతుంది తారలకు ప్రాణం ఇచ్చేది కథావస్తువులే నని గ్రహించకుండా మన నిర్మాతలు తారలకు ప్రాముఖ్యం ఇచ్చి కథలను నిర్లక్ష్యంచేశారు. అందుచేత ప్రజలు ఎంత గొప్ప తారలున్న చిత్రాన్నైనా నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇప్పుడిప్పుడు నిర్మాతలు జరిగిన అనుభవంనుండి పాఠం నేర్చుకుంటున్నారు మంచి కథ ఉండవలసిన అవసరం గుర్తిస్తున్నారు" ★



నలుగురు తారలొకచోట చేరితే ఏదో గొడవ చేస్తూనే వుంటారు యన్ టి రామారావు, జి. వరలక్ష్మి, గుమ్మడి వెంకటేశ్వరరావులు ఫక్కున నవ్వుతున్నారు. వెనకాల ఉన్నది సీకటి శివరాం



అంజలీదేవి డాన్సు చేస్తూ 'ఉడా ఉడడా' పాట టి. ఆర్. రామచంద్రన్‌కు వినిపిస్తోంది.
జయంతి వారి "బంగారు భూమి"లో ఒక దృశ్యం.

సినిమా వార్తలు

ఎ. వి. ఎమ్. వారి చిత్రాలు

"జీవితం" చిత్రం మూడు భాషల్లోను అఖండవిజయం పొందటంతో ఎ. వి. ఎమ్. వారు మళ్ళీ మూడుభాషల్లో ఒక చిత్రం తీస్తున్నారు. హిందీలో "లడ్కీ", అరవంలో "పెణ్" అని పిలుస్తున్న ఈ చిత్రానికి ఇంకా తెలుగుపేరు పెట్టలేదు. కథ వ్రాసినవారు ఆర్. వెంకటాచలం; ఈయన అరవ చిత్రానికి సంభాషణలు కూడా రాస్తున్నారు. హిందీ మాటలు, పాటలు రాజేంద్రకిషన్, తెలుగు మాటలు, పాటలు తోలేటి వెంకటరెడ్డి రాస్తున్నారు. హిందీ చిత్ర సంగీతం ధనీరాం, సుదర్శనం; అరవ, తెలుగు చిత్రాల సంగీతం సుదర్శనం సమకూరుస్తున్నారు. మూడు భాషల్లోను వి. నాగయ్య, అంజలీదేవి, వైజయంతీమాల నటిస్తున్నారు. వీరుకాక హిందీ చిత్రంలో భారత్ భూషణ్, ఓమ్‌ప్రకాశ్, కిషోర్ కుమార్, ఉమేష్‌శర్మ, రాజ్ మెహ్రా, రణధీర్, మాస్టర్ ఛోటూ, లీలా మిశ్రా నటిస్తున్నారు. అరవచిత్రంలో గణేశన్, సహస్రనామం, సారంగపాణి, పి. డి. సంబంధం, బాలచందర్, కార్తికేయన్, కె. ఎన్. కమల, కె. ఆర్. చెల్లం నటిస్తున్నారు. తెలుగు చిత్రంలో ఎన్. టి. రామారావు, సహస్రనామం, సి. ఎస్. ఆర్., బాలచందర్ నటిస్తున్నారు.

తెలుగు, అరవ చిత్రాల్లో ప్లేబ్యాక్ పాటలు రాజేశ్వరి, భగవతి పాడుతున్నారు. హిందీ చిత్రంలో లతామంగేష్కర్ మూడు పాటలు, గీతారాయ్ మూడు పాటలు, ఇద్దరూ కలిసి వేరే రెండు డ్యూయెట్లు పాడుతున్నారు.


ఎమ్. వి. రామన్ డైరెక్టు చేస్తున్న ఈ చిత్రం ఇప్పటికి సుమారు సగంవరకూ తయారైందని తెలుస్తోంది. హిందీలో ఫిబ్రవరి మాసానికి, అరవం, తెలుగులలో మార్చి, ఏప్రిల్ మాసాలకు విడుదల కాగలదట.

* * *

ఎ. వి. ఎమ్. వారు మరొక చిత్రం త్వరత్వరగా తయారుచేయటంలో నిమగ్నులై వున్నారు. వారి రెండవ చిత్రం "వదిన" తెలుగు, అరవభాషల్లో తయారవుతున్నది. అరవచిత్రం డిసెంబరు మాసాంతానికి విడుదల అవుతుందని, తెలుగుచిత్రం మరికొద్ది రోజుల్లో విడుదల అవుతుందని తెలుస్తోంది. ఈ చిత్రంలో కన్నాంబ, సావిత్రి, నాగేశ్వరరావు, సహస్రనామం నటిస్తున్నారు. దర్శకుడు పి. నీలకంఠ; సంగీతం సుదర్శనం; మాటలు, పాటలు తోలేటి.

* * *

రోహిణీ వారి రెండు చిత్రాల్లో "ప్రతిజ్ఞ" చిత్రం "లెగసీ" కంటె ముందు తయారవుతున్నది. ఈ చిత్రంలో సావిత్రి సేనాపతి కుమార్తె వేషం వేస్తున్నది. కాంతారావు ఆమె ప్రేమికుని వేషం,



ఇన్స్పెక్టరును పెళ్లిచేసుకోమని తండ్రి (రంగారావు) అడుగుతున్నాడు లేడీ డాక్టరు (కృష్ణవేణి) నిరాకరిస్తోంది.
ఎమ్ ఆర్. ఏ వారి "లేడీ డాక్టరు"లో దృశ్యం.

మరొక కొత్త నటుడు రాజనాల విలన్ వేషం వేసున్నారు ప్రస్తుతం సావిత్రి ఇంటిసెట్టుమీద షూటింగ్ జరుగుతున్నది నవేనటులకు అన్వయంలోని ప్రతి చిన్న వివరం దగ్గిర్నించీ చెప్ప నవసరంలేదనీ, వారిని "మూడ్"లోకి తెచ్చి వదిలిపెడితే వారంతట వారే నటించుకుపోగలరనీ హెచ్ ఎమ్ రెడ్డిగారి సిద్ధాంతం ఈ సిద్ధాంతాన్ననుసరించి "ప్రతిజ్ఞ" చిత్రం ఎక్కువ "రీటేకులు" అవసరం లేకుండా జోరుగా షూటింగ్ సాగిపోతున్నది

*　*　*

యునైటెడ్ టెక్నీషియన్స్ ఎండ్ ఆర్టిస్ట్స్ అనే పేరుతో కొత్తగా ఒక సంస్థ చిత్ర నిర్మాణానికి పూనుకుందని తెలుస్తోంది ఈ సంస్థవారు రష్యన్ రచయిత డాస్టాయేవస్కీ రాసిన "క్రైమ్ ఎండ్ పనిష్మెంటు" నవలను "శిక్ష" అనే పేరుతో చిత్రం తీస్తారట బి సుబ్బారావు గారు దర్శకత్వం, ఛాయాగ్రహణం; **ముక్కామల, రామశర్మ, రంగారావు,** టి కృష్ణకుమారి, జమున నటిస్తారట ఫిల్మ్ సెంటర్, స్టార్ కంబైన్స్, వాహినీ స్టూడియోలలో పని జరుగుతుందట

*　*　*

"అంబర్" చిత్ర నిర్మాతలైన జగత్ పిక్చర్సువారు కొత్తగా మరొక హిందీ చిత్రం తీయబోతున్నారు (తాత్కాలిక నామం 'బియాండ్ బ్యూటీ') ఎమ్ వి రామన్ దర్శకుడుగా పనిచేయనున్నారు వైజయంతీమాల తారగా, సి రామచంద్ర సంగీత దర్శకుడుగా, రాజేంద్రకిషన్ డైలాగ్ రచయితగా ఈ చిత్రం షూటింగ్ జనవరి 26 నుండీ ప్రారంభమౌతుందట

*　*　*

ఎమ్ ఆర్ ఏ వారి "లేడీ డాక్టర్" చిత్రం సగంవరకూ తయారైందని తెలుస్తోంది ప్రస్తుతం లేడీ డాక్టరు (కృష్ణవేణి) డిస్పెన్సరీ సెట్టుమీద షూటింగ్ జరుగుతున్నది

*　*　*

జై ఆశాపిక్చర్సు అనే కొత్త సంస్థవారు **"ఆశా" అనే చిత్రం తెలుగు, తమిళ** భాషల్లో ప్రారంభించారని తెలుస్తోంది. సి హెచ్. నారాయణరావు, కృష్ణకుమారి, జి ఆర్ స్వామి, ప్రభాకరరావు నటిస్తున్నారట ఫిల్మ్ ఎడిటర్ జోషీ దర్శకుడు ఇటీవల కొన్ని ఔట్‌డోర్ దృశ్యాలు షూట్ చెయ్యబడినాయట

*　*　*

ఫాల్కన్ ఫిలిమ్స్‌వారుతీస్తున్న "వతన్" అనే కొత్త చిత్రంలో శ్రీమతి సూర్యకుమారి ప్రధానపాత్ర ధరిస్తున్నది నిరూపరాయ్, మునవర్ సుల్తానాకూడా ఈ చిత్రంలో నటిస్తున్నారు నానాభాయ్ భట్ దర్శకుడు, వి ఎన్ రెడ్డి ఫొటోగ్రాఫర్

*　*　*

"పెకింగ్ ఎక్స్‌ప్రెస్" అనే అమెరికన్ చిత్రాన్ని ఇండియాలో ఎక్కడా ప్రదర్శించరాదని భారతప్రభుత్వం నిషేధించింది ఈ చిత్రంలో భీభత్సం కలిగించే హత్యాకాండ, హింస ఉన్నందున నిషేధించారట ఇది పారమౌంట్ వారి **చిత్రం.** ★

ప్రశ్నలు - సమాధానాలు

లంక కృష్ణమూర్తి—బరంపురం.

మద్రాసు, త్యాగరాయనగర్‌లో కొన్ని శిలలనుండి "మద్రాసు ఫిలింఇన్స్టిట్యూట్" అనేది ఒకటి నడుస్తూ యున్నదని, సినిమటోగ్రఫీలో అనుభవం సంపాదించిన శ్రీ అజిత్‌కుమార్ ఈ పాఠశాల స్థాపించారని, కొంతమంది విద్యార్థులు వీరిక్రింద తరిఫీద్ పొందుతూయున్నారని "సినిమాలో ఇతర కళలస్థానం" అనే శీర్షికలో తెలియపర్చారు. ఎడ్రసు కాస్తా తెలియపరుస్తే చాల సంతోషిస్తాను.

—మద్రాసు ఫిల్మ్ ఇన్స్టిట్యూట్, ఘనీ బిల్డింగ్సు, పాండీబజారు, టి. నగర్, మద్రాసు—ఈ ఎడ్రెసుకు రాసి వివరాలు తెలుసుకో వచ్చును.

* * *

శ్రీ చలాది పాండు రంగారావు—మొవ్వపాలెం.

ఆంధ్రవారపత్రికలో 8-10-52 తేదీ సంచికలో ప్రకటింపబడిన ప్రపంచ విఖ్యాత సప్తవింతలలో తాజమహాలు మినహా మిగిలిన 6 వింతలు అవి అట్లా ఉండుటకు కారణము లేవి ? అవి మానవ నిర్మితములా లేక దైవనిర్మితములా? వాటి పుట్టుపూర్వోత్తరములు తెలియజేయవలెను.

—అవి మానవ నిర్మితములే-వాటి పుట్టుపూర్వోత్తరములు ఆంగ్ల విజ్ఞాన సర్వస్వంలో "ఎన్‌సైక్లోపీడియా - బ్రిటానికా"లో సవిస్తరంగా చదువుకో వచ్చు. కోరిన పూర్వోత్తరముల కిదియే ప్రత్యుత్తరము.

* * *

దాసరి యాకోబు—కలవచర్ల.

నేను సినిమాలో నటించుటకు కుతూహలముగ నున్నది. ఏమి చేయవలెను?

—ఏ ప్రొడ్యూసరునో ఆశ్రయించవలయును.

* * *

కె. కేశవరావు—కర్నూలు.

ప్రభుత్వము వారు మన తెరపై అసభ్య ప్రదర్శనమునకు అనుమతింపక, అసభ్యకరములగు సన్నివేశములతో కూడియున్న విదేశీయ చిత్రములను అనుమతించుటలో వారి అభిప్రాయమేమిటండీ ?

—ఈ ప్రశ్నకు సమాధానం నేరుగా భారత సమాచార శాఖామంత్రి డా॥ కేస్కార్‌ను కనుక్కోవలసిందే.

శ్రీ ఏ. సీతయ్య, నర్సాపురం—ప॥ గోదావరి.

కాకులు ఎక్కువసేపు అరిస్తే మనయింటికి బంధువులుగాని మరి ఎవరైనా గాని, వస్తారని పెద్దలు అంటారు. మీ అభిప్రాయం ఏమిటి ?

—కాకులు కూసినరోజున బంధువులు ఒకప్పుడు వస్తారు ఒకప్పుడు రారు. ఈ కాకులకు ఆబంధువులకు కాకతాళీయ సంబంధమేగాని కార్యకారణ సంబంధం లేదు. ఈ కాలంలో సక్రమంగా వచ్చే బంధువులు ముందుగా పోస్టులో కార్డులు కాకితాలు పంపిస్తారు గాని కాకులను పంపించరు.

* * *

డి. రామచంద్రారెడ్డి—కోసూరు.

కాంచనద్వీపము అను నవల *Treasure Island* కు *True Translation* అగునా? అందైన "తస్సదియ్య" అను పదము అందులో వాడినారు. అది యే యింగ్లీషు పదమునకు ఆంధ్రీకరణమో తెలుపుడు.

—ఇంగ్లీషునుంచి తెలుగులోకి మాటకు మాటగా అనువదించటం అసాధ్యం. అలా అనువదిస్తే అది ఇటు తెలుగూ, అటు ఇంగ్లీషూ కాకుండా పోతుంది. అనువాదకుడు కొంత స్వతంత్రించక తప్పదు. "తస్సదియ్య" అనేది తెలుగు మాట. దానికి ఇంగ్లీషు లేదు.

* * *

శ్రీ జి. సత్యనారాయణ ఆచార్యులు—ఆరవల్లి. (అత్తిలి పోస్టు)

మైసూరులో ఒక శాస్త్రజ్ఞునకు భారద్వాజమహర్షిచే సంస్కృతంలో వ్రాయబడిన మంత్రశాస్త్రం దొరికినట్లును అందులో విమానముల నిర్మాణమునుగూర్చి వ్రాయబడినట్లును, ఆ గ్రంథము శోధింపబడుచున్నట్లును రేడియోలో వార్త చెప్పబడెను. ఆ కృషి ఎంతవరకు వచ్చినదో తెలుపవలెను.

—ఈ గ్రంథం పేరు "యంత్రసర్వస్వము". దానిలో "విమానాధికరణం" అనే పేరుతో ఒక అధ్యాయం ఉంది. "ఆకాశతంత్రం" అనే ఇంకొక గ్రంథం కూడా ఉంది. ఈ విషయమై గ్రంథశోధన ఇంకా జరుగుతోంది. దానిలోని విషయాలకు అర్థం తెలిసికోవలసియున్నది.

అక్కినేని రామమోహనరావు—కంకిపాడు.

శివరావుగారు మరియొక పిక్చరు తీయుచున్నారు అని మా మిత్రుడు అంటాడు; నేను తీయటం లేదు అంటాను. మీరేమంటారు.

—"బభ్రువాహన" చిత్రం తీయాలని శివరావుగారు ఇటీవల మళ్ళీ సంకల్పించారు, గనుక మీ మిత్రుడే రైటు. (కాలక్రమేణా మీరే రైటు కావచ్చు; ఎవరు చెప్పగలరు?)

* * *

కె. ఎరికలరెడ్డి—మధిర.

సినిమా ఫీల్డులో ఉత్తమ నటుడికి ఎక్కువ పలుకుబడి ఉంటుందా? ఉత్తమ దర్శకునికా? ఎందుచేత.

—ఇద్దరికీని ఉత్తములుగనుక.

సినిమారంగంలో ఆంధ్రులకు ఎక్కువ పేరున్నదా? అరవలకు ఎక్కువ పేరున్నదా?

—ప్రస్తుతం ఆంధ్రులదే పైచెయ్యిగా ఉన్నట్లు కనబడుతోంది.

* * *

శ్రీ బి. పాండురంగశాస్త్రి—కంచాకోడూరు.

రామావతారంలోని వాడు ఆంజనేయుడు. కృష్ణావతారంలోనివాడు భీముడు. వీరిద్దరికి వైర మెట్లు సంభవమైంది?

—ఆంజనేయుల వారు చిరంజీవులు. మార్కండేయులవారివలెనే వ్యాసులవారివలెనే చిరంజీవులు. కనుక రామావతారంలోని ఆంజనేయులవారు కృష్ణావతారం నాటి భీమునితో కలిసికొనగలరు.

శ్రీకృష్ణునకు సంతానము కలదా?

—ప్రద్యుమ్నుడు శ్రీకృష్ణుని కుమారుడే.

* * *

తీరిన కోరిక

(7-వ పేజీ తరువాయి)

ఇప్పుడు శాంత యింట్లో సర్వాధికారిణి. ఆమె మాటకు తిరుగులేదంటే-లేదు. ఆమె నలుగురుబిడ్డల తల్లి కూడా.

"చిట్టీ! నాన్నగార్ని స్నానానికి రమ్మను, నీళ్లు చల్లారిపోతాయి."

వెంటనే నాన్న స్నానంచేసి వెళ్లేవారు.

"పిల్లలూ - పదయింది బడికి పోరేం?"

పిల్లలు మాట్లాడకుండా బడికి వెళ్ళేవారు.

"ఓసే! అప్పలమ్మా ఆ గది ముందు చిమ్ము"

అలాగే చేసేది అప్పలమ్మ.

"ఈవాళ సినీమాకు వెళదాం తొందరగా రండి."

"అలాగే" అనేవాడు-పూర్వం "అమ్మ వడుగు" అన్న భర్త.

జీవితం సుఖమయంగా జరుపుకోవాలంటే పరిసర వాతావరణాన్ని అవగాహన చేసుకోవాలి. ఇది చిన్నతనంలో అర్థం కాని విషయం కావచ్చు. అయినా బుద్ధిమంతులయిన పెద్దల సహకారంలో పిన్నలు తమ భావిజీవితాన్ని మధురాతి మధురంగా తీర్చి దిద్దుకోవచ్చు.

కొందఱు పెద్దలు ఈ విషయాన్ని గమనించక అనవసరంగా బాధపడతారు. అందుకు శాంత ఒక చక్కని ఉదాహరణ. ఆమె ఇప్పుడు పొందుతున్న సంతృప్తి ఎన్నడు ఎరుగనే ఎరుగదు. అందుకు కారణం శాంతకు తెలియదు. ఇక ముందుమాత్రం తెలుస్తుందా? తనలో చిన్నప్పటినుండీ గూడుకట్టుకొనిపోయిన కోరిక ఇప్పటికి తీరిపోయింది అనుకొంది శాంత. వాతావరణాన్ని అవగాహన చేసికోలేని శాంతకోరిక ఇప్పటికి తీరిందని, ఆమె అనుకోవటంలో ఆశ్చర్యమేముంది? ★

సినిమాలలో హాస్య వేషాలు తరుచువేసి బాగా పేరు సంపాదించిన ఒనానొక వ్యక్తి, ఒక రోజున రైల్లో ప్రయాణం చేస్తున్నాడు. కొన్ని స్టేషన్లు దాటాక టికెట్ కలెక్టరు యితడు వున్న పెట్టిలోకి వచ్చి, టిక్కెట్లు చూపించమని అడిగాడు. ఎన్ని జేబులు వుంటే అన్ని జేబులూ తడిమినా టిక్కెట్టు కనబడలేదు. తెల్లమొఖం వేశాడు.

ఈలోగా టిక్కెట్ కలెక్టరు యితడు ఫలాని హాస్య నటుడని గుర్తించి, "పోనీ లెండి. టిక్కెట్టు ఎక్కడో పారేసు కొన్నట్లున్నారు" అన్నాడు.

"మీరైతే దయ తలచి నన్ను వదిలిపెట్టు తున్నారు కానీ, యిప్పుడు ఆటిక్కెట్టు లేకపోతే, నేను దిగవలసిన స్టేషన్ ఏదో నాకెలా తెలుస్తుందా అని ఆలోచిస్తున్నాను." అన్నాడు ఆహాస్యనటుడు.

కాలక్షేపం

(5-వ పేజీ తరువాయి)

భువి; భూలోకంబునందుండి య
స్తోకాంభోధి; పయోధినుండి
పవనాంధోలోకముం జేరె గం
గా కూలంకష; పెక్కుభంగులు
వివేకభ్రష్ట సంపాతముల్."

నిర్మలమైన ఆకాశగంగ ఆకాశంనుండి శివుని తలమీదకు వచ్చింది. అక్కడినుంచి శ్రీతహించిన హిమగిరిమీదకు దిగింది. అక్కడినుంచి భూమిమీదకు దిగింది. అక్కడినుంచి సముద్రంలోకి పోయింది. అక్కడినుంచి పాతాళలోకంలోనికి పోయి పాతాళగంగ అయింది. వివేక భ్రష్టులైనవారు కూడా యిదేవిధంగా అధోగతి పాలవుతారు అని వర్ణించాడు భర్తృహరి. కాని, కర్మమార్గంలోనుంచినీ జ్ఞానమార్గంలోనుంచినీ, భక్తిమార్గంలోకి బోల్తాకొట్టినప్పుడు భక్తుడుభ్రష్టుడు కాడు.

"పూవై తన్మకరందమై కరగి
పోవో నీళ్లకుం బిల్చునై"

పోవచ్చు — కరిగిపోతాడుగాని తరిగిపోడు. కరిగినీరైన లోహంలోని కల్మషం పోయి, అది మలీమస రహితమై, మరింత తేజస్సుతో ప్రకాశిస్తుంది. భక్తిమార్గ ప్రభావం అటువంటిది. భక్తునిలో ఉన్నది బంగారంలాంటి సరుకు అయితే, దేవదేవి కాదుగదా దేవదేవిని పుట్టించిన వాడుకూడా ఆభక్తుణ్ణి ఏమీ చెయ్యలేడు.

"మన బంగారం మంచిదైతే, కంసాలి వాని తప్పు లేదు." కర్మనియమం, జ్ఞాన సాధన, ఇంద్రియనిగ్రహం ఉండవలసినవే. కాని, యీ మూడింటినీ మించింది భక్తుని ఆత్మసంస్కారం. అటువంటి భక్తాంఘ్రి రేణువు ఢిల్లీకి వెళ్ళినా భంగీకాలనీలోనే (పాకీవాండ్లగూడెములోనే) బసచేస్తాడు. కోటీశ్వరుల మందిరములందు కోటిమర్యాదలందెడి మహాత్ముడు కుష్ఠరోగికి తన ఆశ్రమములో ఆశ్రయమిచ్చి అవ్యాజంగా అయాచితంగా స్వయంగా సమస్తోపచారాలు దాసానుదాసు నివలె చేశాడు. హిమాలయపర్వతాలవంటి మహోపచారాలు చేసినా, మహాత్ముని ఆత్మకు తేజస్సు తగ్గదు.

"తల పైకెత్తియె జ్యోతివెల్గు నెపుడున్-
తిన్నెట్లుగా త్రిప్పినన్." ★

★ ముద్దు—ముచ్చట ★

(37-వ పేజీ తరువాయి)

అభిమానమని అదంతా వుట్టి అబద్ధం - యివ్వేళ తేలి పోయింది.

బాబు: నువ్వు మాత్రం అన లేదూ - అమ్మకు నేనంటే అభిమానమని? అదీ వచ్చి అబద్ధమని యివ్వేళే తెల్సిపోయింది.

లీల: ఏమయిం దేమిటి?

బాబు: ఏమయిందో నువ్వే ముందు చెప్పు!

లీల: ఏం చెప్పేదిరా-పెన్నుతో రాయాలని చాల రోజుల నుండి అనుకుంటున్నాగా! ఈ వేళ నాన్న పడుకున్నప్పుడు ఆయన జేబులో నుంచి పెన్ను తీసి వ్రాస్తూవుంటే చెయ్యి జారి క్రిందపడి పోయింది. టేబిలు మీదనుంచి పడి చప్పుడు అయింది. నాన్నగారు లేచి చూశారు. ఆపళంగా కోపంతో నన్ను వచ్చడి చేశారురా! నాన్నతో యిక మాట్లాడను.

బాబు: నాకూ అలాంటిదే జరిగిందే అక్కా! అమ్మ పొయ్యి దగ్గర కాఫీ కాస్తుంటే తన వడిలో కూర్చున్నానే. పొయ్యి మీదిపాత్ర దించుతూ అమ్మ తనేమో చెయ్యి కాల్చుకుంది. కాఫీ డికాక్షనంతా క్రింద వలికిపోయింది. ఆకోపంలో నావల్లూ హూనం చేసిందే. కావాలంటే చూడు నా బుగ్గ మీద యెఱ్ఱగా ఎలా కంది పోయిందో (వెక్కి వెక్కి యేడుస్తాడు)

లీల: వాళ్లకుయిష్టంలేని పనులు చెయ్యకుండా మంచిగా వున్నప్పుడేనా యీ పెద్దవాళ్లముద్దు ముచ్చటలు. అమ్మా, నాన్నా, యిద్దరూ ఒకటే! కోపం వచ్చినప్పుడు యెవరి మీదా ముద్దూ వుండదు! ముచ్చటా వుండదురా తమ్ముడూ, అంతా నాటకంరా బాబూ!!

బాబు: ఔనే అక్కా! అంతే ఈ పెద్దాళ్లంతా అంతేనే!!

[తెరవాల్తుంది] ★

మాయలమల్లీ తెల్లనిపిల్లీ

(42-వ పేజీ తరువాయి)

సరికి, సింహం కోపంతో దాని తోకను గట్టిగా పట్టుకొని చిగ్గరగా గర్జించి---

"మాయలమల్లీ తెల్లనిపిల్లీ
మహా బాగా నను మోసగిస్తివే!
చూడుము నీపని పట్టెదనిపుడే
చుక్కలు కనబడ పట్టపగలే!"

అని ఆ తోకను మొదలంటా తెగ కోసింది. చీలమ్మ "మియాంవ్ - మియాంవ్" అని వికారంగా యేడుస్తూ వెనక్కు తిరిగి చూడకుండా పరుగు పరుగునా పట్నం పారిపోయింది!

★

అతకని బతుకులు

(1`-వ పేజీ తరువాయి)

"శకుంతల మొగుణ్ని తీసికెళ్ళారా?" అన్నది; ఊం కొట్టాను.

రఘు, సీతాయ్, నాన్న నిద్రపోతున్నారు.

"అది చిన్నప్పట్నుంచి ఎంత గారాబంగా పెరిగిందో, అంత అల్లరిబతుకై పోయింది" అన్నది అమ్మ, కుర్చీ మీద కూర్చుని; నేను మాట్లాడ్లేదు.

"అసలు దాని జాతకమే అంత-అందుకే మీ మామయ్య ఎంత పట్టుపట్టినా, మీ నాన్న పడనీయలేదు" అన్నది, తిరిగి. నాకు గుండెల్లో శూలాలు గుచ్చుకొన్నట్లయింది.

"నీకు దానిమీద కోపం కూడ వచ్చి ఉండొచ్చు" అన్నది, మళ్ళీ; నేను లేదన్నట్టు నవ్వి ఊరుకున్నాను.

"నీవూ, మీ మామయ్యా ఎంత ఒకచోటకి, చూస్తూ చూస్తూ నీ గొంతు కొయ్యటానికి నే నొప్పుకోలేదు" అన్నది అమ్మ, కాసేపుండి.

"పోనీలేవే—ఇప్పుడదంతా ఎందుకు?" అన్నాను, విసుగ్గా.

అమ్మ మాట్లాడ్లేదు; కాసేపు పైకిచూస్తూ కూర్చున్నది. నేను సిగరెట్టు కాలుస్తూ బైటి వెన్నెలవంక చూస్తున్నాను.

"ఇంతకూ మా యోగం బాగుండి, నీకా సంబంధం తప్పిపోయింది" అన్నది అమ్మ, కాసేపటికి. నాకు చిర్రిమంట లెత్తింది నిలువునా; కాని మాట్లాడ్లేకపోయినాను

"ఎంత జాతకానికంత; నిజంగా 'రాధ'. చూడు, ఎంతముచ్చటైన పిల్లో?" అన్నది. ఒక్కక్షణం రాధ నసహ్యించుకున్నాను. మరుక్షణం రాధ నా మనోనేత్రం ముందు తీయని నాట్యం చేసింది.

"దేనికైనా పూర్వజన్మలో చేసుకుని పుట్టాలి" అన్నది, మళ్ళీ.

"పోనిద్దూ—పొద్దుపోయింది, పడుకోరాదూ?" అన్నాను, అసహనంతో.

అమ్మ మాట్లాడ్లేదు. "నీకింకా బుద్ధి రావలేదు" అన్నది, కాసేపటికి.

నేను మాట్లాడ్లేదు. [illegible]

కుర్చీ వెన్నెట్లో వేసుకుని కూర్చున్నాను.

"నీకు శకుంతల్ని చేసుకోలేదని, మీ మామయ్యకెంత కోపం వచ్చిందని?" అన్నది, కుర్చీమీదనుంచి లేచి - నేను మాట్లాళ్ళేదు. మంచం లాక్కుని పడుకున్నాను.

"కోపం వచ్చినా మానె - నా యోగం బాగుంది" అని తన మంచంమీద పడుకున్నది. నాకు పిచ్చెక్కినట్లైపోయింది.

పైన ఆకాశంలో చంద్రుడు నవ్వుకుంటున్నాడు; నక్షత్రాలు మురుసుకుంటున్నై. మళ్లీ సిగరెట్టు వెలిగించి పైవేపు చూస్తున్నాను.

శకుంతల ఏమి కాబోతున్నది? ముక్కుపచ్చలారని పసిపిల్ల కాలపు కాఠిన్యానికి బలి గాబోతున్నది; ఆచారాల కరకు కత్తుల మీద తెగిపోనున్నది. ఒక్కక్షణం శకుంతల రూపాన్ని ఊహించుకున్నాను; కన్నీళ్లు బొటబొట కారినై.

ఆ రాత్రి నిద్రపట్టలేదు:—

నా జీవితసర్వస్వానికి రాధ భాగస్వామిని. నా మీద నాకు హక్కు పోయింది. శకుంతల్ని కనికరించటంగూడ నావల్ల కానిపని - కళ్లు మూసుకున్నాను.

అయినా, శకుంతల నా వద్ద ఏమీ ఆశించబోదు. తన దుర్విధికి కుంగి, కృశించి, నశించిపోతుందే గాని, చేయందిచ్చినా, నిలబడి, మళ్ళీ జీవితాన్ని ఆనందమయం చేసుకోదు. రాళ్ళమీద జారిపోతున్న తాయి మనస్సులో వెలిసింది కళ్ళు గట్టిగా మూసుకున్నాను.

మర్నాడు పొద్దున కాఫీ తాగి శకుంతల్ని చూడటానికి వెళ్లాను. వెళ్లేసరికి మామయ్య అరుగుమీద కూర్చొనున్నాడు; మామయ్య వియ్యంకుడు అవతలి అరుగు మీద కూర్చొని అవతలి వేపు చూస్తున్నాడు.

"శకుంతల కెట్లా ఉంది, మామయ్యా?" అన్నాను; వియ్యంకుడు నా వేపు చూశాడు, తడికళ్ళతో.

"గట్టిగా బతికి బైటపడిందాకా, ఏం చెప్పగలంరా?" అన్నాడు మామయ్య, ముభావంగా. వియ్యంకుడు తల వంచుకున్నాడు.

నేను మాట్లాళ్ళేదు; సిగరెట్టు వెలిగించుకుని అరుగుమీద మామయ్యకు కొంచెం దూరంలో కూర్చున్నాను.

"రాత్రంతా అల్లుణ్ని గురించి అడుగుతునే ఉంది" అన్నాడు మామయ్య; నేను మాట్లాళ్ళేదు. వియ్యంకుడివేపు చూశాను.

"ఎట్లా దాని చెవినివేసేది, చెప్పరా" అన్నాడు మామయ్య; కళ్ళల్లో నీళ్లు తిరిగినై. నేను మాట్లాళ్ళేదు - వ్రిగా చూశాను.

"చివరికి పసికట్టింది: 'ఒంట్లో ఏమీ తేటగాలేదా నాన్నా, ఆయనకి?' అన్నది" అన్నాడు మామయ్య. నేను వీధిలోకి చూశాను.

"ఏం చెప్పేం చెప్పరా" అన్నాడు మామయ్య; నేను నిశ్శబ్దంగా సిగరెట్టు కాలుస్తున్నాను.

"దానికి తెలిస్తే, అసలే యీ నీరసం మీద గుండె పగిలి చావదూ?" అన్నాడు మళ్ళీ. నేను విషాదంగా నవ్వి ఊరుకున్నాను.

కాసేపు ఎవరం మాట్లాళ్ళేదు. నేను సిగరెట్టు పారేసి, శకుంతల గదివేపు వెళ్ళాను. నీరసంగా పడుకుని, తలగడ వేపు చూస్తున్నది.

నేను గడపఇవతల నిలబడి, "ఎట్లా ఉంది శకూ?" అన్నాను. శకుంతల చిన్నగా నవ్వి, "ఏముంది? ఏమీ లేదు బావా" అన్నది. నేను మాట్లాళ్ళేదు.

"వారింకా నిద్రపోతున్నారా?" అన్నది మళ్ళీ; నాగుండెలు కొట్టుకునై; అవునన్నాను.

శకుంతల తృప్తిగా పడుకున్నది: కాసేపుండి, "నే నోట్టి పాపిష్టిదాన్ని, బావా" అంది నా హృదయం బాధగా మూలిగింది.

"నావల్ల వారికేమీ సౌఖ్యం లేదు" అన్నది మళ్ళీ.

"ఏడిశావులే - మెదలకుండా నిద్రపో" అన్నాను, గదమాయిస్తూ; నా శరీరం అంతా జలదరించింది. శకుంతల నా వేపు దీనంగా చూసి, కళ్లు మూసుకున్నది.

"పుట్టిన బిడ్డనిగూడ పొట్టన పెట్టుకున్నాను" అన్నది, కళ్ళు మూసుకునే. నేను మాట్లాళ్ళేకపోయినాను. శకుంతల కనురెప్పల్లోంచి అశ్రువులు జారినై.

నేను ఇవతలికి వచ్చేశాను. మామయ్య అప్పుడే వచ్చిన డాక్టర్ని తీసుకుని లోపలికి వస్తున్నాడు. నేను మళ్లీ వెనక్కి తిరిగి లోనికి వెళ్ళాను. అత్తయ్యగూడా ఇంట్లోంచి వచ్చింది.

డాక్టరు శకుంతల్ని పరీక్షచేసి ఇవతలికి వచ్చాడు.

"ఇక ఫరవాలేదులెండి: నీరసంమీద అంత హైరాన చేసింది. కాని మీరు కిందికి దించేయటం చాల పిచ్చిపని" అన్నాడు డాక్టరు. మామయ్య కృతజ్ఞతవల్ల మాట్లాళ్ళేకపోయినాడు.

గుండె చాల నీరసంగా ఉంది: స్నానం చేయించేదాకా ఆ విషయం దాచేయండి" అన్నాడు డాక్టరు, వెళ్ళిపోతూ మామయ్య చేతులు వెనక్కి కట్టుకుని, వినయంగా తలకాయూపాడు.

అత్తయ్య దగ్గిరికి వచ్చి, రహస్యంగా, సేమం

"నే చెబితే విన్నారూ? అది బతుకుతుందండీ పెద్ద డాక్టర్ని పిలవండీ, అంటే - చివరి. నారాత బావుంది" అన్నది, తృప్తిగాకి మామయ్య ముఖంలో ఒక్కక్షణం వెనకటి హాస్యం ద్యోతకమైంది.

"అంతా మీలోనే ఉంది. ముందే జాగ్రత్తపడ్తే, అల్లుడుగూడ దక్కేవాడేమో" అన్నది మళ్ళీ, కళ్లు పమిట అంచుతో అద్దుకుంటూ.

మామయ్య మాట్లాడకుండా వీధి అరుగు మీదికి వెళ్లి కూర్చున్నాడు. అత్తయ్య లోపలికి వెళ్లింది. నేను కదలబోతున్నాను.

"బావా" అని పిల్చింది శకుంతల. నేను గుమ్మందగ్గిర నిలబడ్డాను.

"ఏమిటీ, అమ్మ అంటున్నది?" అన్నది నీరసంగా చూసి. నా గుండెలు ఝల్లుమన్నై.

"ఆఁ - ఏమీ లేదు" అన్నాను, లేని ఉత్సాహంతో.

"కాదు నాకు తెలుసు; మీరంతా దాస్తున్నారు - నేనాయన్నిగూడ పొట్టన బెట్టుకున్నాను" అని అవతలివేపు తిరిగి, వెక్కి వెక్కి ఏడవటం మొదలు పెట్టింది.

"నీకేం పిచ్చాయేం; ఆయన కులాసాగా ఉంటే?" అన్నాను ధైర్యంగా.

శకుంతల అట్లాగే యేడుస్తున్నది; నా గుండెలు జారిపోయినై.

"ఆయన కులాసాగా తిరుగుతుంటే నే-" అన్నాను.

"కాదులే బావా- నాకంతా తెలుసు" అన్నది శకుంతల, ఇంకాస్త వెక్కి వెక్కి ఏడుస్తూ. నేను మాట్లాళ్ళేదు; తప్పు చేసినట్టు నిలబడిపోయినాను. ఇంతలో ఏడుపు విని అత్తయ్యా, మామయ్యా పరుగెత్తుకొచ్చారు.

"మీరంతా కలిసి ఆయన కన్యాయం చేశారు" అన్నది, ఇంకా ఏడుస్తూ.

ఎవళ్ళమూ మాట్లాళ్ళేకపోయినాం. అత్తయ్య దగ్గిరికి వెళ్లి శకుంతల్ని ఓదారుస్తున్నది. మామయ్య నా వేపు దీనంగా చూశాడు. రెండుక్షణాలు నిలబడి, ఇద్దరం ఇవతలికి వచ్చేశాం. మామయ్య తలకాయ మోకాళ్ళమీద పెట్టుకుని కూర్చున్నాడు. నేను సిగరెట్టు వెలిగించి నిలబడ్డాను.

23

లోపల్నుంచి శకుంతల వెక్కి వెక్కి ఏడవటం వినబడ్తునే ఉంది. మామయ్యా వియ్యకుండు కనబళ్లేదు. నేను కాసేపు నిలబడి, "వస్తా మామయ్యా" అని ఇంటికి తిరిగి వచ్చాను.

స్త్రీకి భర్తే ప్రాణం; అది కాస్త పోయింతర్వాత జీవితం నిరర్థకంగా గడి మాత్రమే మిగుల్తుంది. అందులో

శకుంతలలాగా భర్తని పోగొట్టుకున్నప్పుడు కలిగే దుఃఖానికి అంతుండదు.

అసలు జీవితంలో ప్రేమ ఒక ఆశయ మనుకున్నాను. నాతో చనువుగా తిరిగి, తన జీవితాన్ని నా కంకితం చేయటానికి ఉవ్విళ్ళూరిన శకుంతల అన్యథా జరిగిన తర్వాత కుంగిపోతుందని అనుకున్నాను; కనీసం అన్యమనస్కంగా దుఃఖంతో నే కాలం గడిపేస్తుందని భావించాను. కాని అట్లా జరుగలేదు. శకుంతల తన సర్వస్వాన్ని భర్తకు అంకితం చేసుకున్నది కలలో గూడ నన్ను తల్చుకోనుండదు. ఏ జన్మలోనో, ఏ పరదేశంలోనో, ఎరుగని యాత్రికుణ్ణి కలుసుకున్నట్టు నన్ను చూసింది నన్ను గురించి తను ఎన్నడూ [illegible] తనకి నన్ను గురించిన ధ్యాసే [illegible] తిరిగింది

నేను శకుంతల్ని గురించి [illegible], నాకి పోయిన [illegible] నవ్వుకున్నాను. శకుంతల్ని [illegible] సర్వస్వాన్ని [illegible] నిష్కారణంగా, [illegible] అర్పించదల్చుకున్న [illegible] వశీకరించుకున్నాను.

[illegible] అనురాగాలు నా కోసం [illegible] పాతుతుంది; నా కోసం తన సర్వస్వం త్యజిస్తుంది, నా కోసం వర్రిత్తి పోతుంది. నేను కనబడని కాలంలో చంద్రుడు లేని నిశిలాగా దుఃఖం ముసుగుకుంటుంది; నా సమక్షంలో [illegible] కలువ కన్నెలా వికసించి నవ్వుతుంది

ఆ క్షణంలో [illegible] ప్రణయంతో నా హృదయమంతా నిండిపోయింది ఆ ముగ్ధ మోహన [illegible] నా హృదయ తంత్రుల్ని కదిలించి మధుర గానం చేసింది. చుట్టూ చూసుకున్నాను; ప్రపంచమంతా కిలకిలపలికింది. [illegible] నా హృదయం కొట్టుకుంది. ఒక్క [illegible] ఆమె నూహించుకుని ఆనందంలో, తృప్తిగా, నవ్వు కున్నాను.

ఇంటికి రాగానే. "శకుంతల కెట్లా ఉందరా" అన్నది అమ్మ; నాన్న నాకేసి చూచుని భగవద్గీత చదువుకుంటున్నారు.

"మళ్ళీ తిరగబెట్టింది" అన్నాను, ముక్తసరిగా

"ఏం ?" అన్నది అమ్మ ఆదుర్దాగా. [illegible] చెప్పాను; అమ్మ నిట్టూర్చి ఊరుకుంది. నాన్న పుస్తకం మూసేసి, "అయినా వాళ్ళ తెలకోదు, దానిదగ్గర అలుణ్ణి గురించి మాట్లాడమేమిటి ?" అన్నారు, కొద్ది కోపంగా. ఎవళ్ళూ మాట్లాడలేదు.

"ఇక దానిని పట్టటం కష్టమే" అన్నారు నాన్న; అమ్మ అవునన్నట్టు చప్పరించింది. నేను స్తంభాని కానుకుని నేలమీద కూర్చుని సిగరెట్టంటించాను.

అమ్మ, ఇంట్లో పనులకి వెళ్ళిపోయింది; నాన్న పుస్తకం తెరిచారు.

నా హృదయంలో ఏమూలో శకుంతల మూలిగింది; నా హృదయంలో ఏ కణమో శకుంతల అవస్థకి కుళ్ళిపోతున్నది కర్తవ్యం నాకు ఎరుగకుండా రఘు, వెంకట సీతాదేవి పుస్తకాలు తెరిచి పెడుతున్నారు, నిశ్శబ్దంగా

లోకమే పట్టని ఆ పసిహృదయాల పావనత్వానికి నా కళ్ళు చెమర్చినై. మానవ జీవితం మానవుడు తన చిరుత ప్రాయంలోని నైర్మల్యాన్ని నిలుపుకోగలిగితే –!

ఆ సాయంత్రం అమ్మ తన తమ్ముడింటికి వెళ్ళొచ్చింది. రాగానే, "ఇదీ [illegible]" అన్నది. నా గుండెలు కొట్టుకున్నై; ఏమన్నట్టు చూశాను

"పాపముందీ పిల్ల, ఇప్పుడే సాయంత్రం పురుడు పోసుకుంది — ఇంక ఆ [illegible] అదీ దాటిపోవలసిందే" అన్నది నేను మాట్లాడ్లేదు అమ్మ ఇంట్లోకి వెళ్ళిపోయింది.

నే నుండబట్టలేకపోయినాను మెల్లిగా మామయ్య ఇంటికి బైలుదేరాను. అప్పుడే కలిగిన [illegible] ఆవరించినై; ప్రపంచమంతా చిరువెన్నెల్లో సుఖమయంగా కనిపించింది

నే వెళ్ళేసరికి మామయ్య ఇంట్లో లేడు — అంతా నిశ్శబ్దంగా ఉంది అత్తయ్య శకుంతల గదిదగ్గర తల వంచుకుని కూర్చున్నది. పిల్లలు పెళ్ళి మెదలకుండా నిలబడ్డారు; వరాండాలో చిన్న దీపం వెలుగుతున్నది

"ఎవరు?" అన్నది అత్తయ్య, భయపడ్డట్టు; చెప్పాను. అత్తయ్య మాట్లాడ్లేదు.

"శకుంతల కెట్లా ఉంది?" అన్నాను, ఆదుర్దాగా

"ఇప్పుడే పడుకుంది" అన్నది; నేను దగ్గరలో ఉన్న కుర్చీ లాక్కుని, కూర్చున్నాను

"గుంటూరు తీసుకెళ్ళారని చెప్పకపోయినారా?" అన్నాను, కాసేపుండి.

"నమ్మితేనా? — చివరికి నలుగురి చేతా చెప్పిస్తే, అప్పు డూరుకుంది" అన్నది

నేను మాట్లాడకుండా సిగరెట్టు వెలిగించి, వరాండాలోని గుడ్డిదీపం కేసి చూస్తున్నాను.

"ఆ పుట్టిన బిడ్డని తల్చుకుని కాసే పేడ్చింది" అన్నది, మళ్ళీ.

నేను మాట్లాడ్లేదు; అత్తయ్య వేపు చూశాను.

"బిడ్డ పోయిన విషయం దాయటం మావల్ల కాలేదు" అన్నది, విచారంగా.

"అది కష్టం లే—" అన్నాను.

"బిడ్డ అవతల ఉన్నాడమ్మా అంటే వింటేనా — తీసుకురమ్మంది. చివరికి ఒప్పుకోక తప్పిందిగాదు అక్కణ్ణుంచి తన మొగుడి విషయం గూడా అట్లాగే దాస్తున్నారంది చివరికి వాళ్ళ చేతా, వీళ్ళ చేతా చెప్పిస్తే ఊరుకుంది నేను చీవాట్లు గూడా వేశాను: నిక్షేపంలా గుంటూర్లో మందు తినటానికి వస్తే, వెనక కూతెలన్నీ కూస్తావేమని అక్కడికి ఊరుకుంది" అన్నది అత్తయ్య

నేను సిగరెట్టు చివర పరీక్షగా చూస్తున్నాను

"ఆ బిడ్డ కనుపున పడితే [illegible] ప్రాణానికి సుఖం లేదు" అన్నది, కాసేపుండి; నేను మాట్లాడ్లేదు "ఇంతేనా, నా కర్మగా నాయనా – ఒక్క గానొక్క కూతురు ఇట్లా అయిపోతుంటే చూడవలసిన దౌర్భాగ్యం నాపాలిటి [illegible]" అన్నది. తిరిగి; అత్తయ్య వెక్కి వెక్కి ఏడవటం మొదలు పెట్టింది

"ఊరుకో అత్తయ్యా" అన్నాను; అత్తయ్య మానలేదు

"ఊరుకో – పెద్దదానివి నీవే ఇట్లా అవుతే, శకుంతల ఎంగ తేరుకోవాలి!" అన్నాను అత్తయ్య ఇంకా వెక్కి వెక్కి ఏడవటం మొదలు పెట్టింది

"ఇక అది లేచిందంటే, [illegible] మానదు" అన్నాను, సిగరెట్టు వతల పారేసి. అత్తయ్య వస్తున్న దుఃఖాన్ని మింగటానికి యత్నిస్తున్నది

"కర్మ ఇంటిదగ్గర లేస్తారా?" అన్నాను

"శకుంతల మామగారు ఇందాక నే ఇంటికి వెళ్ళారు; ఆయన ప్రాణం [illegible] పోతున్నది" అన్నది అత్తయ్య, విచారంతో మింగి

"అమ్మా" అని నీరసంగా పల్చింది శకుంతల; నా గుండెలు ఆగిపోయినై

అత్తయ్య లేచి నిలబడ్డది "మంచినీళ్ళు" అన్నది శకుంతల.

"వస్తానత్తయ్యా" అని ఇంటికి బైలుదేరాను. అత్తయ్య, "మంచిది నాయనా" అని, శకుంతలదగ్గిరికెళ్ళింది.

ఆత్మకు సంబంధించిన మట్టరికపు రూపాన్ని గుర్తించటం అసంభవం, పైమెరుగుల తళతళలను భ్రమసి. గుర్తించా ననుకున్నాను. (ఇంకావుంది)

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St Madra



"గోష్ఠ శావరి"—శిలా ప్రతిమ.

—శిల్పకారుడు అబ్దు రహ్మానోవ్. (టాస్ వార్తాసంస్థ)